26 . 2. 2026

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

గురువారం | రంగారెడ్డి, నల్లగొండ

సంపుటి :07 సంచిక : 261 , పేజీలు : 12 వెల:రూ.5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH

తెలుగు దిన పత్రిక

www.velthuru.com

velthuru Newspaper



## సిఎం రేవంత్‌తో అడోబ్ సిఇవో శంతన్ భేటీ

**హైదరాబాద్,ఫిబ్రవరి 25 వెలుతురు:** తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని అడోబ్ సీఈవో శంతను నారాయణ్ కలిశారు. హైదరాబాద్‌లో సీఎంతో ఆయన భేటీ అయ్యారు. తెలంగాణ రైజింగ్ బోర్డు సభ్యుడిగానూ శంతను కొనసాగుతున్న నేపథ్యంలో గ్లోబల్ ట్రెండ్స్, కొత్త అవకాశాలతో రేవంత్‌తో చర్చించారు. ఉద్యోగాలపై ఏఐ ప్రభావం, గ్రీన్ ఎనర్జీ, ప్రభుత్వపరంగా చేపట్టాల్సిన చర్యలు తదితర అంశాలపై చర్చ జరిగింది. ఏఐని సమర్థంగా వినియోగించుకునే విషయంపై శంతను నారాయణ్‌తో రేవంత్ చర్చించారు.

## తెలంగాణలో ఇంటర్ పరీక్షలు ప్రారంభం

### క్షుణ్ణంగా తనిఖీ చేసి పంపిన అధికారులు

**హైదరాబాద్,ఫిబ్రవరి 25 వెలుతురు:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం నుంచి

### రాష్ట్ర వ్యాప్తంగా తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలకు

# శాశ్వత భవనాలు

రాష్ట్రంలో ప్రజలకు మరింత సౌకర్యవంతమైన, పారదర్శకమైన పరిపాలన అందించాలనే లక్ష్యంతో తహసీల్దార్ మరియు ఆర్డీవో కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార & పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మొదటి దశలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న 60 తహసీల్దార్ కార్యాలయాలు, 5 ఆర్డీవో కార్యాలయాలకు ఆధునిక సౌకర్యాలతో శాశ్వత భవనాలు నిర్మిస్తామని వెల్లడించారు.అలాగే రెండవ విడతలో శిథిలావస్థలో ఉన్న 170 ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాలను నిర్మిస్తామని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని భవనాలు ఒకే నమూనాలో, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా డిజైన్ చేయనున్నట్లు తెలిపారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారితో చర్చించి డిజైన్లకు తుది రూపు ఇస్తామని చెప్పారు. తక్కువ ఖర్చుతో ప్రజలకు అత్యుత్తమ సేవలు అందేలా ఈ భవనాల నిర్మాణం ఉంటుందన్నారు.

## ప్రజలకు గౌరవప్రదమైన సేవలే లక్ష్యం

**రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార & పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**



**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 25:** బుధవారం సచివాలయంలో తన కార్యాలయంలో రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులతో మంత్రిగారు సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ఎన్ని తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి, శిధిలావస్థ, పాలనకు అనువుగా లేని భవనాలు వివరాలను సేకరించారు."ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగడం సరైంది కాదు. ప్రజలకు సేవలందించే కేంద్రాలు గౌరవప్రదంగా ఉండాలి" అన్న గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆలోచనకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నామని మంత్రి స్పష్టం చేశారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు, ఏర్పడిన తర్వాత కూడా రెవెన్యూ కార్యాలయాలు ప్రజలకు సౌకర్యవంతంగా లేకపోవడంతోపాటు చాలా వరకు అద్దె భవనాలలోనే కొనసాగుతున్నాయని అన్నారు. గత ప్రభుత్వం ముందుచూపు లేకుండా, ప్రణాళికాబద్ధత లేకుండా మండలాల పునర్విభజన చేపట్టిందని, కొన్ని మండలాలు రెండు మూడు జిల్లాల పరిధిలోకి వచ్చే విధంగా రూపొందించిందని మంత్రి విమర్శించారు. అనేక కార్యాలయాల్లో కనీస వసతులు లేకపోవడం, సిబ్బంది కొరత తీవ్రంగా ఉండడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త మండలాలకు అవసరమైన పోస్టులు మంజూరు చేసి పరిపాలనను బలోపేతం చేశామని తెలిపారు. అలాగే ప్రజలకు దూరంగా కలక్టరేట్‌లను నిర్మించి నిర్వహణను గాలికివదిలేశారని విమర్శించారు.

స్టాంప్స్ & రిజిస్ట్రేషన్ శాఖలో అత్యాధునిక వసతులతో సమీకృత భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని మంత్రి తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లోని 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 12 క్లస్టర్లుగా విభజించి సమీకృత భవనాలు నిర్మిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే గచ్చిబౌలి, మేడ్చల్-మల్కాజిగిరి, పఠాన్ చెరువులలో భవనాలకు శంకుస్థాపన పూర్తయ్యిందని, గచ్చిబౌలిలో నిర్మాణ పనులు తుది దశలో ఉండి మరికొద్ది నెలల్లో ప్రారంభానికి సిద్ధమవుతుందని తెలిపారు. రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థను ఆధునికీకరించి, ప్రజలకు వేగవంతమైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు.

## భారత్, ఇజ్రాయెల్ ప్రాచీన నాగరికత కలిగిన దేశాలు

- ఇజ్రాయెల్ పార్లమెంటులో ప్రధాని మోదీ ప్రసంగం,
- మోదీ గొప్ప స్నేహితుడన్న నెతన్యాహు
- ఉగ్రవాదానికి పూర్తి వ్యతిరేకమన్న ప్రధాని మోదీ
- ఉగ్రవాదం విషయంలో ఎవరైనా ద్వంద్వ వైఖరి విడనాడాలని సూచన



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి25( వెలుతురు):** ఇజ్రాయెల్ పార్లమెంటులో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగించారు. ఉగ్రవాదంపై పోరులో అండగా ఉంటామని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు హామీ ఇచ్చారు. మోదీ మాట్లాడుతూ, ఉగ్రవాదానికి తాము పూర్తి వ్యతిరేకమని, భారత్ దశాబ్దాలుగా ఈ సమస్యతో ఇబ్బందిపడుతోందని అన్నారు. ఇజ్రాయెల్ పార్లమెంటులో ప్రసంగించిన తొలి

# ఆర్థిక మూలాలు పెంచేలా చేయాలి

- పశుసంవర్ధకశాఖను అభివృద్ధి పరచాలి
- కొత్త ఆలోచనలతోనే పశుసంవర్ధక శాఖలో మార్పులు
- బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేయండి

### అధికారులతో మంత్రి వాకిటి శ్రీహరి సమీక్ష



**హైదరాబాద్,ఫిబ్రవరి25 వెలుతురు:** పాడి పరిశ్రమ పరిపూర్ణంగా ముందుకు సాగితేనే తెలంగాణ అభివృద్ధి సాధ్యం అని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించేలా నివేదికలు తయారు చేయండని మంత్రి సూచించారు. ఆర్థికంగా ఎదిగేలా ప్రభుత్వ పథకాలను రూపొందించాలన్నారు. పశుసంవర్ధక శాఖకు సంబంధించి హర్యానా, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల మోడల్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పశుసంవర్ధక, పాడి పరిశ్రమలో ఏం చేస్తే సక్సెస్ అవుతామో అధ్యయనం చేయాలన్నారు. ఆరోగ్యకరమైన తెలంగాణను నిర్మిస్తేనే భవిష్యత్ బాగుంటుందని, అందుకోసం స్వచ్ఛమైన పాలు, బలమైన పోషకాలు ఉన్న చికెన్, మటన్, చేపల ఉత్పత్తి చేయాలన్నారు. ఉన్నతాధికారులు, అధికారులు సమన్వయం చేసుకుంటూ బాధ్యతతో పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని సూచించారు. ఆర్థిక స్వావలంబన లభించే పథకాలను రూపొందించి అమలుచేద్దాం అని అన్నారు. తెలంగాణకు ఆర్థిక మూలాలు



## రాష్ట్రంలో అదుపుతప్పిన శాంతిభద్రతలు

- బాన్సువాడలో శృతిమించిన ఎంఐఎం ఆగడాలు
- కామారెడ్డి, నిజామాబాద్ ఘటనలపై డిజిపికి బిజెపి ఫిర్యాదు

**హైదరాబాద్,ఫిబ్రవరి25 వెలుతురు:** తెలంగాణలో శాంతిభద్రతలు దెబ్బతిన్నాయని, హిందువులు లక్ష్యంగా దాడులు పెరిగాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు అన్నారు. కామారెడ్డి ఘటనలో కాంగ్రెస్ గూండాగిరి బయటపడిందన్నారు. ఈ మేరకు తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డిని రామచంద్రరావు

## గతం కన్నా ధృడంగా అమెరికా ఆర్థిక వృద్ధి

- దేశాన్ని మరింత ధృడంగా నిర్మించడమే లక్ష్యం
- సాదాసీదా స్థాయి నుంచి దృఢ అమెరికాను నిర్మించా
- పౌరుల సంక్షేమానికి తొలి ప్రాధాన్యం ఇస్తున్నాం
- ఇరాన్ అణు కార్యాక్రమాలతో అప్రమత్తంగా ఉన్నాం
- తన పాలనా ప్రయాణం యుగాలకు మలుపు
- స్టేట్ ఆఫ్ ది యూనియన్ కార్యక్రమంలో ట్రంప్ సుదీర్ఘ ప్రసంగం



**వాషింగ్టన్,ఫిబ్రవరి 25 వెలుతురు:** అమెరికా గతంలో కన్నా దృఢంగా, మెరుగ్గా, సుసంపన్నంగా మారిందని ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. ఇది అమెరికాకు స్వర్ణయుగం అని ఆయన వెల్లడించారు. మంగళవారం

## కుమ్మెర ఘటన మానవత్వానికే మచ్చ

- దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలి
- పసిపాప కుటుంబానికి కెటిఆర్ పరామర్శ

**నాగర్‌కర్నూల్,ఫిబ్రవరి25 వెలుతురు:**



నాగర్ కర్నూల్ జిల్లాలో ఇటీవల కుమ్మెర మల్లన్న జాతరలో జరిగిన గొడవలో రెండు నెలల చిన్నారి మృతిచెందిన ఘటనలో దోషులు ఎంతటి వారైనా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ డిమాండ్ చేశారు. బాధిత కుటుంబ సభ్యులను బుధవారం కెటిఆర్ పరామర్శిం చారు. తమకు న్యాయం చేయాలని చిన్నారి కుటుంబ సభ్యులు ఆందోళన చేస్తున్నారు. బాధిత కుటుంబం ఆందోళన చేస్తున్న శిబిరం వద్దకి వెళ్లి వారితో మాట్లాడి ధైర్యం చెప్పారాయన. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. ఘోరాతి ఘోరమైన మానవత్వానికి మచ్చ తెచ్చే విధంగా చిన్నారిని హత్యచేశారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. రెండు నెలల పసిగుడ్డు ప్రాణాలు తీసిన హంతకులను ప్రభుత్వం వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. మల్లన్న జాతరలో చిన్నారి తల్లి దర్శనం అడిగినందుకు ఆ పాపను పొట్టనపెట్టుకున్నారని మండిపడ్డారు. దేవుడు దర్శనం అడిగిన పాపానికి.. దాడి చేసి మానవత్వానికే మచ్చ తెచ్చారని ఆగ్రహించారు. ఈ దారుణానికి పాల్పడిన వారు ఎంతటి వారైనా శిక్ష

### వెలిగొండ పూర్తి కాకుండానే

# జగన్ రిబ్బన్ కట్

- పనులు పూర్తయ్యాయని దొంగమాటలతో మోసం
- వెలిగొండ పూర్తి చేసి రైతుల కష్టాలు తీరుస్తా
- పనిచేసే ప్రభుత్వాని అండగా ఉండాలి
- ఇచ్చిన మాట ప్రకారం మార్కాపురం జిల్లా చేశా
- వెలిగొండ ప్రాజెక్టు పనులు పరిశీలించిన చంద్రబాబు



**మార్కాపురం,ఫిబ్రవరి25 వెలుతురు:** జగన్ హయాంలో వెలిగొండ ప్రాజెక్టు పనులను నిర్లక్ష్యంగా వదిలేశారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెలిగొండ పనులు పూర్తి అయ్యాయని జగన్ దొంగ మాటలు చెప్పారని ఎద్దేవా చేశారు. పనులు పూర్తికాకుండానే జగన్ రిబ్బన్ కటింగ్ చేశారని సెటైర్లు గుప్పించారు. ఇక్కడి రైతులు సాగునీరు లేకుండా అనేక ఇబ్బందులు పడ్డారని చెప్పుకొచ్చారు. వెలిగొండ ప్రాజెక్టు వల్ల మార్కాపురం జిల్లాకు అనేక లాభాలు ఉన్నాయని వివరించారు. బుధవారం మార్కాపురం జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటించారు. వెలిగొండ ప్రాజెక్టు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు భారీ బహిరంగ సభలో ప్రసంగించారు. మార్కాపురం జిల్లా ప్రజలు తనకు ఘనస్వాగతం పలికారని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. పోలవరం



## ఎప్‌స్టీన్‌ను కలవడం తప్పే

- రష్యన్ అమ్మాయిలతో సంబంధాలు నిజమే
- అయినా తానెలాంటి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడలేదు
- మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ ఆవేదన

**న్యూయార్క్,ఫిబ్రవరి25 వెలుతురు:** మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకులు బిల్ గేట్స్ మరోసారి వార్తల్లో నిలిచారు. అమెరికా కోర్టు

## రాష్ట్రంలో అదుపుతప్పిన శాంతిభద్రతలు

బుధవారం కలిశారు. ఈ సందర్భంగా కామారెడ్డి, నిమాజాబాద్ జిల్లాల్లో జరిగిన ఘటనలపై డీజీపీకి ఫిర్యాదు చేశారు. అనంతరం రామచంద్రరావు మీడియాతో మాట్లాడుతూ.. కొన్నిరోజుల క్రితం బాన్సువాడలో ఎంఐఎం నేతలు ఆందోళనలు సృష్టించారని తెలిపారు. ఈ ఘటనపై నిరసన తెలిపిన హిందూ యువకులను పోలీసులు అరెస్ట్ చేశారన్నారు. దాదాపు 27 మంది హిందూ యువకులను జైలుకు పంపారని తెలిపారు. హిందూ కుటుంబాలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని రామచంద్రరావు మండిపడ్డారు. కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణా రెడ్డి క్యాంప్ ఆఫీసుపై కాంగ్రెస్ నేతలు దాడి చేసేందుకు యత్నించారని ఆయన అన్నారు. నిజామాబాద్‌లో అడ్వకేట్ కళ్యాణిపై ఎంఐఎం నేతలు దాడి చేశారని ఆరోపించారు. 'నామ్ కే వాస్తే' దాడి చేసిన వారిపై చర్యలు తీసుకుంటున్నారని రామచంద్రరావు మండిపడ్డారు. హిందూ ఆలయాలపై దాడులు జరుగుతున్నాయని రామచంద్రరావు తెలిపారు. చాంద్రాయణ గుట్ట, ముత్యాలమ్మ గుడి, సికింద్రాబాద్‌లో హిందూ ఆలయాలపై దాడులు జరిగాయని పేర్కొన్నారు. వీటిని ప్రోత్సహిస్తున్నది కాంగ్రెస్ కాదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాలు మానుకోవాలని డిమాండ్ చేశారు. సీఎం వద్దే హోం శాఖ ఉందని.. తెలంగాణలో మరీ ముఖ్యంగా ఉత్తర తెలంగాణలో శాంతి భద్రతలు దెబ్బతిన్నాయని ఆయన విమర్శలు గుప్పించారు. పోలీసులు అరెస్ట్ చేసిన హిందూ యువకులను వెంటనే విడుదల చేయాలని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని రామచంద్రరావు డిమాండ్ చేశారు.

## కుమ్మెర ఘటన మానవత్వానికే మచ్చ

పడాల్సిందేనని హెచ్చరించారు. పసిగుడ్డు ముఖం చూసి తండ్రిని వదలిపెట్టమని ప్రాధేయపడ్డ.. వదలకుండా కాలితో ఆ పాపను తన్నితే చనిపోయింది. యూనిఫామ్‌కి విలువ లేకుండా హంతకులను కాపాడే ప్రయత్నం పోలీసులు చేస్తున్నారు. రెండు నెలల పసిగుడ్డుకు కులం తెలుసా..?, మనుషులను చిన్నచూపు చూసి దర్శనానికి రానివ్వకుండా చేయడం ఘోరం. హంతకులు ఎవరైనా.. ఏ పార్టీవారైనా కచ్చితంగా శిక్షించాల్సిందే. ఈ ఘటనకు కారణమైనా ఎనిమిది మందిని అరెస్టు చేయాల్సిందే. శిక్షపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిందే. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ ఘటనపై స్పందించాలి. బాధిత కుటుంబానికి ప్రభుత్వం కోటి రూపాయల నష్టపరిహారం చెల్లించాల్సిందే. పొత్తిళ్లలోని పసిగుడ్డును హత్య చేసిన హంతకులను కఠినంగా శిక్షించాల్సిందే. న్యాయం జరిగేదాకా పోరాటం ఆపకండి. దుర్మార్గులను శిక్షించేదాకా వదిలిపెట్టొద్దు. ఈ ఘటనకు కారణమైనా ఎనిమిదిమందిపై హత్యానేరం మోపకపోతే శాసనసభలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని నిలదీస్తాం. బాధిత కుటుంబాన్ని కంటికి రెప్పల కాపాడుకుంటాం. కులం, మతం లేదు.. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా మేం అండగా ఉంటాం' అని కేటీఆర్ భరోసా కల్పించారు.

## తెలంగాణలో  ఇంటర్ పరీక్షలు ప్రారంభం

ప్రారంభమయ్యాయి. విద్యార్థులు వారికి కేటాయించిన పరీక్షా కేంద్రాలకు ఉదయాన్నే చేరుకున్నారు. దీంతో ఎక్కడ చూసినా సందడి వాతావరణం నెలకొంది. పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులను ఆయా కళాశాలల సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేశారు. తెలంగాణలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. బుధవారం ఉదయం 9 గంటలకు ఫస్టియర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. గురువారం నుంచి సెండియర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇంటర్ పరీక్షల కోసం రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 1495 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 9.97 లక్షల మంది పరీక్షలకు హాజరవుతున్నారు. ఇంటర్ పరీక్షలకు హాల్ టికెట్ ఉంటేనే అనుమతిస్తున్నారు. వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్లను పరీక్షకు అనుమతిస్తారు. హాల్‌టికెట్‌పై ప్రిన్సిపాల్ సంతకం లేకపోయినా ఎంట్రీ ఉంటుంది. ఒక్క హాల్‌టికెట్ వెంట ఉంటే సరిపోతుంది. ఎలాంటి గుర్తింపు పత్రాలు అవసరంలేదు. ఈాజాగా సమాధాన పత్రాల మూల్యాంకనం షెడ్యూల్‌ను ఇంటర్‌బోర్డు ప్రకటించింది. మార్చి 4 నుంచి సంస్కృతం పేపర్ల మూల్యాంకనం ప్రారంభమవుతుంది. మార్చి 15నుంచి మొదటి విడత, మార్చి 18నుంచి రెండో విడత, మార్చి 20 నుంచి మూడో విడత మూల్యాంకనం ప్రారంభమవుతుంది. ఏప్రిల్ రెండో వారంలో ఫలితాలు విడుదల చేస్తారు.

## మచిలీపట్నంలో పట్టపగలే భారీ దోపిడి

**- టీచర్ ఇంట్లో 50 తులాల బంగారం, నగదు చోరీ**

మచిలీపట్నం,ఫిబ్రవరి25 : కృష్ణా జిల్లా మచిలీపట్నంలో పట్టపగలే భారీ చోరీ చోటుచేసుకుంది. చిలకలపూడి సర్కార్ తోట ప్రాంతంలో ఓ ఉపాధ్యాయురాలి ఇంట్లో ఈ ఘటన చోటుచేసుకుంది. గుడ్లవల్లేరు మండలం కౌతరం ఉర్దూ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న మార్గరెట్ బుధవారం ఉదయం తన ఇంటికి తాళాలు వేసుకొని పాఠశాలకు వెళ్లారు. రంజాన్ మాసం కావడంతో పాఠశాలకు మధ్యాహ్నం సెలవు ప్రకటించడంతో ఆమె ఇంటికి వచ్చారు. తలుపులు పగలగొట్టి ఉండటంతో ఇంట్లో చోరీ జరిగిందని నిర్ధరించుకుని.. చిలకలపూడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు క్లూస్ టీంతో ఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. దాదాపు 50 తులాల బంగారం, రూ.1,40,000 నగదు చోరీ జరిగినట్లు బాధితురాలు తెలిపారు.

## భారత్, ఇజ్రాయెల్ ప్రాచీన నాగరికత కలిగిన దేశాలు

ప్రధానిని తానేనని, దీనిని గొప్ప గౌరవంగా భావిస్తున్నానని మోదీ అన్నారు. భారత్, ఇజ్రాయెల్ ప్రాచీన నాగరికత కలిగిన దేశాలని తెలిపారు. ఉగ్రవాదాన్ని సహించే పరిస్థితి లేదని అన్నారు. హమాస్ దాడి చేసి పౌరులను చంపడం దారుణమని అన్నారు. ఇజ్రాయెల్‌కు అనేక అంశాల్లో భారత్ అండగా నిలుస్తోందని మోదీ తెలిపారు. హమాస్ దాడుల తర్వాత మీ బాధలను భారత్ పంచుకుందని అన్నారు. ఉనికి కోసం యూదులు చాలా కష్టపడ్డారని పేర్కొన్నారు. ఉగ్రవాదం విషయంలో ఏ దేశమైనా ద్వంద్వ వైఖరిని విడనాడాలని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. చర్చలకు భారత్ ఎప్పుడూ సిద్ధమని, తాము శాంతిని కోరుకునే వాళ్లమని అన్నారు. ఇజ్రాయెల్ అందించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని తాము మరిచిపోలేమని అన్నారు. యూదులు ఉనికి కోసం అనేక కష్టాలు పడ్డారని గుర్తు చేశారు. రక్షణ, భద్రత విషయంలో రెండు దేశాల మధ్య ఒప్పందాలు జరిగాయని తెలిపారు. ఇజ్రాయెల్ సాయంతో భారత్ వ్యవసాయ రంగంలో సరికొత్త మార్పులు వచ్చాయని పేర్కొన్నారు. ఇజ్రాయెల్ పార్లమెంటులో ప్రధాని మోదీకి స్వాగతం పలికిన అనంతరం ఆ దేశ ప్రధాని నెతన్యాహు మాట్లాడారు. మోదీ ఇజ్రాయెల్ పర్యటన ఎంతో సంతోషకరమని, ప్రపంచ దేశాల్లో మోదీ గొప్ప నాయకుడని ప్రశంసించారు. తనకు మోదీ స్నేహితుడికంటే ఎక్కువ అన్నారు. మోదీ నేతృత్వంలో భారత్ వేగంగా అభివృద్ధి సాధిస్తోందని అన్నారు. అనేక సమయాల్లో ఇజ్రాయెల్‌కు భారత్ అండగా నిలబడిందని గుర్తు చేసుకున్నారు.

## బాలిక పునర్విక వైద్యం కోసం సాయం

**- ఎక్స్ వేదికగా స్పందించిన మంత్రి లోకేశ్**

**అమరావతి,ఫిబ్రవరి25 వెలుతురు:**

ఎస్ఎంఏ టైప్ -1తో బాధపడుతున్న కర్నూలుకు చెందిన పునర్విక అనే బాలిక చికిత్సకు సాయం చేసేందుకు మంత్రి నారా లోకేశ్ ముందుకొచ్చారు. సాయం చేయాలని బాలిక తల్లిదండ్రులు 'ఎక్స్'లో అభ్యర్థించడంతో మంత్రి స్పందించారు. ఈ అరుదైన వ్యాధితో కండరాలు క్రమంగా బలహీనపడతాయన్నారు. ఈ స్థితిలోనూ ధైర్యంగా పునర్విక పోరాడుతున్న తీరును కొనియాడారు. ఆమె ఇంజక్షన్‌కు రూ.16 కోట్లు అవసరమని పేర్కొన్నారు. ఇప్పటికే



దాతలు స్పందించి రూ.10 కోట్లు సమకూర్చడం హర్షణీయమన్నారు. మిగిలిన రూ.6 కోట్లు సమకూర్చడం తన బాధ్యత అని చెప్పారు. ప్రతి ఒక్కరూ సాయం అందించాలని కోరారు. ఈ అంశంపై మంత్రి నారా లోకేశ్ స్పందించడంపై సినీ నటుడు మంచు మనోజ్ కృతజ్ఞతలు తెలిపారు.

# ఆర్థిక మూలాలు పెంచేలా చేయాలి

పెంచేలా పశుసంవర్ధకశాఖను అభివృద్ధి పరచాలని మంత్రి వాకిటి శ్రీహరి అధికారులకు దిశానిర్దేశర చేశారు. . కొత్త ఆలోచనలతోనే పశుసంవర్ధక శాఖలో మార్పులు తీసుకురాగలమని మంత్రి వాకిటి శ్రీహరి ఆశాభావం వ్యక్తం చేశారు. పాడి పరిశ్రమ పరిపూర్ణంగా ముందుకు సాగితేనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని వివరించారు. బడ్జెట్‌లో నిధులు ఎన్ని కేటాయించారనేది కాకుండా ఎంతమేరకు ఖర్చు చేశామనే ఆలోచన చేసుకోవాలని మంత్రి వాకిటి శ్రీహరి సూచించారు. బ్జడెట్ లో అధిక నిధులు కేటాయించేలా నివేదికలు తయారు చేయాలని అధికారులను మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశించారు. ఆర్థికంగా ఎదిగేలా ప్రభుత్వ పథకాలను రూపొందించాలని మంత్రి సూచించారు.  పశుసంవర్ధక శాఖకు సంబంధించి హర్యానా, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల మోడల్‌ను ఆదర్శంగా తీసుకొని రాష్ట్రంలో పథకాలను డిజైన్ చేయాలని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. పశుసంవర్ధక, పాడి పరిశ్రమలో ఏం చేస్తే సక్సెస్ అవుతామో అధ్యయనం చేయాల్సిన అవసరముందన్నారు. ఆరోగ్యకరమైన తెలంగాణను నిర్మిస్తేనే భవిష్యత్ బాగుంటుందని మంత్రి వాకిటి శ్రీహరి అభిప్రాయపడ్డారు. అందుకోసం స్వచ్ఛమైన పాలు, బలమైన పోషకాలు ఉన్న చికెన్, మటన్, చేపల ఉత్పత్తి రాష్ట్రంలో జరుగాలని మంత్రి శ్రీహరి అన్నారు. ఉన్నతాధికారులు, అధికారులు సమన్వయం చేసుకుంటూ బాధ్యతతో పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని మంత్రి వాకిటి స్పష్టం చేశారు.పాడి రంగానికి సంబంధించి అన్ని అంశాలు బ్జడెట్‌లో పొందుపరచాలని, పాల ఉత్పత్తి, అందుకావాల్సిన మౌలిక సదుపాయాలు, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని మంత్రి శ్రీహరి అన్నారు. పాడి పరిశ్రమ బలోపేతం, సమన్వయం కోసం ఐఏఎస్ స్థాయి అధికారిని నియమించుకోవాలని, దానివల్ల పాల ఉత్పత్తిని పెంచుకోవొచ్చని మంత్రి వాకిటి శ్రీహరి ఆశాభావం వ్యక్తం చేశారు. వెటర్నరీ సంస్థల్లో మౌలిక సదుపాయాలు, ఉద్యోగుల సంక్షేమం వంటి అంశాలకు కూడా బ్జడెట్‌లో ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. షెడ్యూల్ ప్రకారం పశువులకు టీకాలు, ఔషధాల సరఫరా జరిగేలా, దానికి బ్జడెట్‌లో కేటాయింపులు ఉండాలని అధికారులకు మంత్రి వివరించారు. గతంలో లాగా కాకుండా పశుసంవర్ధక శాఖను బలోపేతం చేయాలని మంత్రి అధికారులకు వివరించారు. ఈసమీక్ష సమావేశంలో రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ, మత్స్య శాఖ సెక్రటరీ సురేంద్ర మోహన్ ఈంఅ, డైరెక్టర్ గోపీ, డెయిరీ డెవలంప్‌మెంట్ ఎండీ చంద్రశేఖర్ రెడ్డి, పివి నర్సింహారావు వెటర్నరీ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ డా.జ్ఞానప్రకాశ్, ఉన్నతాధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# గతం కన్నా ధృడంగా అమెరికా ఆర్థిక వృద్ధి

స్టేట్ ఆఫ్ ది యూనియన్ కార్యక్రమంలో ట్రంప్ మాట్లాడుతూ.. ఇది చారిత్రాత్మక కాలంగా అభివర్ణించారు. తన పరిపాలన ప్రయాణం.. యుగాలకు మలుపుగా ఉంటుందని తెలిపారు. దేశ ఆర్థికాభి వృద్ధి పరుగులు పెడుతుందన్నారు. భవిష్యత్తులో దేశాన్ని మరింత మెరుగు పరుస్తామని ట్రంప్ విశ్వాసం వ్యక్తం చేశారు. అలాగే జాతీయ పునరుజ్జీవం, ఆర్థిక వృద్ధితోపాటు ప్రపంచ ప్రభావంపై దృష్టి సారించినట్లు డొనాల్డ్ ట్రంప్ వివరించారు. ప్రపంచ స్థాయిలో అమెరికా మెరుగుపడిందని ధీమా వ్యక్తం చేశారు. ఇటీవల వరకు అమెరికా సాదాసీదాగా ఉండేదని.. కానీ ప్రస్తుతం ప్రపంచంలోనే అగ్ర భాగాన నిలిచిందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారం.. ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్‌ను పురుషుల హాకీ ఒలింపిక్స్ విజేత కానర్ హెల్లెబ్యూక్‌కు ప్రదానం చేయనున్నట్లు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. గత తొమ్మిది మాసాల్లో అమెరికాలోకి ప్రవేశించిన అక్రమ వలసదారులు శాతం సున్నాకు చేరిందని పేర్కొన్నారు. 2028లో ఒలింపిక్స్‌కు అమెరికా వేదిక కానుందని ప్రకటించారు. ప్రజలకు జవాబుదారీగా ఉండే ప్రభుత్వాన్ని నిర్మిస్తున్నామని ప్రజలకు భరోసా ఇచ్చారు. పౌరుల సంక్షేమానికే తమ తొలి ప్రాధాన్యమన్నారు. బిగ్ బ్యూటిఫుల్ బిల్‌తో అమెరికన్లకు ఉపశమనం కలిగిందన్నారు. అలాగే సరిహద్దు భద్రత, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా పూర్తిగా నిరోధించామని ట్రంప్ చెప్పారు. దేశంలోని ఆర్థిక అంశాల ను సైతం ఈ సందర్భంగా ట్రంప్ ప్రస్తావించారు. గ్యాస్ ధరలు తగ్గించామని.. ఆ తర్వాత అంటే.. మూడు నెలల్లో యూఎస్ ఆర్థిక వ్యవస్థ పుంజుకుందన్నారు. తమ కొత్త స్నేహితుడు, భాగస్వామి అయిన వెనిజులా నుంచి 80మిలియన్ బ్యారెళ్ల చమురును తీసుకున్నామని ఆయన వివరించారు. ఇదంతా ఆ దేశ నాయకుడు నికోలస్ మదురోను పదవీచ్యుతుడిని చేసిన నాటినుంచి నేటివరకు ఇది చోటు చేసుకుందన్నారు. దాంతో అమెరికా చమురు ఉత్పత్తి రోజుకు 60 వేల బ్యారెళ్ల మేర పెరిగిందని సోదాహరణగా విపులీకరించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రచారంలో చేసిన ప్రతిజ్ఞ.. డ్రిల్, బేబీ, డ్రిల్‌ను ట్రంప్ ఉటంకించారు.  వాషింగ్టన్ డీసీలోని క్యాపిటల్ హిల్‌లో ఉభయసభలను ఉద్దేశించి ఆయన అతి సుదీర్ఘ ప్రసంగం చేశారు. సుమారు గంటా 50 నిమిషాల పాటు ట్రంప్ మాట్లాడారు. తన ప్రసంగాల్లో ఇదే అతిసుదీర్ఘమైందిగా రికార్డుకెక్కింది. 2000 సంవత్సరంలో అప్పటి అధ్యక్షుడు బిల్ క్లింటన్ అత్యధికంగా 90 నిమిషాల పాటు మాట్లాడారు. ఇప్పుడు ఆ రికార్డును ట్రంప్ బ్రేక్ చేశారు. గత ఏడాది మార్చిలో కూడా ట్రంప్ సుమారు 100 నిమిషాల పాటు ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించిన విషయం తెలిసిందే. ట్రంప్ తన ప్రసంగంలో ఎక్కువగా ఆర్థిక ఎజెండా గురించి ప్రస్తావించారు. ఇక ఇరాన్ అంశంలో వార్నింగ్ ఇచ్చారు. వాస్తవానికి ఆ సమస్యను దౌత్యం ద్వారా పరిష్కరించేందుకు ఇష్టపడుతున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. కానీ అణ్వాయుధాలను సమీకరిస్తున్న ఇరాన్ వైఖరిని మాత్రం ట్రంప్ ఖండించారు.

న్యూక్లియర్ వెపన్స్ ప్రోగ్రామ్‌ను ఇరాన్ విరమించుకోవాలన్నారు. అమెరికాను తాకే క్షిపణులను ఇరాన్ డెవలప్ చేస్తున్నట్లు ట్రంప్ వెల్లడించారు. కానీ దీనిపై ఆయన తన ప్రసంగంలో ఎటువంటి ఆధారాలను బయటపెట్టలేదు. యురోప్‌కు ప్రమాదంగా మారే కొన్ని మిస్సైల్స్‌ను ఇప్పటికే ఇరాన్ డెవలప్ చేసిందన్నారు. ఇతర దేశాల్లో ఉన్న అమెరికా బేస్‌లను కూడా టా÷-గ్గ÷ట్ చేసే రేంజ్ ఇరాన్‌కు ఉందన్నారు. ఇక అమెరికా భూభాగానికి చేరుకునే స్థాయికి తగ్గ క్షిపణులను కూడా ఇరాన్ అభివృద్ధి చేస్తున్నట్లు ట్రంప్ చెప్పారు. మిడిల్ ఈస్ట్‌పై ట్రంప్ ఎక్కువగా ఫోకస్ చేయడం వల్ల.. ఇరాన్‌తో యుద్ధానికి ఆ దేశం సిద్ధం అవుతుందేమో అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే తాము ఇచ్చిన డిమాండ్లను ఒకవేళ ఇరాన్ అంగీకరించకపోతే, అప్పుడు ట్రంప్ అనుకున్నంత పనిచేసే అవకాశాలు ఉన్నాయి. గత ఏడాది ఇరాన్ అణ్వాయుధ కేంద్రాలపై దాడి చేశామని, ఆ దాడి వల్ల ఆ దేశ న్యూక్లియర్ వెపన్స్ ప్రోగ్రామ్ స్తంభించినట్లు ట్రంప్ చెప్పారు. న్యూక్లియర్ వెపన్ అంశంలో ఇరాన్ ఇంకా ఎటువంటి హామీ ఇవ్వలేదన్నారు. అణ్వాయుధాలను తయారు చేయమన్న వ్యాఖ్యలు ఇంకా ఇరాన్ నుంచి రావడం లేదన్నారు.

# వెలిగొండ పూర్తి కాకుండానే జగన్ రిబ్బన్ కట్

ప్రాజెక్టు వల్ల ఏపీకి పూర్వ వైభవం వస్తుందని వ్యాఖ్యానించారు. పోలవరం జిల్లా ఇస్తానని చెప్పానని.. మాట నిలబెట్టుకున్నా నని, అలాగే మార్కాపురం, మదనపల్లె జిల్లాలు ఇచ్చామని స్పష్టం చేశారు. రాష్ట్రానికి పూర్వ వైభవం రావాలంటే అందరూ సహకరించాలని కోరారు. ఏపీకి మేలు చేసేందుకే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, తాను కలిశామని ప్రస్తావించారు. అరకు నుంచి ప్రకాశం జిల్లా వరకు కూటమిదే హవానని చెప్పుకొచ్చారు. వచ్చే ఎన్నికల్లో ఒంగోలు, మార్కాపురం జిల్లాలో నూరుశాతం స్ట్రైక్‌రేట్ ఇవ్వాలని పిలుపునిచ్చారు. మార్కాపురం జిల్లా చేస్తానని చెప్పా.. మాట నిలబెట్టుకున్నానని తెలిపారు. మదనపల్లెకు కూడా న్యాయం చేస్తానని చెప్పా.. చేశానని ప్రస్తావించారు. మూడు వరాలు ఇచ్చేందుకు మార్కాపురం వచ్చానని తెలిపారు. 1995లో మార్కాపురం ప్రజల కష్టాలు తాను చూశానని గుర్తుచేశారు. వెలిగొండ ప్రాజెక్టుతో రైతుల జీవితాలు బాగుపడతాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. 2014 నుంచి 2019 మధ్య వెలిగొండ పనులను పరుగులు పెట్టించామని చెప్పారు. మార్కాపురం వెనుకబడిన ప్రాంతమని.. 1996 మార్చి 5వ తేదీన ఈ ప్రాంతానికి వచ్చానని.. ఎక్కడ చూసినా ఫ్లోరైడ్ నీళ్లు కనిపించేవని గుర్తుచేశారు. తమకు శ్రీశైలం నీళ్లు కావాలని ఆనాడు ప్రజలు అడిగారన్నారు. కృష్ణా జలాలు తీసుకొస్తానని ఆరోజు మాట ఇచ్చానని.. వెలిగొండకు ఫౌండేషన్ తానే వేశానని.. పూర్తిచేసే అవకాశం తనకే వచ్చిందని పేర్కొన్నారు. ఒట్టి మాటలు చెప్పి మోసం చేయడం తనకు రాదని చెప్పుకొచ్చారు. 2014 వరకు వెలిగొండ పనులు నత్తనడకన సాగాయని విమర్శించారు. వెలిగొండతో 4 లక్షల ఎకరాలకు పైగా సాగులోకి వస్తాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ పనులపై చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశర చేశారు. బుధవారం దోర్నాల మండలం గంటవానిపల్లి వద్ద వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులని పరిశీలించారు. రూ.456 కోట్లతో ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా స్థానిక రైతులతో కలిసి ఫీడర్ కెనాల్‌లో సీఎం చంద్రబాబు తిరిగారు. స్థానికంగా ఏఏ పంటలు పండిస్తున్నారో అన్నదాతలని అడిగి తెలుసుకున్నారు. లైనింగ్ పనుల గురించి అధికారులతో చర్చించారు. వెలిగొండ ప్రాజెక్టు పనుల పురోగతిలో వేగం పెంచాలని మార్గనిర్దేశర చేశారు. లలాగే, వెలిగొండ రెండో టన్నెల్‌లో పని చేస్తున్న ఇంజనీర్స్‌తో లైవ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. టన్నెల్‌లో లైనింగ్ పనులని లైవ్‌లో పరిశీలించారు. జూన్ 15వ తేదీ నాటికి టన్నెల్‌లో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. జూన్ 15వ తేదీన వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభిస్తానని అధికారులకు సీఎం స్పష్టం చేశారు. ప్రతి సోమవారం వెలిగొండ ప్రాజెక్టు పనులపై సమీక్షిస్తానని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. మంచి చేసిన వారికి అండగా ఉంటేనే మీ జీవితాలు మారతాయి. ప్రతి విషయంలో మీకు అండగా చంద్రన్న ఉంటాడు. మార్కాపురం జిల్లాను ఉద్యానవనంగా తయారు చేస్తాం. పండ్లతోటల వల్ల రైతుల ఆదాయం బాగా పెరుగుతుంది. గతేడాది హంద్రీనీవా ప్రాజెక్టుపై దృష్టి సారించా. ఈ ఏడాది వెలిగొండపై దృష్టి పెట్టానని చంద్రబాబు అన్నారు. కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఎప్‌స్టీన్‌ను కలవడం తప్పే

ఇటీవల విడుదల చేసిన జెఫ్రీ ఎప్‌స్టీన్ పత్రాల్లో బిల్ గేట్స్ పేరు ఉండటం తీవ్ర చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. ఈ విషయమై ప్రపంచ టెక్ దిగ్గజం గేట్స్ మరోసారి స్పష్టత ఇచ్చారు. ఇప్పటికే ఎప్‌స్టీన్‌తో తనకున్న సంబంధాలపై స్పందించిన ఆయన.. తాజాగా ఆ రహస్య ఫైళ్ల గురించి ప్రస్తావించారు. ఈ సందర్భంగా గేట్స్ ఫౌండేషన్ సిబ్బందికి క్షమాపణలు చెప్పారు. కానీ తాను ఏనాడూ చట్టవిరుద్ధ పనులు చేయలేదని పేర్కొన్నారు. లైంగిక నేరగాడు ఎప్‌స్టీన్‌తో గతంలో తనకున్న సంబంధాలపై స్పందిస్తూ గేట్స్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. తన దాతృత్వ సంస్థ 'బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్' ఉద్యోగులతో నిర్వహించిన ఒక ప్రత్యేక భేటీ సందర్భంగా.. ఈ అంశంపై బహిరంగంగా క్షమాపణలు చెప్పారు. ఎప్‌స్టీన్‌తో సమయం గడపడం తన జీవితంలో చేసిన అతిపెద్ద తప్పు అని ఆయన అంగీకరించారు. అలాగే రష్యన్ అమ్మాయిలతో సంబంధాలున్నాయంటూ తనపై వస్తోన్న ఆరోపణలపైనా గేట్స్ స్పష్టతనిచ్చారు. ఈ సమావేశంలో గేట్స్ తన తప్పును ఒప్పుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారని వాల్ స్ట్రీట్ జర్నల్ తన కథనంలో రాసుకొచ్చింది. ఇక.. ఎప్‌స్టీన్‌తో తన సంబంధాలపై గేట్స్ ప్రస్తావిస్తూ.. 2011-14 మధ్య కాలంలో ఎప్‌స్టీన్‌ను పలుమార్లు కలిసినట్లు అంగీకరించారు. అయితే.. ఆ సమయంలో అతడికున్న క్రిమినల్ బ్యాక్‌గ్రౌండ్ గురించి అంత లోతుగా తనకు తెలియదన్నారు.

తన మాజీ భార్య మెలిండా గేట్స్ మొదటి నుంచీ ఎప్‌స్టీన్ విషయంలో తనను హెచ్చరించిందని.. ఆ విషయంలో మెలిండాకు క్రెడిట్ ఇవ్వాల్సిందేనని పేర్కొన్నారు గేట్స్. ప్రస్తుతం జరుగుతున్న చర్చలను బట్టిచూస్తే.. నాడు తాను చేసిన పొరపాటు నేడు వందల రెట్లు పెద్దదిగా కనిపిస్తోందని ఆయన ఆవేదన చెందారు. 'ఎప్‌స్టీన్‌తో సమయం గడపడం నాడు నేను చేసిన అతిపెద్ద తప్పు. గేట్స్ ఫౌండేషన్ కార్య నిర్వాహకులను అతడి సమావేశాలకు తీసుకురావడమూ తప్పే. నా పొరపాటు వల్ల ఈ వివాదంలో ఇరుక్కున్న ప్రతి ఒక్కరికీ నేను క్షమాపణలు చెబుతున్నాను. మా ఫౌండేషన్ విలువలకు, లక్ష్యాలకు ఇది పూర్తిగా విరుద్ధం' అని గేట్స్ చెప్పినట్టు తెలిపింది.

ఫౌండేషన్ ప్రతిష్ఠ చాలా సున్నితమైనదని.. ఇలాంటి సంఘటనలు తమతో కలిసి పనిచేసే ప్రజల నిర్ణయంపై తీవ్ర ప్రభావం చూపుతాయని టెక్ దిగ్గజం ఆందోళన వ్యక్తం చేశారని అందులో పేర్కొంది. అమెరికా న్యాయ శాఖ ఇటీవల విడుదల చేసిన పత్రాల్లో.. ఎప్‌స్టీన్ రాసిన కొన్ని ఇ-మెయిల్ డ్రాఫ్టులు వెలుగులోకి వచ్చాయి. అందులో బిల్ గేట్స్‌కు డ్రగ్స్ సరఫరా చేయడం సహా రష్యన్ అమ్మాయిలతో సంబంధాలు ఏర్పాటు చేసేందుకు తాను సహకరించానని ఎప్‌స్టీన్ పేర్కొన్నాడు. ఈ ఆరోపణలను నాటి నుంచీ గేట్స్ ఖండిస్తూనే ఉన్నారు. తాను ఎలాంటి చట్టవిరుద్ధమైన పనులు చేయలేదని స్పష్టం చేశారు. ఆ ఫొటోల్లో తన పక్కన ఉన్న మహిళలు ఎప్‌స్టీన్ సహాయకులు మాత్రమేనని.. కావాలనే వారి ముఖాలకు మాస్క్ వేశారన్నారు. అలాగే ఎప్‌స్టీన్ వేధింపులకు గురైన బాధితులతో తాను ఏనాడూ సమయం కేటాయించలేదని గేట్స్ చెప్పుకొచ్చారు.


# బీహార్‌లో ఓ పెళ్లి వేడుకలో విషాదం

**- వధువుపై తుపాకీతో కాల్పులు జరిగిన దుండగుడు**

**- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వధువు**

**పాట్నా,ఫిబ్రవరి25( వెలుతురు):**


బీహార్‌లోని బక్సర్‌లో మంగళవారం రాత్రి జరిగిన వివాహ వేడుకలో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. ఆ పెళ్లికి వచ్చిన వధువు ప్రియుడు ఘోరానికి పాల్పడ్డాడు. అందరూ



చూస్తుండగానే వధువుపై కాల్పులు జరిపాడు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. బక్సర్‌కు చెందిన పద్దెనిమిదేళ్ల ఆ కుమారికి మంగళవారం వివాహం జరుగుతోంది. మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో ఆర్తి తనకు కాబోయే భర్తతో వేదికపై ఉంది. ఆ జంట చుట్టూ స్నేహితులు, కుటుంబ సభ్యులు ఉన్నారు. వధువు ఆర్తి సోదరి, నవదంపతులకు సిందూరం పెడుతున్న సమయంలో ఈ షాకింగ్ ఘటన జరిగింది. వేదిక ముందు గుమిగూడిన అతిథులలో ఒక వ్యక్తి ఆర్తిపై కాల్పులు జరిపాడు. బుల్లెట్ ఆర్తి కడుపులోకి దూసుకెళ్లింది. వెంటనే ఆమె కుప్పకూలిపోయింది. దీంతో వివాహ వేదిక వద్ద గందరగోళం నెలకొంది. మండపంలో కాల్పులు జరుగుతున్నాయనుకుని చాలా మంది కల్యాణ మండపం నుంచి బయటకు పరుగులు తీశారు. రక్తపు మడుగులో పడి ఉన్న ఆర్తిని సమీపంలోని హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. అక్కడ ప్రాథమిక చికత్స అనంతరం సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు తరలించారు. ప్రస్తుతానికి ఆమె పరిస్థితి ఇంకా విషమంగానే ఉందని సమాచారం. నిందితుడిని అదే గ్రామానికి చెందిన దీనబంధుగా గుర్తించారు. ఆర్తి, దీనబంధు మధ్య గతంలో ప్రేమ వ్యవహారం సాగిందని తెలుస్తోంది. కాగా, ప్రస్తుతం నిందితుడు పరారీలో ఉన్నాడు. పోలీసులు అతని తల్లిదండ్రులను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

# 8వ తరగతి పాఠ్యాంశంలో 'న్యాయవవస్థలో అవినీతి'

- పాఠ్యాంశంపై తీవ్రంగా స్పందించిన సుప్రీంకోర్టు
- వెంటనే తొలగిస్తామని ప్రకటించిన కేంద్రం




**న్యూఢిల్లీ,ఫిబ్రవరి25 వెలుతురు:**
ఎన్‌సీఈఆర్‌టీ 8వ తరగతి పాఠ్యాంశంలో 'న్యాయవవస్థలో అవినీతి' అంశాన్ని ప్రవేశపెట్టడంపై సుప్రీంకోర్టు సీరియస్ కావడంతో కేంద్రం వెంటనే స్పందించింది. పాఠ్యాంశం లోని భాగాలను తొలగించేందుకు నిర్ణయించింది. పాఠ్యాంశంలో ఆవిధంగా వచ్చి ఉండాల్సింది కాదని, దీనికి బదులు స్ఫూర్తిదాయకమైన విషయాలను రాసి ఉండాల్సిందని కేంద్రం అభిప్రాయపడినట్టు ఉన్నత స్థాయి వర్గాలు తెలిపాయి. ఎన్‌సీఈఆర్‌టీ 8వ తరగతి పాఠ్యాశంలో న్యాయవ్యవస్థలో అవినీతి అంశాన్ని ప్రవేశపెట్టడంపై సుప్రీంకోర్టు బుధవారంనాడు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ వ్యవహారం న్యాయవాదులు, న్యాయమూర్తులందరినీ కలవరానికి గురి చేసిందని, న్యాయవ్యవస్థ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తే ఊరుకునేది లేదని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని సీజేఐ సూర్యకాంత్ పేర్కొన్నారు. 'కొన్ని రోజులు ఆగండి. దీనిపై నేను సుమోటోగా విచారణ చేపడతాను' అని తెలిపారు. న్యాయవ్యవస్థలో అవినీతి గురించి 8వ తరగతి విద్యార్థులకు ఎన్‌సీఈఆర్‌టీ బోధిస్తోందని సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ సుప్రీంకోర్టు దృష్టికి తెచ్చారు. మంత్రులు, ఎమ్మెల్యేలు సహా రాజకీయ నేతలు పెద్దఎత్తున అవినీతికి పాల్పడుతుంటే ప్రభుత్వాలు ఎందుకు దాచిపెడుతున్నాయని ప్రశ్నించారు. ఎంపిక చేసి మరీ న్యాయవ్యవస్థనే నిలదీస్తున్నట్టు కనిపిస్తోందని సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి సైతం అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్‌సీఈఆర్‌టీ ఇటీవల న్యాయవ్యవస్థ అనే అధ్యాయాన్ని విస్తరించింది. న్యాయవ్యవస్థలో ఉన్న అవినీతి అంశాన్ని తొలిసారిగా ప్రవేశపెట్టింది. విద్యార్థులు కేవలం సిద్ధాంత పరమైన అవగాహనకే పరిమితం కారాదని, వ్యవస్థలోని సవాళ్లు, లోపాలు, వాస్తవ పరిస్థితుల గురించి కూడా తెలుసుకోవాలనే లక్ష్యంతో ఈ మార్పులు చేసినట్టు చెబుతోంది. లక్షలాది కేసులు, విచారణలో జరుగుతున్న జాప్యం వంటి అంశాలను పాఠ్యాంశంలో ప్రస్తావించింది. అయితే పాఠ్యాంశంలో తాజా మార్పుల వల్ల చిన్నారులలో న్యాయవ్యవస్థపై ప్రతికూల భావన పెరగవచ్చనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# బిఎస్ఎన్ఎల్ డైరెక్టర్ కక్కుర్తి

- ప్రయాగ్ రాజ్ పర్యటనలో వ్యక్తిగత పనులకు సిబ్బంది
- ఏర్పాట్లకు పురమాయించడంతో వైరల్
- షోకాజ్ నోటీస్ జారీచేసిన కేంద్రం

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి25 వెలుతురు:**



భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ సీనియర్ డైరెక్టర్ వివేక్ బంజల్ వివాదంలో చిక్కుకున్నారు. యూపీలోని ప్రయాగ్‌రాజ్ పర్యటనకు వెళ్లేందుకు ఆయన విస్తృత ఏర్పాట్లు చేసుకోవడం, ఇందుకు సంబంధించిన ఆయన చేసిన డిమాండ్లు వైరల్ కావడంతో కేంద్రం సీరియస్ అయింది. ఆయనకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. వారం రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఈ వ్యవహారం తమకు దిగ్భ్రాంతి కలిగించిందని, ఇదెంతమాత్రం ఆమోదయోగ్యం కాదని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు. అధికారి వివరణ తర్వాత తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. షెడ్యూల్ ప్రకారం వివేక్ బంజాల్ ఈనెల 25-26 తేదీల్లో ప్రయాగ్‌రాజ్ పర్యటనకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఆయన పర్యటనకు ఏర్పాట్లు చేయాలని డిప్యూటీ మేనేజర్ స్థాయి కార్యాలయం నుంచి ఆదేశాలు వెళ్లాయి. సుమారు 50 మంది బీఎస్ఎన్ఎల్ సిబ్బందిని కేటాయించాలని ఆ ఆదేశాల్లో పేర్కొన్నారు. సిబ్బందికి 20 పనులు కూడా కేటాయించారు. ప్రయాగ్‌రాజ్‌లో అడుగుపెట్టగానే సంగమంలో స్నానం, పడవపై విహారం, హనుమాన్ మందిరం, అక్షయ్ వాత్, పాటల్పురి ఆలయాల దర్శనం చేయించడం వంటి పనులు సిబ్బంది చూసుకోవాల్సి ఉంటుంది. తువాలు, అండర్ గార్మెంట్స్, చెప్పులు, దువ్వెన, అద్దం, షాంపూ, ఆయిల్ బాటిల్, ఘాట్ వద్ద వినియోగానికి ఒక బెడ్‌షీటు వంటివి అందుబాటులో ఉంచాలి. హోటల్, సర్క్యూట్ హౌస్ వంటి సదుపాయాలు కల్పించాలి. బంజల్ పర్యటనకు సంబంధించిన ఆదేశాలు ఆన్‌లైన్‌లో వెలుగుచూడటంతో ఈ వ్యవహారం సంచలనమైంది. కేంద్ర వెంటనే చర్యలకు దిగడం, షోకాజ్ నోటీస్ జారీచేయడంలో బంజల్ పర్యటన రద్దయింది. అయితే, అధికారిక పర్యటనలో ఇచ్చే స్థాయీ ఉత్తర్వులనే తాము ఇచ్చినట్టు బీఎస్ఎన్ఎల్ ఇండియా వర్గాలు చెబుతున్నాయి. బంజల్ 1987 బ్యాచ్ ఇండియన్ టెలికమ్యూనికేషన్ సర్వీస్ అధికారి. ఎలక్ట్రానిక్స్‌లో బ్యాచిలర్ ఆఫ్ ఇంజినీరింగ్ డిగ్రీ, కంప్యూటర్ సైన్స్‌లో మాస్టర్ ఆఫ్ ఇంజినీరింగ్ డిగ్రీ చేసారు. ఎంబీఏ కూడా చదివారు. ఇండియాలో టెలికామ్ నెట్‌వర్క్ నిర్వహణలో 34 ఏళ్ల అనుభవం ఉంది.

## జీనుగురాలలో పల్లె ప్రకృతి వనంలో 200 చెట్ల నరికివేత


- ప్రకృతి వనాలపై పగబట్టడం దుర్మార్గమైన చర్య అన్న కెటిఆర్

**హైదరాబాద్,ఫిబ్రవరి 25( వెలుతురు):**
కాంగ్రెస్ కబంద హస్తాల్లో చిక్కుకుని రెండేళ్లుగా విలవిలలాడుతున్న తెలంగాణలో మనషులనే కాదు.. చివరికి పచ్చని చెట్లను కూడా బతకనివ్వడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ప్రతి పల్లెలో పచ్చదనం ఉండాలనే మహోన్నత లక్ష్యంతో కేసీఆర్ నిర్మించిన ప్లలె ప్రకృతి వనాలపై కూడా పగబట్టడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. మహబూబ్ నగర్‌లోని దేవరకద్ర మండలం జీనుగురాలలో పల్లె ప్రకృతి వనంలోని 200 చెట్లను కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులే నిర్దాక్షిణ్యంగా నరికివేయడం దారుణమని కేటీఆర్ విమర్శించారు. పదేళ్లపాటు ఆహ్లాద వాతావరణంలో కళకళలాడిన ప్లలెలను అన్నిరకాలుగా ధ్వంసం చేస్తున్న కాంగ్రెస్ నిజస్వరూపం రోజుకో రూపంలో బయటపడుతోందని తెలిపారు. ఇప్పటికే చెక్ డ్యామ్‌లను పేల్చివేస్తున్నారని.. చెరువులను చెరబట్టారని.. వ్యవసాయాన్ని కుప్పకూల్చారని.. కులవృత్తులను కాలరాశారని పేర్కొన్నారు. ఇప్పుడు నీడనిచ్చే చెట్లను కూడా అడ్డంగా నరికేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే ఈ దుశ్చర్యకు పాల్పడిన ప్రతి ఒక్కరిపై కేసు నమోదుచేసి కఠినంగా శిక్షించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. 'పల్లె కన్నీరు పెడుతుందో' అని మరోసారి పాడుకునే దుస్థితి తెచ్చిన కాంగ్రెస్ పార్టీపై తెలంగాణలోని ప్రతి గ్రామం తిరగబడే రోజు దగ్గర్లోనే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

# సుజల్ గ్రామ సంవాద్ నాలుగో సంచికను స్థానిక భాషల్లో నిర్వహించిన డీడీడబ్ల్యూఎస్

- కార్యక్రమంలో పాల్గొన్న అయిదు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతానికి చెందిన 6 గ్రామ పంచాయతీలు

**వెలుతురు 25 ఫిబ్రవరి 2026 పిఐబీ ఢిల్లీ:**
నీటి నిర్వహణలో సామాజిక భాగస్వామ్యానికి, సమాజ నేతృత్వంలో జల్ జీవన్ మిషన్ (జేజేఎం) అమలులో భారత ప్రభుత్వ నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ.. 'సుజల్ గ్రామ్ సంవాద్' నాలుగో సంచికను కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని తాగునీరు, పారిశుద్ధ్య విభాగం (డీడీడబ్ల్యూఎస్) విజయవంతంగా నిర్వహించింది.



వర్చువల్ విధానంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ప్రతినిధులు, గ్రామీణ నీటి-పారిశుద్ధ్య కమిటీ (వీడబ్ల్యూఎస్‌సీ) సభ్యులు, పౌరులు, మహిళా ఎస్‌హెచ్‌జీలు, విద్యార్థులు, క్షేత్ర స్థాయి కార్యకర్తలు పాల్గొన్నారు. వీరితో పాటుగా జేజేఎం మిషన్ డైరెక్టర్లు, జిల్లా కలెక్టర్లు/జిల్లా మెజిస్ట్రేట్లు/డిప్యూటీ కమిషనర్లు, డీడబ్ల్యూఎస్ఎం అధికారులు, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.
సుజల్ గ్రామ సంవాద్ నాలుగో సంచికలో భాగంగా 6 గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో గ్రామస్థాయి చర్చలు జరిగాయి. ఈ కార్యక్రమంలో నమోదు చేసుకున్న 2,000 మంది పాల్గొన్నారు. ఇది సమాజం, అధికారులకు ఉన్న దృఢ నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. అలాగే గ్రామ పంచాయతీ స్థాయిలో మహిళలు, చిన్నారులు, యువత, వృద్ధులతో సహా ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దీంతో నమోదు చేసుకున్న వారి సంఖ్య కంటే ఎక్కువ సామూహిక భాగస్వామ్యం కనిపించింది.
దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి మౌలిక వసతుల కల్పనపై జేజేఎం దృష్టి సారించిందని డీడీడబ్ల్యూఎస్ కార్యదర్శి శ్రీ అశోక్ కేకే మీనా అన్నారు. ఈ వ్యవస్థలు స్థిరంగా కొనసాగేలా చూడటమే అత్యంత కీలకమన్నారు. మౌలిక వసతులను ఏర్పాటు చేసిన అనంతరం, సమర్థమైన కార్యకలాపాలు, నిర్వహణ వ్యవస్థల ద్వారా క్రమం తప్పకుండా గృహాలకు తాగునీటిని సరఫరా చేయడంలోనే అసలైన బాధ్యత ఉందన్నారు. అలాగే స్థిరంగా సేవలను అందించడమే కేంద్రీయ ప్రాధాన్యం కావాలని తెలియజేశారు.
నీటి సరఫరా నిర్వహణ ప్రాథమికంగా స్థానిక సంస్థల బాధ్యత అని ఆయన తెలిపారు. పథకాల అమలులో గ్రామపంచాయతీలు, వీడబ్ల్యూఎస్‌సీలు పోషించే కీలకపాత్ర గురించి కూడా ఆయన వివరించారు. భవిష్యత్తులో నీటి సరఫరా వ్యవస్థల బాధ్యతను గ్రామపంచాయతీలకు ఇవ్వడంపై ప్రధాన దృష్టి సారిస్తున్నామని, తద్వారా నిర్వహణ, నియంత్రణలో వాటికి పూర్తి అధికారం లభిస్తుందన్నారు. ఈ పరివర్తనకు అవసరమైన సాంకేతిక, నిర్వహణ సహకారాన్ని అందించడానికి జిల్లా సాంకేతిక విభాగం (డీటీయూ)తో సహా ఇతర సంస్థాగత వ్యవస్థలను బలోపేతం చేస్తామని ఆయన వివరించారు.

# ఏఐ విప్లవం ముందు భారత ఐటీ రంగం యువత భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టిన కేంద్ర ప్రభుత్వ వైఫల్యం



**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 25:**
కృత్రిమ మేధస్సు (ఏఐ ) ప్రపంచ ఆర్థిక వ్యవస్థను వేగంగా మార్చుతున్న ఈ కీలక సమయంలో, భారతదేశంలోని ప్రముఖ ఐటీ సంస్థలు Infosys, TCS, Wipro వంటి సంస్థలపై వస్తున్న "ఏఐ ఐశీశీఎంఝఎ" హెచ్చరికలు దేశ భవిష్యత్తుపై తీవ్రమైన ఆందోళనలను కలిగిస్తున్నాయి. ఒకప్పుడు ప్రపంచానికి ప్రతిభను అందించి, లక్షలాది యువతకు స్థిరమైన ఉద్యోగ అవకాశాలను కల్పించిన భారత ఐటీ రంగం, ఇప్పుడు ఏఐ విప్లవం ముందు అసురక్షిత స్థితిలో నిలవడం బాధాకరం. గత రెండు దశాబ్దాల్లో భారతదేశం ప్రపంచ ఐటీ రంగంలో ఒక విశ్వసనీయ శక్తిగా ఎదిగింది. భారత యువత ప్రతిభ ప్రపంచ కంపెనీలకు వెన్నెముకగా మారింది. మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భద్రత, గౌరవప్రదమైన జీవితం ఐటీ రంగం ద్వారా లభించింది. భారతదేశం "గ్లోబల్ టాలెంట్ క్యాపిటల్"గా గుర్తింపు పొందింది. కానీ, గత 10 సంవత్సరాల్లో కేంద్ర ప్రభుత్వం దేశాన్ని భవిష్యత్తు సాంకేతిక పరిణామాలకు సిద్ధం చేయడంలో విఫలమైంది. స్వదేశీ ఏఐ ఉత్పత్తులు, ఒరిజినల్ టెక్నాలజీ ప్లాట్‌ఫార్ములు, మరియు Deep RÊDలో పెట్టుబడులు పెట్టాల్సిన సమయంలో, కేంద్ర ప్రభుత్వం ప్రచార కార్యక్రమాలు, ఈవెంట్ మేనేజ్‌మెంట్ రాజకీయాలు, మరియు నినాదాలకే పరిమితమైంది. ప్రస్తుతం ఏఐ ఆటోమేషన్ కారణంగా లక్షలాది ఉద్యోగాలు ప్రమాదంలో పడే పరిస్థితి ఏర్పడింది. కొత్త ఉద్యోగ అవకాశాలు తగ్గిపోతుండటం, ఫ్రెషర్స్‌కు అవకాశాలు దొరకకపోవడం, మరియు ఐటీ రంగంలో నియామకాలు మందగించడం యువతలో తీవ్ర అనిశ్చితిని కలిగిస్తోంది. ఒకప్పుడు ఉద్యోగాల కోసం ప్రపంచం భారత్ వైపు చూసేది. కానీ ఇప్పుడు భారత యువతే ఉద్యోగ భద్రత కోసం ఆందోళన చెందాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇది కేవలం ఒక సాంకేతిక మార్పు కాదు ఇది ఒక ఆర్థిక మరియు సామాజిక సంక్షోభానికి సంకేతం. యువతకు ఉద్యోగ భద్రత లేకపోతే, దేశ ఆర్థిక వ్యవస్థ కూడా బలహీనపడుతుంది. యువత నిరాశలో పడితే, దేశ అభివృద్ధి కూడా నిలిచిపోతుంది. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని, కింది కీలక చర్యలను తక్షణమే చేపట్టాలి, స్వదేశీ ఏఐ టెక్నాలజీ అభివృద్ధికి భారీ పెట్టుబడులు పెట్టాలి Deep RÊD మరియు Innovation రంగాల్లో జాతీయ స్థాయి ప్రణాళిక రూపొందించాలి యువతకు AI, Machine Learning, Deep Tech రంగాల్లో శిక్షణ మరియు అవకాశాలు కల్పించాలి స్టార్టప్‌లకు బలమైన ఆర్థిక మరియు విధాన పరమైన మద్దతు ఇవ్వాలి పబ్లిక్ ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను నిర్మించి, భారత టెక్నాలజీ స్వావలంబనను బలోపేతం చేయాలి యూనివర్సిటీఇండస్ట్రీ భాగస్వామ్యాన్ని బలోపేతం చేసి, పరిశోధనను ప్రోత్సహించాలి భారతదేశం కేవలం సేవల కేంద్రంగా కాకుండా, ప్రపంచాన్ని నడిపించే ఆవిష్కరణల కేంద్రంగా మారాలి. భారత యువతకు ఉద్యోగ భద్రత కల్పించడం, దేశ భవిష్యత్తును రక్షించడం కేంద్ర ప్రభుత్వపు ప్రథమ బాధ్యత. ప్రచారం, నినాదాలు, మరియు ఈవెంట్ మేనేజ్‌మెంట్‌తో దేశ భవిష్యత్తు సురక్షితం కాదు. నిజమైన నాయకత్వం అంటే భవిష్యత్తును ముందుగానే అంచనా వేసి, దేశాన్ని సిద్ధం చేయడం. భారతదేశం తన యువతను కోల్పోతే, తన భవిష్యత్తునే కోల్పోతుంది. ఇప్పుడు Innovation ఎంపిక కాదు,అది దేశ ఆర్థిక భద్రతకు, యువత భవిష్యత్తుకు అత్యవసరం. కేంద్ర ప్రభుత్వం వెంటనే కార్యాచరణ ప్రణాళికను ప్రకటించి, భారత యువతకు భరోసా కల్పించాలి.

# ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ లో 590 కోట్ల మోసం

- నలుగురు మాజీ బ్యాంక్ ఉద్యోగుల అరెస్ట్





**చండీగఢ్,ఫిబ్రవరి25( వెలుతురు):**
ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ చండీగఢ్ బ్రాంచ్‌లో 590 కోట్ల రూపాయలు మోసానికి గురైన సంగతి తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి యాంటీ కరప్షన్ బ్యూరో అధికారులు దర్యాప్తును వేగవంతం చేశారు. కేసుతో సంబంధం ఉన్న నలుగురు వ్యక్తుల్ని అరెస్ట్ చేశారు. మాజీ బ్రాంచ్ మేనేజర్ రిభవ్ రిషి, మాజీ రిలేషన్‌షిప్ మేనేజర్ అభయ్, రిభవ్ భార్య స్వాతీ సింగ్లా, ఆమె సోదరుడు అభిషేక్ సింగ్లాలను పోలీసులు అరెస్ట్ చేశారు. రిభవ్, అభయ్‌లు ప్రధాన నిందితులని అధికారులు తెలిపారు. యాంటీ కరప్షన్ బ్యూరో అధికారులు చెబుతున్న దాని ప్రకారం.. రిభవ్, అభయ్‌లు హర్యానా గవర్నమెంట్ డిపార్ట్‌మెంట్స్‌కు సంబంధించిన ఖాతాల్లోని డబ్బులను టార్గెట్ చేశారు. ఆ డబ్బులను స్వాతీ సింగ్లాకు చెందిన కంపెనీ 'స్వస్తిక్ దేశ్ ప్రాజెక్ట్'కు బదిలీ చేశారు. ఈ కంపెనీ షేర్స్‌లో స్వాతి 75 శాతం వాటా కలిగి ఉంది. మిగిలిన 25 శాతం షేర్స్ అభిషేక్ పేరు మీద ఉన్నాయి. నిందితులిద్దరూ దాదాపు 300 కోట్ల రూపాయలు కంపెనీకి మళ్లించారు. ఆరు నెలల క్రితం బ్యాంక్‌లో ఉద్యోగాలు మానేశారు. హార్యానా ప్రభుత్వానికి చెందిన ఓ డిపార్ట్‌మెంట్ ఆ బ్యాంక్‌లోని తమ ఖాతాను క్లోజ్ చేసి, డబ్బును వేరే బ్యాంక్ ఖాతాలోకి పంపాలని కోరింది. ప్రాసెస్ చేస్తున్న సమయంలో బ్యాంక్ అధికారులు మోసాన్ని గుర్తించారు. రికార్డ్స్‌లో ఉన్న డబ్బు మొత్తానికి.. బ్యాంక్ ఖాతాలో ఉన్న మొత్తానికి తేడా కనుగొన్నారు. ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ చండీగఢ్ బ్రాంచ్‌లో 590 కోట్ల రూపాయల మోసం జరిగినట్లు ఆదివారం బ్యాంక్ అధికారులు మీడియాకు వెల్లడించారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేపట్టిన ఇన్వెస్టిగేషన్ అధికారులు మాజీ బ్రాంచ్ మేనేజర్, మాజీ రిలేషన్‌షిప్ మేనేజర్‌లు ఈ మోసానికి పాల్పడినట్లు గుర్తించారు. వారితో పాటు మరో ఇద్దరిని కూడా అరెస్ట్ చేశారు.

# స్పీకర్ కోర్టులో మరో ఇద్దరి భవితవ్యం

- కడియం, దానంలపై తుది విచారణ
- 27,28 తేదీల్లో విచారణకు సిద్ధం

**హైదరాబాద్,ఫిబ్రవరి 25( వెలుతురు):**



తెలంగాణ రాజకీయాల్లో అత్యంత ఆసక్తి రేపుతున్న ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల వ్యవహారం కీలక దశకు చేరుకొన్నది. ఇప్పటికే 8మంది విషయంలో స్పీకర్ స్పష్టమైన తీర్పును ఇచ్చారు. వీరు పార్టీ మారినట్లుగా ఆధారాలు లేవని స్పీకర్ తీర్పును ఇచ్చారు. ఇప్పుడు మరో ఇద్దరు ఎమ్మెల్యేల వ్యవహారాన్ని తేల్చబోతున్నారు. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ప్రకారం దాఖలైన అనర్హత పిటిషన్లపై విచారణ జరిపేందుకు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ షెడ్యూల్‌ను ఖరారు చేశారు. ఈ నెల 27, 28 తేదీల్లో పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న దానం నాగేందర్, కడియం శ్రీహరి విచారణకు తమ వాదనలను వినిపించడంతోపాటు సాక్ష్యాధారాలను సమర్పించాల్సి ఉంటుందని షెడ్యూల్‌లో పేర్కొన్నారు. స్పీకర్ నేతృత్వంలోని ట్రిబ్యునల్ ఎదుట పిటిషనర్ల తరఫు న్యాయవాదులు అడిగే ప్రశ్నలకు దానం, కడియం సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. బీఆర్ఎస్ పార్టీ గుర్తుపై గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరలేదని నిరూపించుకోవడానికి అవసరమైన ఆధారాలను సమర్పించాల్సి ఉంటుంది. గత నెల 18న ఈ కేసులో పిటిషనర్ పాడి కౌశిక్‌రెడ్డిని దానం నాగేందర్ తరఫు న్యాయవాదులు ప్రశ్నించారు. 19న కడియం తరఫు లాయర్లు వివేకానందగౌడ్‌ను ప్రశ్నించారు. స్పీకర్ జారీచేసిన విచారణ షెడ్యూల్ ప్రకారం బీఆర్ఎస్ పార్టీకి చెందిన హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై ఈ నెల 27వ తేదీన ఉదయం 11:00 గంటలకు విచారణ ఉంటుంది. బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై మధ్యాహ్నం 12:00 గంటలకు విచారణ చేపడుతారు. 28వ తేదీన ఉదయం 11:00 గంటలకు బీఆర్ఎస్ పార్టీ కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానందగౌడ్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ ఉంటుంది. ప్రతివాది స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తరఫున సాక్ష్యాధారాలను సేకరిస్తారు.

# జార్ఖండ్ సిఎం సోరెన్‌కు సుప్రీంలో ఉపశమనం

- ఇడి కేసులపై స్టే ఇస్తూ ఆదేశాలు




**న్యూఢిల్లీ,ఫిబ్రవరి25( వెలుతురు):**
జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌కు సుప్రీంకోర్టులో ఉపశమనం లభించింది. సోరెన్‌పై మనీలాండరింగ్ చట్టం కింద ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చేపట్టిన క్రిమినల్ ప్రొసీడింగ్స్‌పై అత్యున్నత న్యాయస్థానం స్టే ఇచ్చింది. కేసు కొట్టేయాల్సిందిగా కోరుతూ సోరెన్ వేసిన పిటిషన్‌పై వివరణ ఇవ్వాలని సీజేఐ సూర్యకాంత్, న్యాయమూర్తులు జోయ్మాల్యా బాగ్చి, విపుల్ ఎం పంచోలితో కూడిన ధర్మాసనం ఈడీని అదేశించింది. పదేపదే తనకు ఈడీ సమన్లు జారీ చేస్తుండటాన్ని కూడా సోరెన్ తన పిటిషన్‌లో సవాలు చేశారు. ఈకేసులో విచారణ దాదాపు పూర్తి కావచ్చిందని, ఏడుసార్లు సమన్లు జారీ చేస్తే ఒక్కసారి కూడా సోరెన్ హాజరుకాలేదని విచారణ సందర్భంగా ఈడీ తరఫు న్యాయవాది పేర్కొన్నారు. అయితే సోరెన్ తరఫు హాజరైన సీనియర్ న్యాయవాది ఆ వాదనను తోసిపుచ్చారు. సోరెన్ మూడుసార్లు హాజరయ్యారని, ఈడీ ఆయనను అరెస్టు కూడా చేసిందని చెప్పారు. తమ పిటిషన్‌ను మెజిస్ట్రేట్ పరిగణనలోకి తీసుకున్న ఏడాది తర్వాత ఆలస్యంగా సోరెన్ క్వాషింగ్ పిటిషన్ వేసినట్టు ఈడీ తరఫు న్యాయవాది వాదించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ, ఈడీ బల్క్ కంప్లయింట్లు చేసినట్టు వార్తాపత్రికలో చదివామని, ఫిర్యాదులపై దృష్టిసారించడం కంటే నిర్మాణాత్మక ఫలితాలతో ముందుకు రావాలని ఈడీకి సూచించింది. సోరెన్‌కు భూముల కుంభకోణంలో ప్రమేయం ఉందని ఈడీ ప్రధాన ఆరోపణగా ఉంది. ఈ కేసును కొట్టివేయాలని సోరెన్ వేసిన పిటిషన్‌ను జనవరి 15న హైకోర్టు కొట్టివేసింది. దీంతో తమ సమన్లకు స్పందించడం లేదంటూ ఈడీ ఫిర్యాదు చేసింది. దీనిపై సుప్రీంకోర్టుకు వెళ్లడంతో ఈడీ క్రిమినల్ ప్రొసీడింగ్స్‌పై సుప్రీంకోర్టు స్టే ఇచ్చింది

# సంపాదకీయం..

# నాలగేళ్లయినా ముగియని ఉక్రెయిన్ సంక్షోభం !

ప్రపంచంలో ఏ యుద్ధాలను తీసుకున్నా నష్టపోతున్నది ప్రజలే. ఆయా దేశాలు ఆర్థికంగా నష్టపోతున్నాయి. ప్రపంచ దేశాలను నష్టాల కుంపట్లో పడేస్తున్నాయి. రష్యా,ఉక్రెయిన్ యుద్ధం మొదలై నాలుగేళ్లు దాటింది. ఎందుకు యుద్ధం మొదలు పెట్టారో తెలియడం లేదు. అలాగని ముగింపు కూడా పలకడం లేదు. ఈ రావణ కాష్టం ఇప్పట్లో చల్లారేలా లేదు. అగ్రరాజ్యం తలచుకుంటే అంతే సంగతులని రష్యా నిరూపిస్తే... అమెరికా దానిని నిజం చేసింది. రష్యా బాటలోనే అమెరికా కూడా అడపాదడపా దాడులతో ప్రపంచాన్ని గుప్పిట పెట్టుకోవాలని చూస్తోంది. ట్రంప్ అధికారంలోకి వచ్చాక భౌతిక దాడులతో పాటు, ఆర్థిక దాడులతో ప్రపంచాన్ని బెంబేలెత్తిస్తున్నారు. ఇకపోతే ఒకప్పటి సోవియట్ యూనియన్‌లోని ఉక్రెయిన్ అధినేత జెలెన్‌స్కీ చేష్టల కారణంగా రష్యాతో కయ్యానికి దిగారు. పుతిన్, ఎలన్‌స్కీ ఇద్దరూ బాగానే ఉన్నారు. కానీ ఇరు దేశాల ప్రజలు తీరని సంక్షోభంలో కూరుకు పోయాయరు. వేలాదిమంది మృత్యువాత పడ్డారు. ఫిబ్రవరి 24వ తేదీతో ఉక్రెయిన్ యుద్ధం ఐదెయేట ప్రవేశించింది. దీనికి బాధ్యులైన నాటో కూటమి దేశాలు ఎలా, ఎప్పుడు ముగింపు పలుకుతాయో తెలియటం లేదు.

నిజానికి ట్రంప్ కూడా ముగింపు చేసే సాహసం జరగడం లేదు. యుద్ధాలకు నేను ముగింపు పలుకుతున్నానని బీరాలు పలికిన ట్రంప్ ఈ యుద్ధాన్ని కూడా ఆపుతానని చెప్పినా, ఆ పని చేయలేక పోయారు. ఉక్రెయిన్ తాజా సంక్షోభానికి నాలుగేళ్లు నిండినప్పటికీ నిజానికి 2014 నుంచి ఈ అంతర్యుద్ధం కొనసాగుతున్నది. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ఐరోపా ఖండంలో దీర్ఘకాలం సాగిన పోరుగా ఇప్పటికే చరిత్రలో ఉక్రెయిన్ సంక్షోభం నమోదైంది. ఇది ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రపంచం మీద ప్రభావం చూపుతున్నది. ఏ దేశం కూడా ఎదుర్కోని తీవ్రమైన ఆంక్షలను రష్యా మీద



నాటో కూటమి దేశాలు అమలు చేస్తున్నాయి. రష్యాతో వాణిజ్య లావాదేవీలు నిర్వహించే భారత్ తదితర దేశాల మీద కూడా అపరాధ పన్నుల విధింపు, ఇతర చర్యలు తీసుకుంటామని అమెరికా బెదిరిస్తున్న సంగతి తెలిసిందే. రష్యా నుంచి చమురు కొనకుండా చేసిన ట్రంప్ ఎలా పెత్తనం సాగిస్తున్నాడో గమనించవచ్చు. ఇప్పటి వరకు ఉక్రెయిన్ పోరులో రెండు దేశాలకు జరిగిన నష్టాల గురించి పరస్పరం అతిశయోక్తులు తప్ప నిజానిజాలు వెల్లడి కావటం లేదు. రెండు వైపులా 20 లక్షల మంది సైనికులు గాయపడటం లేదా మరణించి ఉంటారన్నది ఒక అంచనా. పన్నెండున్నర లక్షల మంది రష్యన్లు మరణించి నట్లు ఉక్రెయిన్ అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే సిఎస్ఐఎస్ అనే సంస్థ 3.25 లక్షల మంది మరణించటంతో సహా పన్నెండు లక్షల మంది రష్యా వైపు బాధితులు ఉన్నట్లు చెబుతున్నది. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ఏ పోరులోనూ ఇంత నష్టం జరగలేదు. తమకు వ్యతిరేకంగా నాటో విస్తరణ పేరుతో ఉక్రెయిన్‌కు సభ్యత్వ మిచ్చి తమ ముంగిటకు అణ్వాయుధాలను మోహరించాలన్న అమెరికా ఎత్తుగడలను వమ్ము చేస్తూ గతంలో తన ప్రాంతంగా ఉన్న క్రిమియా ద్వీపాన్ని రష్యా ఆ ఏడాది విలీనం చేసుకుంది.

ఉక్రెయిన్ పాలకులు అప్పటి నుంచి రష్యన్లు మెజారిటీగా ఉన్న తమ డాన్‌బాస్ ప్రాంతంపై దాడులకు మిలిటరీని దించారు. దానికి వ్యతిరేకంగా ఆ ప్రాంతంలో తలెత్తిన తిరుగుబాటుకు రష్యా మద్దతు ఇచ్చింది. సైనిక చర్య ప్రారంభించి నప్పటి నుంచి నాలుగేళ్ల కాలంలో 26 శాతం ఉక్రెయిన్ ప్రాంతాన్ని తన ఆధీనంలోకి తెచ్చుకుంది. మెల్లమెల్లగా కొత్త ప్రాంతాలకు చొచ్చుకుపోతున్నది. ఈ నాలుగేళ్ల యుద్ధ పర్యవసానాలను పరిశీలిస్తే ఇది అంత తేలికగా ముగిసేలా లేదు. పుతిన్ కూడా వదిలేలా లేరు. ఇప్పుడున్న యథాతథ స్థితిలో పోరు ముగించటానికి తాము సిద్ధమేనని, అయితే డాన్‌బాస్ తూర్పు ప్రాంతంలో తమ మిలిటరీ అక్కడే ఉండాలని జెలెన్‌స్కీ పట్టుబడుతున్నాడు. ఉక్రెయిన్ తిరుగుబాటు ప్రాంతాలకు స్వాతంత్ర్యం ఇవ్వాలని, దాని మిలిటరీ బలం, ఆయుధాలను పరిమితం చేయాలని, మరేదేశ మిలిటరీ ఏ రూపంలోనూ ఉక్రెయిన్ గడ్డ మీద ఉండకూడదని పుతిన్ పునరుద్ఘాటిస్తున్నాడు. అయితే అమెరికా ప్రభావంలో ఉన్న జెలెన్‌స్కీ మాత్రం పాత సోవియట్ బంధాన్ని మరచి వ్యవహరించడమే యుద్ధానికి హేతువుగా గుర్తించాలి. ప్రస్తుతం రష్యా ఆధీనంలో ఉన్న ప్రాంతం పారిశ్రామికంగా, మిలిటరీ రవాణాకు కీలకమైన రైల్వేలు, రోడ్లు ఈ ప్రాంతంలోనే ఉన్నందున వాటిని వదులుకొనేందుకు పుతిన్ సిద్ధంగా లేడు. ఇకపోతే దాడుల కారణంగా ఉక్రెయిన్ జనాభా 4.2 కోట్ల మందిలో నాలుగో వంతు మంది ఇతర దేశాలకు తరలిపోయినట్లు చెబుతున్నారు. రష్యా ఆధీనంలోని ప్రాంతాలలో 50 లక్షల మంది నివశిస్తున్నారు. క్రిమియాతో సహా 26 శాతం భూ భాగాన్ని ఉక్రెయిన్ కోల్పోయింది. అయితే జెలెన్‌స్కీ దళాలు తిరిగి స్వాధీనం చేసుకున్న ప్రాంతాలను తీసి వేస్తే ఆ మొత్తం 20 శాతానికి తగ్గినట్లు మరొక అంచనా. గత మూడు సంవత్సరాల్లో పెద్దగా రష్యన్లు ముందుకు పోలేదని మరి కొందరు చెబుతున్నారు. రష్యా సైనిక చర్య ప్రారంభం నుంచి నాలుగేళ్లలో ఉక్రెయిన్ ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా నష్టపోయింది. రష్యా ప్రధాన కేంద్రీకరణ మౌలిక సదుపాయాలను నాశనం చేయటం, ఆర్థిక మూలాలను దెబ్బ తీయటంపైనే కొనసాగుతున్నది. విద్యుత్ సరఫరా తీవ్రంగా దెబ్బతిన్న కారణంగా ఫ్యాక్టరీలను నడిపేందుకు డీజిల్ జనరేటర్లను ఆశ్రయించాల్సిన దుస్థితి. మిలిటరీ చర్య ప్రారంభించిన తొలి రోజుల్లో పుతిన్ యంత్రాంగం వేసిన అంచనాలు దెబ్బతిన్నాయి. నాటో కూటమి దేశాలు ఉక్రెయిన్‌కు అవసరమైన ఆయుధాలు, ఆర్థిక సాయంతో పాటు రష్యన్ మిలిటరీ కదలికల గురించి కీలకమైన సమాచారాన్ని అందించటంతో తీవ్రమైన ఎదురుదెబ్బలు తగిలాయి. దాంతో వ్యూహం మార్చు కోవాల్సి వచ్చింది. కొన్ని వారాల్లో కీవ్ పతనం అవుతుందన మాస్కో అంచనాలు తప్పాయి. రష్యా కోరిన విధంగా కొంత ప్రాంతాన్ని కోల్పోయి ఒప్పందం చేసుకుంటే సరే లేకపోతే ఉక్రెయిన్ గెలిచే అవకాశాలు లేవని డోనాల్డ్ ట్రంప్ గతేడాది నవంబరులో బహిరంగంగానే చెప్పాడు. గతేడాది ఇరాన్ మీద దాడులు, మరోసారి హెచ్చరికలు, వెనిజులా అధ్యక్షుడిని అపహరించిన డోనాల్డ్ ట్రంప్ రష్యా మీద చర్యకు ఎందుకు వెనకాడుతున్నట్లు అని కొందరు విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు. రష్యా మీద ఎన్ని ఆంక్షలు విధించినప్పటికీ అవి పనిచేయటం లేదని ట్రంప్‌కు అర్థమైంది. మొత్తానికి ఈ రావణ కాష్టం చల్లారేలా లేదు. ఇరు దేశాలు కూర్చుంటేనే సయోధ్య కుదరగలదు. అమెరికాలాంటి దేశాలు, నాటో జోక్యం వల్లనే ఇది మరింత ముదిరిందన్న సుస్పష్టం.

## 2019 ఈస్టర్ బాంబు పేలుళ్ల కేసు

### - శ్రీలంక మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ అరెస్ట్



**కొలంబొ,ఫిబ్రవరి25( వెలుతురు):**
2019 ఈస్టర్ బాంబు పేలుళ్ల కేసులో శ్రీలంక మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్‌ను దర్యాప్తు అధికారులు అదుపులోకి తీసుకున్నారు. బుధవారం తెల్లవారుజామున రాజధాని శివారులో రిటైర్డ్ మేజర్ జనరల్ సురేష్ సల్లేను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈస్టర్ ఆదివారం పేలుళ్లకు కుట్ర పన్నడం, సహాయం చేయడం మరియు ప్రోత్సహించినందుకు ఆయనను అరెస్ట్ చేశారని అన్నారు. గోటబయ రాజపక్స అధ్యక్షుడైన తర్వాత 2019లో స్టేట్ ఇంటెలిజెన్స్ సర్వీస్ (ఎస్ఐఎస్) చీఫ్‌గా సురేష్ పదోన్నతి పొందారని, ఆత్మాహుతి బాంబుదాడులకు సహకారం అందించారని దర్యాప్తు అధికారులు పేర్కొన్నారు. సురేష్ ఇస్లామిక్ బాంబర్లతో సంబంధం కలిగి ఉన్నాడని, దాడికి ముందు వారిని కలిశారని బ్రిటన్ మీడియా 2023లో వెల్లడించింది. ఆ ఏడాది జరిగిన అధ్యక్ష ఎన్నికలను రాజపక్సకు అనుకూలంగా ప్రభావితం చేసేందుకు ఈ దాడిని కొనసాగించేందుకు ఆయన అనుమతించాడని ప్రజావేగు ఒకరు మీడియాకు తెలిపారు. 2019లో ఈస్టర్ పండుగ సమయంలో దేశవ్యాప్తంగా జరిగిన బాంబు పేలుళ్లలో 45మంది విదేశీయులు మరణించగా, 500మందికి పైగా గాయపడిన సంగతి తెలిసిందే.

## యాదాద్రిలో వైభవంగా బ్రహ్మోత్సవాలు

### - రామావతారంలో హనుమంత వాహన సేవలో నారసింహుడు




**యాదగిరిగుట్ట, ఫిబ్రవరి25 (వెలుతురు):**
యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు బుధవారం ఉదయం శ్రీరామ అలంకారంలో హనుమంత వాహన సేవపై యాదగిరి శ్రీలక్ష్మి నరసింహాస్వామి వారు ఆలయ తిరు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. నయన మనోహరంగా స్వామివారు అలంకార సేవపై ఊరేగుతూ భక్తులకు కనువిందు చేశారు. లోక కల్యాణం కోసం స్వామివారు వివిధ అవతారాలు ఎత్తారని ఈ సందర్భంగా అర్చకులు ఉపదేశించారు. ప్రత్యేకంగా తెప్పించిన పూలతో స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. వేద మంత్రలు, వేదపారాయణలు, మంగళ వాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా స్వామి వారి ఊరేగింపు సేవ పై ఊరేగారు. రాత్రి స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. దీనికోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్తర మాడవీధుల్లో ప్రత్యేకమైన కల్యాణ వేదికను సిద్ధం చేశారు. వీవీఐపీ, వీఐపీ, ఇతర భక్తులు స్వామి వారి కల్యాణాన్ని వీక్షించే విధంగా ప్రత్యేకమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. కొండపైన పలు ప్రాంతాల్లో ఎల్ ఈ డీ స్క్రీన్లను ఉంచారు. ఈ సేవలో జిల్లా కలెక్టర్ హనుమంతరావు, ఆలయ భవానీ శంకర్, ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహ మూర్తి, డీఈవో భాస్కర్ శర్మ, ప్రధానార్చకులు కాండూరి వెంకటాచార్యులు, భట్టర్ సురేంద్రాచార్యులు, ఆలయ అధికారులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉదయ్‌పూర్‌లో విరోష్ పెళ్లిసందడి

### - హాజరవుతున్న అంబానీ కుటుంబం

**ఉదయ్‌పూర్,ఫిబ్రవరి 25( వెలుతురు):**
టాలీవుడ్ క్రేజీ జంట విజయ్ దేవరకొండ,రష్మిక మందన్న వివాహ వేడుకలు రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో ఘనంగా కొనసాగుతున్నాయి. ఫిబ్రవరి 26న జరగనున్న ఈ ప్రైవేట్ వెడ్డింగ్‌కు సంబంధించిన ప్రీవెడ్డింగ్ వేడుకలు ఇప్పటికే పీక్స్‌కు చేరుకున్నాయి. కేవలం 100 మంది అత్యంత సన్నిహితుల సమక్షంలో ఈ వేడుక జరగనున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ప్రముఖ వ్యాపారవేత్త ముఖేష్ అంబానీ కుటుంబం ఉదయ్‌పూర్‌కు చేరుకోవడంతో జోరుగా చర్చ మొదలైంది. ఆయనతో పాటు నీతా అంబానీ, కోకిలాబెన్ అంబానీ, ఆకాశ్ అంబానీ, శ్లోకా అంబానీ కూడా వచ్చినట్లు ప్రచారం సాగింది. దీంతో అంబానీ కుటుంబం విరోష్ వెడ్డింగ్‌కు హాజరవుతున్నారన్న వార్తలు వైరల్ అయ్యాయి. అయితే తాజా సమాచారం ప్రకారం అంబానీ కుటుంబం ఉదయ్‌పూర్ సందర్శనకు ఈ వివాహంతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టమైంది. ఉదయ్‌పూర్ సమీపంలోని నాథ్‌ద్వారాలో ఉన్న శ్రీనాథ్ జీ ఆలయంలో దర్శనం కోసం అంబానీ కుటుంబ సభ్యులు వెళ్లినట్లు తెలుస్తోంది. ఆలయం వద్ద తీసిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అభిమానులు వాటిని విరోష్ వెడ్డింగ్‌కి అటాచ్ చేశారు. అయితే ఇది కేవలం యాదృచ్ఛికమేనని, పెళ్లికి సంబంధం లేదని సమాచారం. ఈ సెలబ్రిటీ వివాహం పూర్తిగా ప్రైవేట్ వేడుకగా



జరుగుతోంది. ఇప్పటికే ఉదయ్‌పూర్ విమానాశ్రయంలో కనిపించిన వారిలో దర్శకుడు తరుణ్ భాస్కర్, నటి ఈషా రెబ్బా, నటి ఆషికా రంగనాథ్, దర్శకుడు రాహుల్ రవీంద్రన్ తదితరులు ఉన్నారు. దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కూడా హాజరయ్యే అవకాశమున్నట్లు టాక్ వినిపిస్తోంది.వివాహ విందు పూర్తిగా దక్షిణాది శైలిలో ఉండబోతోందని సమాచారం. అతిథులకు అరిటాకుల్లో భోజనం వడ్డించనున్నారు. ప్రత్యేకంగా కొబ్బరి నీళ్లను కూడా ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే కుటుంబ సభ్యులు, స్నేహితులు కలిసి సరదా క్రీడలతో సందడి చేశారు. ఫిబ్రవరి 26, 2026న ప్రధాన వివాహం జరగనుండగా, సినీ పరిశ్రమ స్నేహితుల కోసం మార్చి 4న ప్రత్యేక విందు ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. మొత్తానికి, అంబానీలు ఉదయ్‌పూర్‌లో ఉన్నారన్న విషయం నిజమే అయినప్పటికీ, అది విజయ్ దేవరకొండ,రష్మిక మందన్న పెళ్లితో సంబంధం లేదని సమాచారం.

## యూత్ కాంగ్రెస్ నేతల అరెస్ట్ సిగ్గుచేటు


### - కేంద్రం చర్యను తప్పపట్టిన ప్రియాంక



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 25( వెలుతురు):**
ఇటీవల ఢిల్లీలో జరిగిన ఎఐ సమ్మిట్‌లో కాంగ్రెస్ యువ నేతలు భారత్– అమెరికా ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ చొక్కాలు విప్పి నిరసన తెలిపారు. సమ్మిట్‌లో నిరసన చేసిన కాంగ్రెస్ నేతల్ని పోలీసులు అరెస్టు చేయడాన్ని కాంగ్రెస్ నేత, వయనాడ్ ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా బుధవారం తీవ్రంగా ఖండించారు. ఈ అరెస్టు సిగ్గుచేటని ఆమె ధ్వజమెతారు. 'సత్యం కోసం, శాంతియుత, అహింసాయుత ప్రతిఘటన మనం గర్వించదగిన వారసత్వం. ఇది మహాత్మాగాంధీ, లక్షలాది మంది భారతీయుల పూర్వీకుల నుండి వారసత్వంగా వచ్చింది. ప్రపంచ ఒత్తిడికి తలొగ్గి భారతదేశ ప్రయోజనాలతో రాజీపడిన ప్రధానికి, ఆయన ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్వరం పెంచడం 1.4 బిలియన్ల భారతీయుల ప్రయోజనాలకు మంచిది. ప్రజల గొంతును పెంచినందుకు యూత్ కాంగ్రెస్ సభ్యులపై తీసుకున్న చర్య తీవ్రంగా ఖండించదగినది. సిగ్గుచేటైన విషయం. కాంగ్రెస్ పార్టీ కాంగ్రెస్ యొక్క నిర్భయ సైనికులకు దృఢంగా అండగా నిలుస్తుంది ' అని ఆమె బుధవారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు పేర్కొన్నారు. చేశారు. అని ప్రియాంక ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. ఃూగా, ఎఐ సదస్సులో షర్ట్ విప్పి నిరసన తెలిపిన ఘటనకు కీలక సూత్రధారిగా భావించిన యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఉదరు భాను చిబ్‌ను మంగళవారం అరెస్టు చేశారు. ఉదరు భానుతోపాటు మరో ఆరుగురు కాంగ్రెస్ కార్యకర్తల్ని అరెస్టు చేసి.. వారిపై అల్లర్లకు పాల్పడినట్లు పోలీసులు అభియోగాలు మోపారు.

## విరోష్ జంటకు ప్రధాని శుభాకాంక్షలు

### - విషెష్ చెబుతూ మోడీ లేఖ



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 25( వెలుతురు):**
విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న మరికొన్ని గంటల్లో వివాహ బంధంతో ఒక్కటి కాబోతున్నారు. వీరి వివాహం ఉదయ్ పూర్ లో జరగనుంది. రష్మిక, విజయ్ వివాహం రాజస్థాన్ లోని ఉదయ్‌పూర్ లో ఉన్న ఐటీసీ హోటల్లో గ్రాండ్ గా జరగనుంది. వారి వివాహ వేదిక వద్ద మూడు అంచెల భద్రతను మోహరించినట్లు తెలుస్తోంది. స్థానిక పోలీసులు, హైదరాబాద్ నుంచి వచ్చిన ప్రత్యేక బృందం, అంతర్జాతీయ భద్రతా మధ్య ఈ వేడుక జరగనుంది. వీరి వివాహానికి కొద్దిమంది అతిథులు మాత్రమే హాజరుకానున్నారు. అంబానీకి కుటుంబం విజయ్ దేవరకొండ వివాహానికి హాజరు కానున్నారు. ఇప్పటికే అంబానీ ఫ్యామిలీ ఉదయ్ పూర్ కు చేరుకుంది. అదేవిధంగా విజయ్ దేవరకొండ , రష్మిక వివాహానికి శుభాకాంక్షలు తెలుపుతూ.. ప్రధాని మోడీ లేఖ రాశారు. ఫిబ్రవరి 26 న విజయ్ , రష్మిక వివాహం జరగనుంది. కాబోయే వధూవరులకు మోడి శు భాకాంక్షలు తెలిపారు. సప్తపదితో జీవితాంతం స్నేహంతో వర్ధిల్లాలని ఆశీస్సులు అందజేశారు. అలాగే విజయ్ రష్మిక జీవితం అద్భుతంగా ఉండాలని కోరుకుంటూ.. పరస్పరం గౌరవం, ప్రేమ, బాధ్యతలను పంచుకోవాలని మోడి సూచించారు. కాగా విజయ్, రష్మిక వివాహానికి కేవలం 100 మంది అతిథులను మాత్రమే ఆహ్వానించారు. అతిథులు, సన్నిహితుల కోసం మార్చి 4న హైదరాబాద్ లో రిసెప్షన్ నిర్వహించనున్నారు. అభిమానుల కోరిక మేరకు తమ పెళ్లి వేడుకకు 'విరోష్' అని పేరు పెట్టినట్లు సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు.

## ఆస్పత్రి నుంచి శరద్ పవార్ డిశ్చార్జ్

**ముంబయి,ఫిబ్రవరి 25( వెలుతురు):**
ఇటీవల అనారోగ్య కారణాల రీత్యా చికిత్స కోసం ఎన్‌సిపి నేత శరద్‌పవార్ పూనెలోని రూబీ హాల్ ఆసుపత్రిలో చేరారు. డీహైడ్రేషన్‌కు గురైన ఆయన్ను కుటుంబ సభ్యులు ఆదివారం ఈ ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం మెరుగుపడడంతో బుధవారం ఉదయం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేసినట్లు వైద్యులు తెలిపారు. ప్రస్తుతం శరద్‌పవార్ బాగానే ఉన్నారు. అందుకే ఆయనను డిశ్చార్జ్ చేశాం. రెండు రోజులు విశ్రాంతి తీసుకోవాలని సూచించాం అని రూబీ హాల్ ఆసుపత్రి చీఫ్ కార్డియాలజిస్ట్, ఛైర్మన్ మేనేజింగ్ ట్రస్టీ అయిన డాక్టర్ పర్వేజ్ గ్రాంట్ అన్నారు. ఃూగా, శరద్‌పవార్ ఈ నెల్లోనే ఫిబ్రవరి 9న ఛాతి ఇన్ఫెక్షన్ వల్ల ఇదే ఆసుపత్రిలో చికిత్స కోసం చేరారు. ఆరోగ్యం మెరుగుపడగానే ఆయన ఫిబ్రవరి 14న డిశ్చార్జ్ అయ్యారు.

# ఆరుట్ల గ్రామంలో వాటర్ షెడ్ శాఖ ద్వారా సబ్సిడీపై రైతులకు మంజూరైన వ్యవసాయ పనిముట్లు

**- రైతులకు వ్యవసాయ పనిముట్లు అందజేసిన ఆరుట్ల గ్రామ సర్పంచ్ మానిపాటి శోభా కుమార్, ఉపసర్పంచ్ నూకం రాజు ముదిరాజ్**



**మంచాల వెలుతురు ఫిబ్రవరి 25:**
మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల వ్యవసాయపనుల అ వసరాల కోసం వాటర్ షెడ్ శాఖ ద్వారా సబ్సిడీపై మంజూరైన వివిధ రకాల యంత్రాలను రైతు లకు అందజేసిన ఆరుట్ల గ్రామ సర్పంచ్ మానిపాటి శోభా కుమార్ ఉప సర్పంచ్ నూకం రాజు ముదిరాజ్ ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకో సం సబ్సిడీపై వాటర్ షెడ్ శాఖ ద్వారా మంజూరు చేసే వ్యవసాయ పని ముట్ల కోసం అవసరం ఉన్న రైతు లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి అని అన్నారు ఈ కార్యక్రమంలో వా టర్ షెడ్ శాఖ అధికారి మహేష్ గ్రామపంచాయతీ వార్డు సభ్యురాలు లాలగారి మణెమ్మ మం చాల మండలం మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండి సలాం మాజీ ఉపసర్పంచ్ పాండాల జంగయ్య గౌడ్ రైతులు లొంగరి మారయ్య గుమల్ల చంద్రయ్య ముదిరాజ్ దండు భగవంత్ రెడ్డి మంద మో హన్ రెడ్డి సపవాట్ చంద్రకాంత్ నాయక్ సూర్యనాయక్ తదితరులు పాల్గొన్నారు

# మంచాల మండలం వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీని చేసిన ఎమ్మెల్యే

**- అర్హులైన ప్రతి పేద కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తుంది సీఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజలకు వరంలాంటిది**

**- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి**



**మంచాల వెలుతురు ఫిబ్రవరి 25:**
మంచాల మండలం వివిధ గ్రామాల కు చెందిన 46 మంది లబ్ధిదారులకు రూ.17,49,000ల చె క్కులు లబ్ధిదారులకు పంపిణీ చేసిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఈ సందర్భం గా మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం లాంటిదని అందరూ దానిని సద్విని యోగం చేసుకోవాలని తెలంగాణ రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పడిన తరువాత అర్హులైన పేద లందరికి సంక్షేమపథకాలు అమలవు తున్నాయి అన్నారు ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథ కాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు ప్రజా సంక్షేమంలో అభివృద్ధిపనుల లో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ముందువరుసలో ఉందని అన్నారు ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రనాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి బైరిక రమాకాంత్ రెడ్డి గుడ్డిమల్ల చంద్రయ్య ము దిరాజ్ మార సురేష్ నూకం బాలరాజు ముదిరాజ్ బుడిగల పరమేష్ దాసరమోని అశోక్ ముది రాజ్ రావుల నాగరాజు కంబాలపల్లి బుగ్గ రాములు మారగోని జగన్ గౌడ్ కాట్రోత్ మధు నవీన్ హరియా పున్నంసాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు

# శ్రీ అభయ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో సురిగి నరసింహ గౌడ్ ను మర్యాదపూర్వకంగా శాలువాతో సత్కరించిన చైర్మన్ గునగంటి వెంకటేష్ గౌడ్

**ఎన్టీఆర్ నగర్ వెలుతురు ఫిబ్రవరి 25:**
మంగళవారం రోజున ఎన్టీఆర్ నగర్ లో గల శ్రీ అభయ ఆంజనేయస్వామి టెంపుల్లో ఆలయ కమిటీ చైర్మన్ గునగంటి వెంకటేష్ గౌడ్ చైర్మన్ మునుగోడు కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు సురిగి నరసింహ గౌడ్ కు ఆలయ ప్రాంగణంలో మర్యాదపూర్వకంగా శాలువాతో సత్కరించడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో కృష్ణపురం యాదవ సంఘం అధ్యక్షుడు ఇరటి చెన్నయ్య యాదవ్ ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు



# మునుగోడు రైతులు వ్యవసాయ సంబంధిత పండ్లు కూరగాయలు మార్కెట్లో త్వరగా కొనుగోలు చేయాలి

**- గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలక మధుసూదన్ రెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిసిన మునుగోడు మండల కాంగ్రెస్ మాజీ ప్రెసిడెంట్ సురిగి నరసింహా గౌడ్**



**రంగారెడ్డి జిల్లా వెలుతురు ఫిబ్రవరి 25:**
గడ్డి అన్నారంమార్కెట్ కమిటీ చైర్మన్ చిలక మధుసూదన్ రెడ్డి గారిని కలిసిన మునుగోడు మండల కాంగ్రెస్ మాజీ ప్రెసిడెంట్ మునుగోడు రైతులు వ్యవసాయ సంబంధిత పండ్లు కూరగాయలు మార్కెట్లో త్వరగా కొనుగోలు చేయాలని రైతులకు కమిషన్ ఏజెంట్లతో ఇబ్బందులు లేకుండా పంటలు కొనుగోలు చేయాలని మరియు మద్దతు ధర ప్రకటించాలని సురిగి నరసింహా గౌడ్ గడ్డి అన్నారం చైర్మన్ గారిని కోరడం జరిగింది విన్నవించడం జరిగింది కాంగ్రెస్ పార్టీ రైతు పక్ష పాతి అని చైర్మన్ అన్నారు

# కుమ్మెర ఘటనలో నిందితుల అరెస్ట్ లో జాప్యమెందుకు ??

**- నిందితులందరిపై హత్య కేసు నమోదు చేయాలి**

**- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ లింగం గౌడ్**



**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 25:**
నాగర్ కర్నూలు జిల్లా కుమ్మెర ఘటన జరిగి వారం రోజులు గడుస్తున్న నిందితులను అరెస్టు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ యంత్రాంగం విఫలమైందని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ అన్నారు. బీసీల మీద జరిగిన దాడి కాబట్టే ఇంత ఆలస్యంగా దర్యాప్తు జరుపుతున్నారని అదే అగ్రకులాల మీద దాడి జరిగితే ఇన్నీ రోజులు ఊరుకుంటారా అని లింగం గౌడ్ ప్రశ్నించారు.రాష్ట్రమంతా ఆ సంఘటన గురించి పెద్ద ఎత్తున ఆందోళన జరుగుతున్న రాష్ట్ర బీసీ కమిషన్ మరియు ఎస్సీ ఎస్టీ కమిషన్ సందర్శించిన ఇంతవరకు ఆ సంఘటన గురించి ఎలాంటి ఉలుకు పలుకు లేకుండా ఉందన్నారు. తక్షణమే అరెస్ట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు

# పంచాయతీ సిబ్బందికి బకాయి వేతనాలు వారంరోజుల్లో చెల్లించకుంటే నిరవధిక సమ్మె

## - గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మిక యూనియన్ హెచ్చరిక



రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో డిఆర్ఓ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు



రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు సిఐటియు నాయకులు

**ఇబ్రహీంపట్నం వెలుతురు ఫిబ్రవరి 25:**
ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కొంగరకలాన్ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం గ్రామపంచా యతీ ఉద్యోగ కార్మిక యూనియన్ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లాకలెక్టర్ కార్యాలయం ముందుధ ర్నా అనంతరండి ఆర్ ఓకు వినతిపత్రం అందజేత ఈసందర్భంగా కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ పంచాయతీ సిబ్బందికి మూడు నెలల బకాయి వేతనాలు వారంరోజుల్లో చెల్లిం చ కుంటే నిరవధిక సమ్మెకు దిగుతామని గ్రామ పంచాయితీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ జి ల్లా కార్యదర్శి గ్యారపాండు హెచ్చరించారు గ్రామ పంచాయితీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందుధర్నా అనంతరం డిఆర్ ఓకు వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయితీ సిబ్బందిని కూడా 2వ పిఆర్సి పరిధి లోకి తీసుకురావాలని అన్నారు జీ ఓనెం.51ని సవరించాలి మల్టీపర్ప స్ వర్కర్ విధానాన్ని రద్దుచేయాలి పాత కేటగిరీలన్నింటినీ కొనసాగించాలని డిమాండ్ చేశారు కారోబార్ బిల్ కలెక్టర్లను సహాయక కార్యదర్శులుగా నియమించాలి అర్హులైన సిబ్బందికి ప్రమోషన్ల న్లు కల్పిం చాలని కోరారు పంచాయతీ సిబ్బందికి ఉద్యోగ భద్రత రిటైర్మెంట్ బెనిఫి ట్ రూ5 లక్ష లు ఇన్సూరెన్స్ ఈఎ స్ఐపిఎఫ్ సౌకర్యం కల్పించాలని అన్నారు పంచాయతీ సిబ్బందిని పర్మి నెంట్ చేయాలి వేతనాలు పెంచాలి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమ లుచేయాలని డిమాండ్ చేశారు ఆన్ లైన్ లో నమోదు కాని కార్మికుల పేర్లను నమోదు చేసి అం దరికి వేతనాలు చెల్లించాలని కోరారు పంచాయతీల అవసరాల ప్రాతిపాదికన కార్మికుల సంఖ్య ను పెంచాలి కార్మికులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇండ్ల స్థలాలు కేటాయించాలని అన్నారు అనా రోగ్యానికి గురై చనిపోయిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలి మ రణించిన కార్మికుని దహన సంస్కారాలకు రూ10,000వేలు కాకుండా రూ.20.0 00/లు ఇవ్వా లని కోరారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు కార్డులను ఇవ్వాలని కోరారుమరో వైపు కొత్త గా వచ్చిన సర్పంచులు ఆన్ లైన్ లో పేర్లు లేని కార్మికులను తొలగిస్తామని చెప్పి బెదిరింపులకు గురి చేస్తున్నారు కార్మికులపై ఈలాంటి బెదిరింపులకు పాల్పడకుండా చర్యలు తీసుకొని కార్మి కుల పేర్లను ఆన్ లైన్ లో ఎక్కించాలని కోరారుగ్రామపంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు అందక అనేక ఇబ్బందుల పాలవుతున్నారని అన్నారు వీరికి వెంట నే వారం రోజుల్లో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు వారంరోజుల్లో వేతనాలు చెల్లించ కుంటే నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు ఈ సమ్మెకు కార్మికులందరూ సిద్ధంగా ఉం డాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లానాయకులు పోచమోని కృష్ణ శ్రీనివా స్ పెంటయ్య గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్య దర్శి దేవదాసు రాష్ట్ర నాయకులు జ్యోతి జగన్ శేఖర్ మాధవి తదితరులుపాల్గొన్నారు.

# రాష్ట్ర బడ్జెట్లో విద్యా రంగానికి 20 శాతం నిధులు కేటాయించాలి

## - మూతబడిన బడులను తిరిగి తెరిపించాలి



**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 25:**
త్వరలో ప్రవేశపెట్టే తెలంగాణ రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి 20 శాతం నిధులు కేటాయించాల్సిన అవసరం ఎం తైనా ఉందని బాలల హక్కుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. విద్యా సమస్యల న్నింటికీ నిధుల కొరతే ప్రధాన కారణం అని తెలిపింది. ఇటీవల నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు తెలంగాణ రైజింగ్ నంబర్ 1 అన్నారు. కానీ విద్యారంగానికి కేటాయించే నిధుల విషయంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అట్టడుగు స్థాయిలో ఉందనీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంజమూరి రఘునందన్ అన్నారు. ఆర్థికవేత్తలు బీమారు రాష్ట్రాలుగా పిలుస్తున్న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం 13 శాతం, రాజస్థాన్ 18 శాతం, మధ్యప్రదేశ్ 16 శాతం, బీహార్ 18.4 శాతం విద్యారంగానికి తమ రాష్ట్రాల బడ్జెట్లో నిధులు కేటాయిస్తున్నవి. తెలంగాణ రాష్ట్రం మాత్రం 7.57 శాతం నిధులే కేటాయించింది. దేశంలో ఏ రాష్ట్రం కూడా ఇంత తక్కువ నిధులు కేటాయించడం లేదు. అదేవిధంగా దక్షిణాది రాష్ట్రాలతో పోల్చి చూసినా తమిళనాడు 13.4 శాతం, కేరళ 14.8 శాతం, కర్ణాటక 12.9 శాతం, చివరికి మనతో విడిపోయిన ప్రక్క రాష్ట్రం అయిన ఆంధ్రప్రదేశ్లో కూడా 12 శాతం పైగా నిధులు కేటాయించడం జరిగిందని వారు అన్నారు. తెలంగాణ ఏర్పడిన మొదటి సంవత్సరం 2014- 15 బడ్జెట్లో విద్యకు కేటాయింపులు 10.89 శాతం ఉండగా బిఆర్ఎస్ పదేండ్ల పాలించినలో చివరి సంవత్సరంలో(2023- 24) అది 6.5 శాతానికి తగ్గిపోయింది. ఎన్నికల మ్యానిఫెస్టోలో తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యారంగాన్ని గాడిలో పెడతామని విద్యకు బడ్జెట్లో 15 శాతం నిధులు కేటాయిస్తామని వాగ్దానం చేసి మొదటి సంవత్సరంలో 7.3 శాతం, రెండవ సంవత్సరంలో 7.57 శాతం మాత్రమే కేటాయించడం జరిగిందని, ఈ సారైనా మార్చి 20 న ప్రవేశపెట్టే బడ్జెట్లో విద్యారంగానికి కనీసం 20 శాతానికి తగ్గకుండా నిధులు కేటాయించాలని కోరుతున్నాము.

బడ్జెట్ లోటుతో ఉన్నత విద్యారంగం 12 ఏళ్లుగా తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నదని అన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలోపు అన్ని ప్రభుత్వ విద్యా సంస్థల్లో మెరు గైన వసతులు కల్పించి నాణ్యమైన విద్యను అందించాలని వారు డిమాండ్ చేశారు.

విద్యారంగానికి అతి తక్కువ బడ్జెట్ ఉండడం వల్లనే అవసరమైనన్ని గదులు లేని పాఠశాలలు 13,574 వరకు ఉండగా ఒక్కటే టాయిలెట్ ఉన్న పాఠశాలలు 21,507 ఉన్నాయి. పక్కా కాంపౌండ్ వాల్ లేనివి 13,868 ఉండగా కంప్యూటర్ ల్యాబ్ లు లేనివి 22,047 పాఠశాలలు ఉన్నాయి. దాదాపు 20 వేల స్కూళ్ళలో సగటున ఇద్దరే ఉపాధ్యాయులన్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం తరగతి కి ఒక ఉపాధ్యాయుడు ఉండాలి. వేలాది పాఠశాలల్లో సైన్స్ టీచర్లు లేరు. లెక్కల టీచర్లు లేరు. భాషపండితులు లేరు. అంతే కాదు జిల్లాల్లో పాఠశాల విద్యా వ్యవస్థను పర్యవేక్షించాల్సిన జిల్లా విద్యాశాఖ అధికారులు లేరు. సరైన మానిటరింగ్ వ్యవస్థలేని కారణంగా మరియు మౌళిక వసతుల లేమి కారణంగా గత రెండు సంవత్సరాలలో 4000 వరకు స్కూళ్లు మూతపడ్డాయి. ఇప్పటివరకు ఏ ప్రభుత్వం కూడా బహిరంగంగా పాఠశాలలు రేషనలైజేషన్ చేసి మూసివేస్తామని ప్రకటించలేదు. ఎన్నికల మ్యానిఫెస్టోలో కూడా రేవంత్ రెడ్డి గారు బిఆర్ఎస్ పాలనలో మూతబడిన బడులను తిరిగి తెరుస్తామని పదే పదే అనేక సమావేశాల్లో ప్రకటించారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత మూతబడిన పాఠశాలలే వారి నిబద్ధతకు నిదర్శనం. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 26 జిల్లాలకు పూర్తిస్థాయి జిల్లా విద్యాశాఖ అధికారులు(డిఇఓ) లేరు. ఇంచార్జి డిఇఓ లు, ఇంచార్జీ ఎంఇఓ లతో రాష్ట్రంలో మానిటరింగ్ వ్యవస్థ కుప్పకూలి పోయింది. అలాగే పూర్వ ప్రాథమిక విద్య ఆవశ్యకతను గుర్తించి, అన్ని పాఠశాలల్లో ఏర్పాటు చేయాలన్నారు. ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. స్వయంగా ముఖ్యమంత్రే విద్యాశాఖను నిర్వహిస్తున్నందున ప్రత్యేక దృష్టి పెట్టి తెలంగాణలో విద్యారంగాన్ని దేశంలోనే ఉన్నతమైన స్థానంలో(తెలంగాణ రైజింగ్ నంబర్ 1 గా) నిలిపేందుకు విద్యారంగానికి అధిక ప్రాధాన్యత కల్పిస్తూ కనీసం 20 శాతం తగ్గకుండా నిధులు కేటాయించాలని బాలల హక్కుల సంక్షేమ సంఘం(బిహెచ్ఎస్ఎస్) ముఖ్యమంత్రి గారికి విజ్ఞప్తి చేస్తుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంజమూరి రఘునందన్ అన్నారు.



**ఇంజమూరి రఘునందన్**
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి , సెల్: 9866102962
బాలల హక్కుల సంక్షేమ సంఘం(బిహెచ్ఎస్ఎస్)

# సీఎంకు ప్రత్యేక ధన్యవాదాలు

## - జిల్లా బ్రాంచ్ అధ్యక్షుడు ఎం బి కృష్ణ యాదవ్

**- చారిత్రక నిర్ణయంతో 7 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ లు వారి కుటుంబ సభ్యులు 17 లక్షల మందికి ఆరోగ్య భరోసా**

**- తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కి నగదు రహిత చికిత్స పథకం అమలుకై కృతజ్ఞతలు తెలిపిన టిజివో హైదరాబాద్ జిల్లా బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులు**



**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 25:**
ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యోగులు, పెన్షనర్లకు ఈ.హెచ్.ఎస్- నగదు రహిత చికిత్స పథకం, రూ.1.20 కోట్ల ప్రమాద కోట్ల మూలనిధితో పథకానికి నేపథ్యంలో అన్ని ఉద్యోగ వర్గాల చిరకాల వాంఛను నెరవేర్చారంటూ తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ హైదరాబాద్ జిల్లా బ్రాంచ్ అధ్యక్షుడు ఎం బి కృష్ణ యాదవ్, కార్యదర్శి ఎం.ఎ. ఖాదర్ గార్లు గౌరవ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రభుత్వం ప్రకటించిన ఆరోగ్య, బీమా పథకాలు చరిత్రలో నిలిచిపోతాయని వారు కొనియాడారు. 1,998 వ్యాధులకు నగదు రహిత చికిత్స లను పొందే విధంగా ఉద్యోగులు, పెన్షనర్లకు అవకాశం లభించడం ఎంతో ఆనందదాయకం అని తెలిపారు. చారిత్రక నిర్ణయంతో 7 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు వారి కుటుంబ సభ్యులు 17 లక్షల మందికి నగదు రహిత ఆరోగ్య భరోసా లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా కేబినెట్ మంత్రివర్యులకు, హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ గారికి, ఇట్టి ప్రయోజనాలను సాధించటంలో కృషి సలిపిన టి జి వో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్, రాష్ట్ర జనరల్ సెక్రెటరీ బి.శ్యామ్ గార్కి నిండైన ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ ఆశన్న, ట్రెజరర్ వెంకటరమణ, వైస్ ప్రెసిడెంట్ , సంయుక్త కార్యదర్శులు డాక్టర్. క్రొత్త విద్యా సాగర్, శ్రీరామ్, సరస్వతి గారు పాల్గొన్నారు.



# కె.పి లక్ష్మీదేవమ్మ పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించిన వడ్డేపల్లి రాజేశ్వరరావు.

**కూకట్ పల్లి ఫిబ్రవరి 25 వెలుతురు:**
రాష్ట్ర సగర సంగం గౌరవ సలహాదారులు, స్టీరింగ్ కమిటీ చైర్మన్ కె.పీ రాంసాగర్ సతీమణి జగద్గిరిగుట్ట సగర సంగం గౌరవ సలహాదారులు కెపి లక్ష్మీ దేవమ్మ మంగళవారం అకాల మరణం చెందారు. విషయాన్ని తెలుసుకున్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు బుధవారం ఉదయం లక్ష్మీదేవమ్మ పార్థివ దేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులు అర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. భగవంతుడు కుటుంబ సభ్యులకు మనో ధైర్యాన్ని ఇవ్వాలని రాజేశ్వరరావు ఆకాంక్షించారు.

## మా ఊరి జాతర చిత్ర హీరో, ఫిల్మ్ మేకప్ డిజైనర్‌కు ఘన సన్మానం



**నార్కట్ పల్లి వెలుతురు ఫిబ్రవరి 25:**
నల్లగొండ జిల్లా కేంద్రంలో "మా ఊరి జాతర" చిత్ర టీం సభ్యులు బుధవారం రోజు ఓ ప్రముఖ రెస్టారెంట్‌లో ఘన సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిత్రానికి ఫిల్మ్ మేకప్ డిజైనర్‌గా, సర్పంచ్ పాత్రధారిగా నటించిన నంది అవార్డు గ్రహీత సాయిభాను గారిని గ్రాఫిక్స్ ఆర్టిస్ట్ గజవెల్లి వెంకన్న శాలువాతో సన్మానించారు. అదేవిధంగా చిత్ర హీరో హీన్ ప్రణితను కథా రచయిత, నిర్మాత టైగర్ పురం సంతోష్ కుమార్ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హీరో హీన్ ప్రణిత మాట్లాడుతూ మా ఊరి జాతర చిత్రంలో హీరో హీన్ పాత్రను నాపై నమ్మకంతో అప్పగించిన కథా రచయిత, నిర్మాత టైగర్ పురం సంతోష్ కుమార్ కి, దర్శకుడు రమేష్ కి, ఫిల్మ్ మేకప్ డిజైనర్ సాయిభాను కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నాను" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులు, అభిమానులు పాల్గొని చిత్ర బృందాన్ని అభినందించారు

## విద్యార్థులే ఉపాధ్యాయులు అయిన వేళ

**- అనంతారం ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం**

**- విద్యార్థులు ఒక రోజు అధికారులు, ప్రజాప్రతినిధులుగా బాధ్యతల నిర్వహణ**






**గుండాల, ఫిబ్రవరి 25 (వెలుతురు):**
యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం అనంతారం గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒక రోజు పాటు పాఠశాల పరిపాలన బాధ్యతలను స్వయంగా చేపట్టి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మండల విద్యాధికారిగా విద్యార్థి మోహన్ వ్యవహరించగా,తనూ శ్రీ ప్రధానోపాధ్యాయురాలిగా బాధ్యతలు స్వీకరించారు. భాను సర్పంచ్‌గా,కె. వైష్ణవి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. విద్యార్థులు ఎంతో క్రమశిక్షణతో,బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించి అందరినీ ఆకట్టుకున్నారు.పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి పి.రజనీ కుమారి ఆధ్వర్యంలో కార్యక్రమం సజావుగా సాగింది.ఉపాధ్యాయులు ఎ. వేణు,ఎం.సుధాకర్, విఓఏ నూనెముంతల పద్మ,అంగన్వాడీ టీచర్ జి.రేణుక, రమేష్, ప్రమీల, నాంచారమ్మ తదితరులు పాల్గొని విద్యార్థులకు మార్గదర్శనం చేశారు.స్వపరిపాలన దినోత్సవం ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు,బాధ్యతా భావం,నిర్ణయ సామర్థ్యం పెంపొందుతాయని ఉపాధ్యాయులు తెలిపారు.కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

## కనులవిందుగా శ్రీ పట్టాభి సీతారామచంద్ర స్వామి కళ్యాణం





**నార్కట్ పల్లి వెలుతురు ఫిబ్రవరి 25:**
నవమినాడు పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ పట్టాభి సీతారామచంద్ర స్వామివారి మాస కళ్యాణ మహోత్సవం భక్తి శ్రద్ధల మధ్య కనులవిందుగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమం ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు ఉంద్ర లింగారెడ్డి భాగ్యమ్మ దంపతుల ఆధ్వర్యంలో, ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ ఉత్తరపల్లి మణికంఠాచార్యులు మరియు పురోహితులు బ్రహ్మశ్రీ ఉత్తరపల్లి నరసింహాచార్యుల నిర్వహణలో ఘనంగా జరిగింది. ముందుగా గణపతి పూజ, పుణ్యాహవాచనం నిర్వహించి, అనంతరం స్వామి మరియు అమ్మవారికి అభిషేకాలు చేశారు. నూతన పట్టు వస్త్రాలు సమర్పించి, జిలకర బెల్లం ముహూర్తం అనంతరం శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాట వెంకన్న, లింగస్వామి, కొన్రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, సుమిత్రమ్మ, రాణమ్మ తదితరులు పాల్గొనగా, భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీస్సులు పొందారు.

## గుండాల మండలంలో వాహనాల తనిఖీ





**గుండాల, ఫిబ్రవరి 25:(వెలుతురు):**
యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం రామారం గ్రామ శివారులో విస్తృతంగా వాహనాతనికి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై తేజం రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్క వాహనదారులు లైసెన్సు కలిగి ఉండి హెల్మెట్ ధరించి వాహనాన్ని నడపాలని అన్నారు. ప్రతి వాహనానికి ఇన్సూరెన్స్ చేయించుకోవాలని అన్నారు. మద్యం సేవించి వాహనం నడిపినట్లయితే చట్టపరమైన చర్య తీసుకుంటామని అన్నారు. చిన్న పిల్లలకు వాహనాలు ఇచ్చినట్లయితే తల్లిదండ్రుల పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది సత్యనారాయణ రెడ్డి. సంజీవరెడ్డి. జయప్రకాష్. స్వప్న . పద్మ.పాల్గొన్నారు.

## స్వయంభూ శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం
# నూతన కమిటీ ఎన్నిక





అధ్యక్షులు, బీసు భాషా గౌడ్ , నీల యాకస్వామి ముదిరాజ్ ప్రధాన కార్యదర్శి

**మోత్కూర్,ఫిబ్రవరి 25,(వెలుతురు న్యూస్ ):**
మోత్కూర్ మున్సిపాలిటీ పరిధిలోని జామచెట్లబావి - కొండాపురం గ్రామాల మధ్య గల (రామునిబండ) స్వయంభూ శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం నూతన కమిటీని బుధవారం రోజున ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు .నూతన అధ్యక్షులుగా శ్రీ బీసు భాషాగౌడ్ , ప్రధాన కార్యదర్శిగా శ్రీ నీల యాకస్వామి ముదిరాజ్ , కోశాధికారిగా శ్రీ మర్రి మల్లేష్ యాదవ్, ఉపాధ్యక్షులుగా శ్రీ మొలకల మధు, బీసు రాంబాబు, బీసు రవి , దబ్బెటి శ్రీనివాస్, మరియు సహాయ కార్యదర్శులుగా బీసు మల్లేష్, మన్నె నాగార్జున ,సహాయ కోశాధికారి మన్నె నవీన్, సంయుక్త కార్యదర్శి బట్టు నరేష్, కల్వల రాము, మర్రి మధు, మన్నే బాలకృష్ణ ప్రచార కార్యదర్శులుగా బీసు రంజిత్ కుమార్, సారగండ్ల జగన్నాథం, మర్రి కిరణ్ ,మన్నె వెంకటేష్, కార్యవర్గ సభ్యులు మన్నె పాండు, బీసు రాకేష్,బీసు రాము, పసుల చంద్రయ్య , బాలగాని కృష్ణ, బీసు శ్రీనివాసు,నీల యాకయ్య, బట్టు రాజశేఖర్ ,నీల కరుణాకర్, బీసు మత్స్యగిరి, మన్నె నాగార్జున, ఆరె సోమరాజు ,గౌరవ సలహాదారులుగా శ్రీ బీసు శ్రీకాంత్ గౌడ్ (కౌన్సిలర్), మన్నె అంజయ్య, బీసు సత్తయ్య తండ్రి రామస్వామి, బీసు భాషా, బీసు మల్లికార్జున,గనగాని కృష్ణ, దబ్బెటి రమేష్ ,మొలకల రమేష్ ,మర్రి వెంకన్న,మన్నె సత్యనారాయణ,గణగాని నాగేష్,బీసు ప్రశాంత్ గార్ల ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది .కార్యక్రమంలో నూతన ఆలయ కమిటీ అధ్యక్షులు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తను ఎల్లవేళలా కృషి చేస్తానని తనను ఏకగ్రీవంగా ఎన్నిక చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు.ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఆలయాన్ని అభివృద్ధి చేయడంలో నిరంతరం కృషి చేస్తానని ఈ అవకాశం రావడం తనకు ఆనందంగా ఉందని తెలియజేశారు. కార్యక్రమంలో ఆలయ మాజీ అధ్యక్షులు శ్రీ మొలకల మధు మరియు మాజీ ప్రధాన కార్యదర్శి శ్రీ గనగాని నాగేష్ గార్లకు వీడ్కోలు సన్మానం చేసిన తదుపరి నూతన మోత్కూర్ మున్సిపాలిటీ 9వ వార్డు కౌన్సిలర్ శ్రీ బీసు శ్రీకాంత్ గౌడ్ గారికి దేవస్థాన నూతన కమిటీ తరపున ఆత్మీయ సన్మానం చేయడం జరిగినది. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ పారునంది హరి బాబు శర్మ గారు శ్రీ సీతారాములకు అభిషేకం నిర్వహించి నూతన కమిటీ కి ఆశీర్వచనం అందించారు.ఈ కార్యక్రమంలో జామచెట్ల బావి కొండాపురం గ్రామాల పెద్దలు ప్రముఖులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రామన్నపేట నియోజవర్గ సాధన సమితి ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులకు సన్మానం..

### రామన్నపేట నియోజకవర్గ సాధన సమితి అధ్యక్షులు రెబ్బలు రాములు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్ర రమేష్ గౌడ్..



**రామన్నపేట వెలుతురు న్యూస్ ఫిబ్రవరి 25:**
మండలంలోని వివిధ గ్రామాల గ్రామ పంచాయతీలకు నూతనంగా ఎన్నికైన సర్పంచులైన నీర్నెముల సర్పంచ్ కందిమల్ల గోపాల్ రెడ్డి, బోగారం సర్పంచ్ కూనూరు సాయికుమార్ గౌడ్, జనం పెల్లి సర్పంచ్ బండ సరోజ, మునిపంపుల సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం, కుంకుడు పాముల సర్పంచ్ గొలుసుల సత్తయ్య , సూరారం సర్పంచ్ శ్రీనివాస్ లను రామన్నపేట నియోజకవర్గ సాధన సమితి ఆధ్వర్యంలో సన్మానించడం జరిగింది, ఈ సందర్భంగా నియోజకవర్గ సాధన సమితి అధ్యక్షులు రెబ్బసు రాములు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్ర రమేష్ గౌడ్ లు మాట్లాడుతూ, రాబోయే రోజులలో రామన్నపేట అసెంబ్లీ కేంద్రంగా కావాలని మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు పూర్తిగా మద్దతు ఇయ్యాలని గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో గ్రామాలలో తీర్మానం చేసి పంపాలని, మండల పరిషత్ సమావేశంలో కూడా ఉద్యమాలు ఎక్కువ చేయాలని సాధన కమిటీ కోరడం జరిగింది.సన్మానం చేసిన వారిలో టీజేఎస్ మండల అధ్యక్షులు గడ్డం యాదగిరి టిడిపి మండల అధ్యక్షులు ఎండి ఫజల్ , కాంగ్రెస్ మండల నాయకులు కూనూరు కృష్ణ గౌడ్, బీఎస్పీ మండల అధ్యక్షులు నగరికంటి నరేష్ , సిపిఐ మండల నాయకులు శ్రీ రామోజీ నరసింహ చారి, పెండెం రవీందర్ గంగాపురం వెంకటయ్య ,ఎండి ఇమామ్ సాహెబ్, పోలగోని నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు.

## దోమల నివారణకు ప్రత్యేక మందు పిచికారీ కార్యక్రమం

**నార్కట్ పల్లి వెలుతురు ఫిబ్రవరి 25:**
పట్టణంలో పెరుగుతున్న దోమల సమస్యను దృష్టిలో ఉంచుకుని ఈరోజు సాయంత్రం నార్కెట్‌పల్లి పట్టణంలో దోమల నివారణ కోసం ప్రత్యేకంగా మందు పిచికారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని నార్కెట్‌పల్లి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జేరిపోతుల భరత్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఈఓ సుభానొద్దిన్ , మరియు పంచాయతీ సిబ్బంది పాల్గొని పట్టణం లోని వివిధ కాలనీలలో మందు పిచికారీ చేపట్టి గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం చర్యలు చేపట్టారు. ప్రజలకు వ్యాధులు వ్యాపించకుండా ముందస్తు జాగ్రత్తగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. గ్రామంలో స్వచ్ఛత ప్రజల ఆరోగ్యం మా లక్ష్యం అని ఆయన పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో మెడబోయిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు







## శ్రీ శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవాలకు ఆహ్వానం






**మోత్కూర్, ఫిబ్రవరి 25,(వెలుతురు న్యూస్ ):**
మోత్కూరు మున్సిపాలిటీలో కొలువైన శ్రీ శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవాలకు ఆహ్వాన పత్రికను స్థానిక తుంగతుర్తి ఎమ్మెల్యే లిమందుల సామెలులి గారికి మరియు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నూనెముంతల విమల వెంకటేశ్వర్లు గారికి వారి వారి గృహాల వద్దకు వెళ్లి మార్చి 3 న జరిగే శ్రీ శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవాలకు ఆహ్వానం పలికారు. ఆహ్వానించిన వారిలో దేవాలయ కమిటీ చైర్మన్ గుండగోని రామచంద్ర గౌడ్ ,దేవాలయ కమిటీ సభ్యులు బయ్యని రాజు,పాలోజు శేఖర చారి,జనిగల శ్రీను,అలకుంట్ల శ్రీను ఉన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



**రామన్నపేట వెలుతురు న్యూస్ ఫిబ్రవరి 25:**
మండలం దుబ్బాక గ్రామానికి చెందిన పోనుగోటి లింగారావు కుమార్తె వివాహము పట్టణ కేంద్రంలోని గరిక వేదశ్రీ గార్డెన్ లో జరగగా మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం మాజీ ఎంపీపీ నీల దయాకర్ మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బందెల రాములు మాజీ ఎంపీటీసీలు దోమల సతీష్, ఎండి అమీర్. గ్రామ శాఖ అధ్యక్షుడు గుండాల రాంబాబు ఉప సర్పంచ్ చొప్పరి నరసింహ వార్డు మెంబర్లు బైరోజు పురుషోత్తం నల్ల సైదులు, కన్నెబోయిన వెంకటేశం. నాయకులు గట్టు భిక్షం, బై రోజు ధనుంజయ, వల్ల మల్ల ఆనంద తదితరులు పాల్గొనడం జరిగింది.

## తల్లి ప్రేమకు దూరమైన చిన్నారులకు సమిష్టి సేవా ఫౌండేషన్ చిరు సాయం



**రామన్నపేట వెలుతురు న్యూస్ ఫిబ్రవరి 25:**
మండల పరిధిలోని వెల్లంకి గ్రామానికి చెందిన జినుక ప్రకాష్ ఎలక్ట్రీషియన్ పని చేసుకుంటూ జీవనం సాగించేవారు.తన భార్య అయినటువంటి సంగీత గత కొన్ని నెలలు నుండి క్యాన్సర్ జబ్బుతో బాధపడుతూ ఫిబ్రవరి 17వ తేదీన మృత్యువాతపడ్డారు.వారికి ఇద్దరు చిన్నపిల్లలు లోహిత్(10),మరొక 11 నెలల బాబు ఉన్నారు.వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి దయనీయంగా ఉందని తెలిసి సమిష్టి సేవా ఫౌండేషన్ సభ్యులు అందరు కలిసి సంగీత కుటుంబానికి 50 కేజీల బియ్యం అందజేశారు.ఈ కార్యక్రమంలో వెల్లంకి సర్పంచ్ ఇడెం రాధాశ్రీనివాస్,మిర్యాల రాజు, మిర్యాల గణేష్,గుడెల్లి దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలకు అండగా ఉంటా.

**- నల్గొండ బిజెపి జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి**



**రామన్నపేట వెలుతురు న్యూస్ ఫిబ్రవరి 25:**
మండలం జనంపల్లి గ్రామానికి చెందిన బిజెపి యువ మోర్చా జిల్లా కార్యదర్శి అక్కెనపల్లి సైదులు తల్లి అక్కినపల్లి శాంతమ్మ మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న బిజెపి జిల్లా పార్టీ అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి అక్కనపల్లి సైదులు కుటుంబాన్ని పరామర్శించి శాంతమ్మ మృతదేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కార్యకర్తలకు అండగా ఉంటానని తెలిపినారు ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నకిరేకంటి. మొగులయ్య బిజెపి మండల పార్టీ అధ్యక్షులు బండ మధుకర్ రెడ్డి మాజీ ఎంపీటీసీ కన్నె కంటి. వెంకటేశ్వర చారి వార్డ్ మెంబర్లు సుర్వి హరిబాబు యాదాసు లక్ష్మణ్ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో కూకట్ పల్లి నియోజకవర్గంలో బీజేపీ సత్తా చాటుతాం...

**- బాలానగర్ డివిజన్ లో కమలం కండువా కప్పుకున్న యువకులు...**



**కూకట్ పల్లి, ఫిబ్రవరి 25 వెలుతురు:**

రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కూకట్ పల్లి నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీ బలమైన ప్రదర్శన చేయనుందని పార్టీ నాయకులు స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్ లోని నాంపల్లి లోని తెలంగాణ బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు యువకులు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమం రామచంద్ర రావు సమక్షంలో జరిగింది. కూకట్ పల్లి నియోజకవర్గ ఇంచార్జ్ మాధవరం కాంతారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర్ రావు ఆధ్వర్యంలో బాలానగర్ డివిజన్ ఇంద్రనగర్ కు చెందిన అత్తికారి మల్లేష్, అర్జున్, రాజులు, సురేందర్, బాలస్వామి ముదిరాజ్, కుమార్ గౌడ్, అనిల్, నాగరాజు, వినోద్ సాగర్, నాగరాజు సాగర్ తదితరులు బీజేపీలో చేరారు. బాలానగర్ డివిజన్ జనరల్ సెక్రటరీ ఎర్రోళ్ల మధు ఆధ్వర్యంలో పెద్దఎత్తున యువకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి ప్రజల మద్దతు పెరుగుతోందని, నియోజకవర్గంలో పార్టీ అభ్యర్థులను విజయం వైపు తీసుకెళ్లేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కిరణ్ తోపాటు సీనియర్ నాయకులు జీడిమెట్ల రమేష్, శంకర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, కొత్తూరు రమేష్, శివరంజని, రూప, బల్విందర్ సింగ్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## సి.సి రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేయాలి..

**- మాజీ కార్పొరేటర్ హరిశంకర్ రెడ్డి.**



**మేడిపల్లి వెలుతురు పిబ్రవరి 15:**

మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని మేడిపల్లి సాయి హిల్స్ కాలనీలో గతంలో సీసీ రోడ్ పనులు మొదలు పెట్టరు.పీర్జాదిగూడ కార్పొరేషన్ జీ.హెచ్.ఎం.సి లో విలీనం కావడంతో పనులలో జాప్యం నెలకొన్నది.ఈసందర్భంగా మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి..డిప్యుటీ కమీషనర్ శైలజ,డి.ఇ సాయినాథ్ గౌడ్ తో కలిసి సాయి హిల్స్ కాలనీలో పర్యటించి పనులను త్వరగా ప్రారంభిచాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు,కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## మానసిక వికలాంగులకు పండ్ల పంపిణీ

**- రెడ్డి శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు**




**వెలుతురు, ఫిబ్రవరి 25:**

అనాధ పిల్లలు, మానసిక వికలాంగుల సంక్షేమానికి దాతలు ముందుకు రావాలని మానవ హక్కుల కమిషన్ సభ్యులు, తెలంగాణ మున్నూరు కాపు సంఘం ఉప్పల్ నియోజకవర్గం మాజీ అధ్యక్షుడు డాక్టర్ రెడ్డి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.తన జన్మదినం సందర్భంగా బుధవారం నాచారంలోని సాధన స్వచ్ఛంద సంస్థలో మానసిక వికలాంగులకు, అనాధ పిల్లలకు పండ్లు, కేక్ పంపిణీ చేసి, వారితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మానసిక వికలాంగుల సంరక్షణకు కృషి చేస్తున్న సాధన సంస్థ సేవలు అభినందనీయమని, వారి సంక్షేమానికి దాతలు సహకరించాలని కోరారు. తన పుట్టినరోజును పిల్లలతో కలిసి జరుపుకోవడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని తెలిపారు. పెళ్లిరోజులు, పుట్టినరోజులు వంటి ప్రత్యేక సందర్భాలను అనాధ పిల్లల మధ్య జరుపుకోవడం వల్ల వారికి మానసిక ధైర్యం కలుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ బెతి వెంకటేశ్వరరావు, నాగరాజు, పులి సత్యనారాయణ, ఎంఎస్ఎస్ రెడ్డి, జీవీఎన్ రావు, దాసరి ప్రసాద్, శ్రావణ్ ముఖేష్, శివప్రసాద్, సాయిచరణ్, రామ్మోహన్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి మైనార్టీ మోర్చా నేతల ఆధ్వర్యంలో మేయర్ కోలగని శ్రీనివాస్ కు ఘన సన్మానం



**కరీంనగర్ వెలుతురు ఫిబ్రవరి 25:**

బిజెపి మైనార్టీ మోర్చా కరీంనగర్ నేతలు బుధవారం రోజున కరీంనగర్ మేయర్ కొలగని శ్రీనివాస్ ను ఘనంగా సన్మానించారు. ప్ర ప్రథమంగా తెలంగాణ రాష్ట్రంలో కరీంనగర్ బల్దియా ను బిజెపి కైవసం చేసుకున్న శుభ సందర్భాన్ని పురస్కరించుకొని , మేయర్ గా , కోలగని శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో బిజెపి మైనార్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి ముజీబ్ , జిల్లా అధ్యక్షుడు సమీ పర్వేజ్ ఆధ్వర్యంలో బుధవారం రోజున కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో మేయర్ కోలగని శ్రీనివాస్ ను వారంతా మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మైనార్టీ మోర్చా నేతలు పవిత్ర రమజాన్ మాసాన్ని పురస్కరించుకుని కరీంనగర్ నగరంలో అవసరమైన సదుపాయాలు కల్పించాలని మేయర్ ను కోరారు.ముఖ్యంగా మస్జిద్ పరిసర ప్రాంతాలు మరియు మైనారిటీ వార్డుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి ముజీబ్ , మైనార్టీ జిల్లా అధ్యక్షులు ఎండి సమీ పరవేజ్ రాష్ట్ర నాయకులు ఎండి తాజ్,ఎండి బషీరుద్దీన్, జిల్లా నాయకులు ఎండి సమీ సిద్దిక్ షాదాబ్ , ఎండి అపాన్ తదితరులు పాల్గొన్నారు.

# కాప్రా ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక

**- అధ్యక్షుడిగా మెరుగు చంద్రమోహన్ ప్రధాన కార్యదర్శిగా ముత్యం ముఖేష్ గౌడ్ ఏకగ్రీవం**

**కాప్రా, ఫిబ్రవరి 25 (వెలుతురు):**

కాప్రా ప్రెస్ క్లబ్ నూతన కమిటీని బుధవారం టీఎస్ఐఐసీ కాలనీలోని ప్రెస్ క్లబ్ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సలహాదారులుగా ఏంపల్లి పద్మారెడ్డి, బెలిదే అశోక్ నియమితులయ్యారు. అధ్యక్షుడిగా మెరుగు చంద్రమోహన్, ఉపాధ్యక్షులుగా దిలీప్ కుమార్, యావాపురం రవి, దొమ్మాటి కిరణ్ కుమార్, గార్లపాటి శ్రీనివాస్ రావు ఎన్నికయ్యారు.ప్రధాన కార్యదర్శిగా ముత్యం ముఖేష్ గౌడ్, సంయుక్త కార్యదర్శులుగా డి. శ్రీనివాస్, కె. వెంకట్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా ఓ. నరసింహ, కీర్తి శ్రీనివాస్, కోశాధికారిగా రామచంద్రమూర్తి ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా గంగి కృష్ణ, గోవిందు కుంట్ల ఆంజనేయులు, బుడంపల్లి నిరంత్ గౌడ్, తొడుపునూరు బాలకృష్ణలను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.ఈ సందర్భంగా అధ్యక్షుడు మెరుగు చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శి ముత్యం ముఖేష్ గౌడ్, కోశాధికారి రామచంద్రమూర్తి మాట్లాడుతూ కాప్రా ప్రెస్ క్లబ్ పరిధిలోని జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. తమపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో నూతన సభ్యులకు సభ్యత్వాలు అందజేస్తామని పేర్కొన్నారు.

*అభినందనల వెల్లువ*

కాప్రా ప్రెస్ క్లబ్ నూతన కమిటీకి పలువురు రాజకీయ, సామాజిక నాయకులు అభినందనలు తెలిపారు. అధ్యక్షుడు మెరుగు చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శి ముత్యం ముఖేష్ గౌడ్, కోశాధికారి రామచంద్రమూర్తి సహా కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు.ఏఎస్ రావు నగర్ డివిజన్ మాజీ





కార్పొరేటర్లు సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి, పజ్జూరి పావనిరెడ్డి, కొత్త రామారావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బొజ్జ రాఘవరెడ్డి, కొత్త అంజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఏఎస్ రావు నగర్ డివిజన్ అధ్యక్షుడు కేశెట్టి ప్రసాద్, తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి నీరుకొండ సతీష్ బాబు, బీజేపీ చర్లపల్లి డివిజన్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్, సీనియర్ నాయకుడు కనుకుల రజినీకాంత్ రెడ్డి, బీఆర్ఎస్ ఏఎస్ రావు నగర్ డివిజన్ అధ్యక్షుడు కాసం మహిపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పెద్దాపురం కుమారస్వామి, నాయకుడు ఎస్.ఏ. రహీమ్ తదితరులు అభినందనలు తెలియజేశారు.

# బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి

**- మాజీ ఎస్సి కార్పొరేషన్ చైర్మన్ వై. నరోత్తం డిమాండ్...**

**జహీరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 25:**

రాష్ట్రంలో బీసీ వర్గాలపై పెత్తందారుల దాడులు పెరుగుతున్నాయని మాజీ ఎస్సి కార్పొరేషన్ చైర్మన్ వై. నరోత్తం తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. నాగర్కర్నూల్ జిల్లాలోని కుమ్మెర గ్రామంలో చోటుచేసుకున్న దారుణ ఘటనపై ఆయన ఖండన వ్యక్తం చేస్తూ, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామంలో నిర్వహించిన మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా రజక దంపతులు స్వామివారి దర్శనం కోసం ఆలయంలోకి ప్రవేశించగా, కొందరు పెత్తందారులు వారిపై దాడికి దిగినట్లు సమాచారం. దర్శనం కోసం వెళ్లిన కుటుంబంపై అమానుషంగా దాడి చేయడం మాత్రమే కాకుండా, అడ్డుకున్న కుటుంబ సభ్యుల వేడుకోళ్లను పట్టించుకోకుండా దౌర్జన్యానికి పాల్పడటం అత్యంత దుర్మార్గమని నరోత్తం పేర్కొన్నారు. ఈ ఘటనలో పసిబిడ్డను కాళ్లతో తన్నడంతో తీవ్రంగా గాయపడిన బిడ్డ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడం సమాజాన్ని కలచివేసిందన్నారు. నిరపరాధులపై ఇలాంటి కిరాతక దాడులు జరగడం రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితిపై సందేహాలు కలిగిస్తోందని ఆయన విమర్శించారు. సామాజికంగా వెనుకబడిన వర్గాలపై దౌర్జన్యాలు



అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, పసిపాప మృతికి కారణమైన నిందితులను వెంటనే అరెస్ట్ చేసి చట్టపరంగా కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. అలాగే బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందించడంతో పాటు భద్రత కల్పించాలని కోరారు. సమాజంలో సామరస్య వాతావరణం నెలకొల్పడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని వై. నరోత్తం సూచించారు.

# రంజోల్ బాలికల గురుకుల పాఠశాలలో నేల ఆరోగ్యం పై శిక్షణ కార్యక్రమం





**జహీరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 25:**

రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం లో భాగంగా నేల ఆరోగ్యం మరియు భూసారం పరీక్ష విధానం పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం సంగారెడ్డి జిల్లా రంజోల్ బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపికైన 50 మంది విద్యార్థినులకు మట్టి నమూనాల సేకరణ విధానం, పరీక్ష ప్రక్రియ మరియు ఫలితాల విశ్లేషణపై విస్తృత అవగాహన కల్పించారు. విద్యార్థినులు రైతుల పొలాల వద్దకు వెళ్లి మొత్తం 200 మట్టి నమూనాలను సేకరించనున్నారు. పరీక్షలు పూర్తయిన అనంతరం ఆ ఫలితాలను అంతర్జాలంలో నమోదు చేసి, సంబంధిత మట్టి పరీక్ష ఫలితాల కార్డులను రైతులకు అందజేయనున్నారు. అలాగే, గ్రామాల వారీగా రైతులకు మట్టి పరీక్షల ప్రాముఖ్యతను వివరించి, పరీక్ష ఫలితాల ఆధారంగా పంటలకు అవసరమైన ఎరువుల మోతాదును సూచించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా పేర్కొన్నారు. మండల వ్యవసాయ అధికారి లావణ్య మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 292 పాఠశాలలను ఈ కార్యక్రమానికి ఎంపిక చేయగా, జహీరాబాద్ మండలంలో రంజోల్ బాలికల గురుకుల పాఠశాల ఎంపిక కావడం గర్వకారణమని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్ర భూసార నిపుణులు స్వామి మరియు అగ్రానమీ నిపుణులు రమేష్ పాల్గొని విద్యార్థులకు ప్రాయోగిక అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సృజన, ఉపాధ్యాయులు కీర్తి, అస్మా, వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రదీప్ కుమార్, వీరేందర్ మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో అంగన్వాడీ ఉపాధ్యాయురాలు మీరా భాయ్ మృతి

**జహీరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 26:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణ పరిధిలోని 27వ వార్డు సుభాష్ గంజ్ అంగన్వాడీ కేంద్రంలో టీచర్గా విధులు నిర్వహిస్తున్న మీరా భాయ్ అనారోగ్య కారణాలతో హైదరాబాద్ లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రోజు ఉదయం మృతి చెందారు. మీరా భాయ్ మృతి పట్ల వార్డు ప్రజలు, తోటి అంగన్వాడీ సిబ్బంది తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆమె అందరితో కలుపుగోలుగా మెలుగుతూ పిల్లల పట్ల అపారమైన మమకారం చూపేవారని గుర్తు చేసుకున్నారు. చిన్నారుల భవిష్యత్తు కోసం అంకితభావంతో పనిచేసిన ఉపాధ్యాయురాలిగా ఆమెకు మంచి పేరు ఉందని పేర్కొన్నారు. మృతురాలి కుటుంబ సభ్యులను నామ సుభద్రమ్మ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు నామ రవి కిరణ్ పరామర్శించి, ఈ కష్టకాలంలో కుటుంబానికి అండగా





ఉంటామని హామీ ఇచ్చారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ సుశీల ఆదేశాల మేరకు సూపర్వైజర్లు అనిత కుమారి, సునీత బాయిలు శాఖ తరపున రూ.20,000 చెక్కును కుటుంబానికి అందజేశారు. అదనంగా నామ రవి కిరణ్ రూ.10,000 ఆర్థిక సహాయం చేశారు. మీరా భాయ్ మృతి పట్ల స్థానికులు, సహచర సిబ్బంది తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు

## తపస్ కృషి ఫలితంగా మెదక్ జిల్లాకు పదవ తరగతి మూల్యాంకన కేంద్రం మంజూరు




**మెదక్ వెలుతురు ఫిబ్రవరి 25:**

ఇప్పటివరకు మెదక్ జిల్లాలో టెన్త్ మూల్యాంకన కేంద్రం లేని కారణంగా సంగారెడ్డి జిల్లాలోని బీహెచ్ ఎల్ కి వెళ్లి స్పాట్ లో పాల్గొనాల్సి వచ్చేది.మెదక్ జిల్లా ప్రాంత ఉపాధ్యాయులకు తీవ్ర ఇబ్బందులు పడాల్సివచ్చేది.10 ఏళ్లుగా తపస్ చేసిన అలుపెరుగని పోరాటం వల్ల ఇప్పుడు మెదక్ జిల్లా కేంద్రంలో స్పాట్ సెంటర్ మంజూరు చేయడం మెదక్ జిల్లా ఉపాధ్యాయుల చిరకాల వాంఛ నెరవేరిందని మెదక్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జిడ్డి ఎల్లం, జాల సిద్దు, అన్నారు. మెదక్ జిల్లా కేంద్రానికి పదవ తరగతి మూల్యాంకన కేంద్రం మంజూరుకు సహకరించిన ఎంపీ రఘునందన్ రావు గారికి, ఎమ్మెల్యే రోహిత్ రావు గారికి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య గారికి, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అంజిరెడ్డి గారికి, మెదక్ జిల్లా కలెక్టర్ గారికి,మెదక్ జిల్లా విద్యాధికారికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర నాయకులు చల్లా లక్ష్మణ్,రంగా రెడ్డి, దుబాషి భాస్కర్, ఆర్వి రామారావు, రమేష్, వెంకట్ స్వామి,తపస్ జిల్లా ఉపాధ్యక్షులు తిరునగరి నర్సిములు, శ్రీధర్ రెడ్డి, తపస్ మెదక్, నార్సింగి మండలల అధ్యక్షులు నరేందర్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## యూట్యూబర్ అన్వేష్ పై లుకౌట్ నోటీసులు

**- విదేశాల్లో ఉండడంతో పంజాగుట్ట పోలీసుల వెల్లడి**



**హైదరాబాద్,ఫిబ్రవరి25( వెలుతురు):**

యూట్యూబర్ అన్వేష్ పై పంజాగుట్ట పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేశారు. ఇటీవల ఆయన విడుదల చేసిన ఒక వీడియోలో అసభ్యకరమైన పదజాలాన్ని ఉపయోగించినట్లు ఆరోపణలు రావడంతో పోలీసులు ఈ చర్యలు తీసుకున్నారు. సోషల్ మీడియా వేదికగా చేసిన ఆ వ్యాఖ్యలు సమాజంలో వివాదాస్పదంగా మారడంతో కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. ఈ వ్యవహారంపై స్పందించిన పంజాగుట్ట పోలీస్ అధికారులు, అన్వేష్ చేసిన వ్యాఖ్యలు చట్టపరంగా అభ్యంతరకరంగా ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం ఆయన విదేశాల్లో ఉండడంతో దేశంలోకి ప్రవేశించిన వెంటనే అదుపులోకి తీసుకునేలా లుకౌట్ నోటీసులు జారీ చేశారు. ఇటీవల అన్వేష్ తన సోషల్ మీడియా ద్వారా వీడియో విడుదల చేసి.. తనకు రెండు ఇన్స్టాగ్రామ్ అకౌంట్లు, రెండు యూట్యూబ్ ఛానల్స్ ఉన్నాయని వెల్లడించారు. ఇందులో ఆయన ప్రధాన అకౌంట్ను ఇంస్టాగ్రామ్ బ్లాక్ చేసినట్లు తెలిసింది. దీనిపై కూడా పోలీసులు దృష్టి సారించారు. ఈ కేసు దర్యాప్తు భాగంగా, అన్వేష్కు సంబంధించిన అకౌంట్ల వివరాలు, వీడియోల సమాచారం అందించాలని యూట్యూబ్, ఇన్స్టాగ్రామ్ సంస్థలకు పోలీసులు అధికారికంగా లేఖ రాయనున్నట్లు తెలిపారు. సోషల్ మీడియాలో చట్టవిరుద్ధ కంటెంట్పై కఠిన చర్యలు తీసుకుంటామని, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన పరిణామాలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

## యూరియా కోసం సిపిఎం ధర్నా

**నల్లగొండ,ఫిబ్రవరి 25( వెలుతురు):**

రాష్ట్రంలో రైతుల యూరియా కష్టాలు తప్పడం లేదు. ఆరుగాలం కష్టపడి పంటలు పండించే రైతన్నలకు కాంగ్రెస్ పాలనలో యూరియా కష్టాలు కొనసాగుతూనే ఉన్నాయి. వానకాలం, యాసంగిలోనూ ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ఒక్క బస్తా యూరియా కోసం ఉదయం నుంచి పడిగాపులు కాయాల్సిన పరిస్థితి దాపురించింది.ప్రభుత్వం కొత్తగా యాప్ తీసుకొచ్చి ఆన్లైన్లో బుక్ చేసుకోవాలని సూచించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తాజాగా నల్లగొండలో యూరియా సమస్యలు తీర్చాలని సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. పానగల్లు పీఏసీఎస్ గోదాం దగ్గర స్మార్ట్ ఫోన్ పట్టుకుని బుకింగ్ కోసం రైతులు పడుతున్న ఇబ్బందులను తొలగించాలన్నారు. సమస్య పరిష్కారం అయ్యేంత వరకు ఉద్యమిస్తామని హెచ్చరించారు.

## మెడికల్ కాలేజీల్లో 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ

**హైదరాబాద్,ఫిబ్రవరి25( వెలుతురు):**

ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ చేయనున్నారు.ఈ మేరకు మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్మెంట్ బోర్డు..అభ్యర్థుల వివరాలు విడుదల చేసింది. ఈ నెల 28వ తేదీ వరకూ అభ్యంతరాల స్వీకరణకు గడువు విధించారు. అభ్యంతరాల పరిశీలన అనంతరం మెరిట్ లిస్ట్ విడుదల చేయనున్న బోర్డు. మార్చి చివరి నాటికి ఉద్యోగాల్లో చేరనున్న కొత్త అసిస్టెంట్ ప్రొఫెసర్లు అని పేర్కొంది.

# వేర్వేరు ప్రాంతాల్లో ప్రేమ జంట ఆత్మహత్య

**వనపర్తి, ఫిబ్రవరి25( వెలుతురు):**

వనపర్తి జిల్లాకు చెందిన ప్రేమ జంట వేర్వేరు ప్రాంతాల్లో ఆత్మహత్యకు పాల్పడిన ఘటన విషాదం నింపింది. వనపర్తి జిల్లా పానగల్ మండలం అన్నారం గ్రామానికి చెందిన కేత్రావత్ వసంత అనే యువతి బాసర ఐఐటీ హాస్టల్‌లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వనపర్తి మండలం అప్పయ్య పల్లి శివారులోని కిర్యా తండా చెందిన గణెళిష్ కూడా ఆత్మహత్య చేసుకుని చనిపోయాడు. ఈ ఇద్దరు చనిపోవడానికి ప్రేమ వ్యవహారమే కారణంగా పోలీసులు భావిస్తున్నారు. వసంత, గణెళిశ్.. ఇద్దరూ బంధువులు అని తెలిసింది. వసంత ఇంజినీరింగ్ సెకండియర్ చదువుతుంది. వసంత హాస్టల్ గదిలో ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసి పోలీసులు స్పాట్ కు వెళ్లారు. వసంత మృతదేహాన్ని భైంసా అసుపత్రికి తరలించారు. వసంత తల్లిదండ్రులకు కాల్ చేసి విషయం చెప్పారు. భైంసా ఆసుపత్రి ముందు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. హాస్టల్?లో రూమ్?మేట్స్?ను, ఐఐటీ క్యాంపస్?లో వసంత ఫ్రెండ్స్ ను పోలీసులు ఆమె గురించి ఆరా తీశారు. వసంత ప్రేమలో ఉందనే విషయం మాత్రం పోలీసులు విచారణలో స్పష్టమైంది. గణెళిష్, వసంత కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారని ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది.

# జగద్గిరిగుట్టలో 14 తులాల బంగారం అపహరణ

## - పక్కా ఆధారాలతో నిందితుడి అరెస్టు

**హైదరాబాద్, ఫిబ్రవరి25( వెలుతురు):**

బయటకు వెళ్తూ ఇంటి తాళం చెవిని దాచిన చోటే దొంగకు దొరకడంతో.. పని సులువైందనుకున్నాడో దొంగ. అదను చూసి ఇంట్లోకి ప్రవేశించి 14 తులాల బంగారు ఆభరణాలను దోచి ఉడాయించాడు. ఈ ఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్లమ్మబండలో వెలుగుచూసింది. జగద్గిరిగుట్ట డిటెక్టివ్ ఇన్ స్పెక్టర్ నరేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లమ్మబండ దత్తాత్రేయ కాలనీకి చెందిన రేకపల్లి లక్ష్మి (63) ఈ నెల 23న సాయంత్రం 4.30 గంటల సమయంలో ఇంటికి తాళం వేశారు. ఆ తాళం చెవిని తలుపు పక్కనే ఉన్న డ్రమ్ కింద దాచి బయటకు వెళ్లారు. అయితే ఆమె తాళం దాస్తున్న విషయాన్ని అదే కాలనీకి చెందిన పత్రో శంకర్ (36) గమనించాడు. ఆమె వెళ్లగానే నిందితుడు డ్రమ్ కింద ఉన్న తాళంతో తలుపులు తీసి లోపలికి ప్రవేశించాడు. టీవీ టేబుల్‌పైనే ఉన్న అల్మారా తాళం చెవులతో లాకర్‌ను తెరిచి అందులోని సుమారు 14 తులాల బంగారు నగలను దొంగిలించి పరారయ్యాడు. అదే రోజు సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ఇంటికి చేరుకున్న లక్ష్మి దంపతులు, అల్మారా తెరిచి ఉండటం చూసి ఆందోళన చెందారు. నగలు పోయినట్లు గుర్తించి వెంటనే జగద్గిరిగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు విశ్వసనీయ సమాచారం మేరకు, సాంకేతిక ఆధారాల లతో నిందితుడు పత్రో శంకర్‌ను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడు దొంగతనం విషయమై అంగీకరించాడు. అతని వద్ద నుంచి ఒక బంగారు హారం, నల్లపూసల గొలుసు, మూడు పొరల గొలుసు, లాకెట్ ఉన్న గొలుసు, నాలుగు ఉంగరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

# ఇంటర్ పరీక్షలకు సైబరాబాద్ పోలీసుల పటిష్ట బందోబస్తు

## - ప్రత్యేక పోలీస్ బృందాలతో విద్యార్థులకు సహకారం

**హైదరాబాద్, ఫిబ్రవరి25( వెలుతురు):**

ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమైన నేపథ్యంలో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పరీక్షల నిర్వహణకు, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద ట్రాఫిక్ నియంత్రణతో పాటు ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి విద్యార్థులకు అవసరమైన సాయం అందిస్తున్నారు. జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో మొత్తం 11 పరీక్షా కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ప్రతి కేంద్రం వద్ద పోలీస్ సిబ్బందిని నియమించి భద్రతా ఏర్పాట్లు చేశారు. ఆలస్యంగా వచ్చిన విద్యార్థులు లేదా తప్పుడు అడ్రస్‌తో వేరే కేంద్రానికి చేరుకున్న వారిని వెంటనే గుర్తించి, పోలీస్ వాహనాల ద్వారా సంబంధిత పరీక్షా కేంద్రాలకు చేర్చారు. ఇప్పటివరకు దాదాపు నలుగురు విద్యార్థులను సైబరాబాద్ పోలీసులు సరైన పరీక్షా కేంద్రాలకు చేర్చారు. పరీక్షల బందోబస్తును పరిశీలించేందుకు కుత్బుల్లాపూర్ ఏసీపీ బాల గంగిరెడ్డి కేంద్రాలను సందర్శించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కట్టుదిట్టమైన భద్రతతో పాటు సహాయక చర్యలు కొనసాగించాలని సిబ్బందిని ఆదేశించారు. ఇంటర్ పరీక్షల సందర్భంగా పేట్‌బషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ విజయ్ వర్ధన్ బందోబస్తు సిబ్బందిని సమీక్షించి, పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. పోలీసుల తక్షణ సాయానికి విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

# కోమలి ఆత్మహత్య ఘటనలో విషాదం

## - ప్రేమికుడి తిరస్కరణతోనే ఆత్మహత్య



**హైదరాబాద్, ఫిబ్రవరి25( వెలుతురు):**

రాయదుర్గం పరిధిలో ప్రముఖ యూట్యూబర్ కోమలి ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మణికొండ చిత్రపురి కాలనీలో తన మామ ఇంట్లో ఉంటోంది. మల్లారెడ్డి యూనివర్సిటీలో డిగ్రీ చదువుతు.. పార్ట్ టైమ్‌లో యూట్యూబ్ వీడియోలు చేస్తుంది. అయితే.. కోమలి అఖిల్ రెడ్డి అనే యువకుడిని ప్రేమించింది. పలు కారణాల వల్ల వీరిద్దరూ విడిపోయారు. ప్రస్తుతం అఖిల్ అండ్ ఫ్యామిలీ పరారీలో ఉంది. కోమలి ఆత్మహత్యకి ఒకరోజు ముందు కోమలి ఫ్లాట్‌కు అఖిల్ వెళ్లి ఆ యువతితో మాట్లాడాడు. తనను ప్రేమించి.. మరో అమ్మాయితో ప్రేమలో ఉండటాన్ని కోమలి జీర్ణించుకోలేక పోయింది.. ఇద్దరు అమ్మాయిలతో ప్రేమాయణం నడిపించాడు అఖిల్.. ఆత్మహత్యకి ముందు అఖిల్‌కి కోమలి మెసేజ్ చేసింది. ఈ విషయాన్ని తన అక్కకు చెప్పాడు అఖిల్.. అఖిల్ అక్క కోమలి ఫ్లాట్‌కి వెళ్ళి డోర్ కొట్టింది. ఎంతసేపటికీ తీయకపోవడంతో తిరిగి వెళ్లిపోయింది కానీ.. పోలీసులకు సమాచారం ఇవ్వలేదు. ఇదిలా ఉండగా.. కోమలికి ఫ్లాట్‌లో సూసైడ్ లెటర్ లభ్యమైంది. దీన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 'నేను ముందుకు సాగడానికి భయపడుతున్నాను.. ఎందుకంటే అతను తిరిగి వస్తే? వదిలేయాలి అని నాకు తెలుసు. అతను నా వాడు కాదు అని తెలుసు.. అతను నాతో ఉండడానికి కూడా ప్రయత్నించడం లేదు అని తెలుసు.. కానీ నా లోపల చిన్న భాగం ఇంకా ఎదురు చూస్తోంది.. ఇంకా ఆశిస్తోంది.. ఒక రోజు అతను నన్నే ఎంచుకుంటాడని నా మనసు ఊహిస్తోంది. అందుకే ముందుకు సాగడం అసాధ్యంగా అనిపిస్తోంది.. ఎందుకంటే నేను చివరికి వెనక్కి తిరిగి నడిచి వెళ్లిన క్షణంలో.. అతను తిరిగి వచ్చి నన్ను వెతికితే..' అని సూసైడ్ లెటర్‌లో రాసుకొచ్చింది.

# ఎస్ఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా టి. రాజేష్ ఎన్నిక

## - విద్యార్థుల సమస్యలపై ఉద్యమాలకు శ్రీకారం చుడతాం...

**జహీరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 25:**



భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) సంగారెడ్డి జిల్లా 8వ మహాసభలు ఈ నెల 20, 21 తేదీలలో జహీరాబాద్ పట్టణంలో ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించబడ్డాయి. జిల్లాలోని వివిధ మండలాల నుండి భారీగా విద్యార్థి ప్రతినిధులు హాజరై సంస్థ భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఈ మహాసభల్లో కోహీర్ మండలం పిచ్చేరాగడి గ్రామానికి చెందిన టి. రాజేష్‌ను ఎస్ఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొత్త జిల్లా కమిటీని కూడా ఈ సందర్భంగా ప్రకటించారు. అధ్యక్షుడిగా ఎన్నికైన అనంతరం టి. రాజేష్ మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని తెలిపారు. జిల్లాలో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఫీజుల పెంపు, హాస్టల్ సదుపాయాల లోపం, అధ్యాపకుల ఖాళీలు, స్కాలర్‌షిప్‌ల ఆలస్యం వంటి సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. విద్యా రంగానికి తగిన ప్రాధాన్యత ఇవ్వడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ఆయన విమర్శించారు. కొఠారి కమిషన్ సిఫారసుల ప్రకారం కేంద్ర ప్రభుత్వం జిడిపిలో కనీసం 10 శాతం నిధులు విద్యారంగానికి కేటాయించాల న్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా తన బడ్జెట్‌లో కనీసం 30 శాతం నిధులు విద్యకు కేటాయించి ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాబోయే బడ్జెట్‌లో విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు ప్రకటించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపర్చాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో విద్యార్థి సమస్యలపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు, ధర్నాలు, ర్యాలీలు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని టి. రాజేష్ తెలిపారు. విద్యార్థుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతామని ఆయన స్పష్టం చేశారు.

# వృత్తిదారుల సంక్షేమానికి రాష్ట్ర బడ్జెట్ లో 25 వేల కోట్లు కేటాయించాలి

## - మార్చి 17న ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా కు వేలాదిగా తరలిరండి
## - చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ పిలుపు

**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 25:**



రాష్ట్ర ప్రభుత్వం మార్చిలో ప్రవేశపెట్టబోయే బడ్జెట్ లో చేతివృత్తిదారుల సంక్షేమానికి 25000 కోట్లు కేటాయించాలని చేతి వృత్తి దారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ యం.వి.రమణ డిమాండ్ చేశారు. మంగళవారం రోజున హైదరాబాద్ రాంనగర్ లోని వృత్తిదారుల భవనంలో మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృత్తిదారుల సంక్షేమానికి కార్పొరేషన్లు, ఫెడరేషన్లు ఉన్నప్పటికీ ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ఎలాంటి సంక్షేమ పథకాలు చేపట్టలేదని అన్నారు. ఈ ఫెడరేషన్ లు ఉత్సవ విగ్రహాలుగా మారాయి. రోజువారిగా వృత్తులు చేస్తూ జీవిస్తున్న వీరికి ప్రోత్సాహమే లేదు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలు అమలు చేయలేదని దుయ్యబట్టారు. 50 సంవత్సరాల పైబడిన వృత్తిదారులందరికీ 4 వేల పెన్షన్ అమలు చేయాలని, పెండింగ్ ఎక్స్‌గ్రేషియా డబ్బులు వెంటనే విడుదల చేయాలని, అన్ని రకాల వృత్తిదారులందరికీ బీమా సౌకర్యం కల్పించాలని అన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా కొమ్మెర గ్రామంలో గుడిలోకి వచ్చిన రజక మహిళ, దళితులపై గ్రామ పెత్తందారులు దాడి చేసి పసిపాపను చంపిన ఘటనను సమావేశం తీవ్రంగా ఖండించింది. దోషులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేసింది. మార్చిలో ప్రవేశపెట్టబోయే బడ్జెట్ లో 25 వేల కోట్లు నిధులు కేటాయించాలని, బీసీ సబ్ ప్లాన్ చట్టం చేయాలని, బీసీలకు విద్యా, ఉద్యోగం, స్థానిక సంస్థల ఎన్నికలలో 42 శాతం రిజర్వేషన్స్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మార్చి 17వ తేదీన ఇందిరా పార్క్ వద్ద మహా ధర్నా నిర్వహిస్తున్నామని దీనికి వృత్తిదారులందరూ వేలాదిగా తరలి రావాలని వృత్తి సంఘాల నేతలు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో గొర్రెలు మేకల పెంపకందార్ల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కిల్లె గోపాల్, ఉడుత రవీందర్, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు గోరెంకల నర్సింహా, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి. వెంకట నరసయ్య, బ్యాండ్ వాయిద్య కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి జి. నాగరాజు, రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎదునూరి మదర్ ,చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి గంజి మురళి, విశ్వకర్మ వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి రాళ్ల బండి కుమారస్వామి, యాదగిరి చారి తదితరులు పాల్గొన్నారు.

# దొంగతనాలకు అలవాటు పడ్డ ఉద్యోగి

**విజయవాడ, ఫిబ్రవరి25( వెలుతురు):**

ఎన్టీఆర్ జిల్లా తిరువూరు రూరల్ మండలం చిక్కుళ్లగూడెం గ్రామంలో జరిగిన చోరీ కేసును పోలీసులు చేదించారు. చోరీకి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేశారు. నిందితుడిని విజయవాడకు చెందిన ప్రభుత్వ ఉద్యోగి అసిస్టెంట్ లైన్‌మెన్ నంద సుభాష్‌గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నంద సుభాష్ చెడు వ్యసనాలకు బానిసై నేరాలకు పాల్పడుతున్నాడు. ఈ నేపథ్యంలోనే తిరువూరు మండలం గానుగపాడు గ్రామంలో బైక్ చోరీ చేశాడు. దొంగిలించిన బైక్‌పైనే వృద్ధురాలైన ఉప్పు అనసూర్య మెడలో 40 గ్రాముల బంగారు నాన్తాడు చైన్‌ను లాక్కెళ్లిపోయాడు. తిరువూరు సీఐ కే. గిరిబాబు నిందితుడిని లక్ష్మీపురం శివారులో అరెస్టు చేశారు. దొంగిలించిన బంగారంతో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# భవన నిర్మాణాలు పరిశీలించిన కేంద్ర కార్యదర్శి

**గుంటూరు, ఫిబ్రవరి25( వెలుతురు):**

గుంటూరు జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులను కేంద్ర పంచాయతీ రాజ్ కార్యదర్శి సునీల్ కుమార్ బుధవారం పరిశీలించారు. నిర్మాణ పనులకు అవసరమైన నిధులను గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిధుల మంజూరుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ కృష్ణ తేజకు సూచించారు. పంచాయతీ రాజ్ దినోత్సవం నాటికి ఆ భవనాలను ప్రారంభించేలా పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట జడ్పీ సీఈఓ జ్యోతిబసు, డీపీఓ నాగసాయి కుమార్ పలువురు అధికారులు ఉన్నారు.

# చెవినొప్పితో ఆస్పత్రికి వెళితే..ఘోరం

## - డాక్టర్ల నిర్లక్ష్యంతో యువకుడు మృతి




**నిజామాబాద్, ఫిబ్రవరి25( వెలుతురు):**

జిల్లాలో ఘోరం జరిగిపోయింది. చెవి నొప్పితో ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చేరిన యువకుడు మృతి చెందటం తీవ్ర విషాదాన్ని నింపింది. చేతికొచ్చిన కొడుకు అర్ధంతరంగా చనిపోవడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. దీంతో హాస్పిటల్ పరిసరాల్లో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. వివరాల్లోకి వెళ్తే.. భీంగల్ మండలం పల్లికొండ గ్రామానికి చెందిన గంగం అజయ్ మంగళవారం చెవి నొప్పితో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరాడు. అజయ్ కండిషన్ చూసిన వైద్యులు ఆపరేషన్ చేయాలని చెప్పారు. ఆపరేషన్ కోసం మత్తు మందు ఇచ్చిన తర్వాత అజయ్ చనిపోయాడు. దీంతో ఆస్పత్రి వైద్యులు, మత్తు వైద్యుల నిర్లక్ష్యం మూలంగా అజయ్ మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఆస్పత్రిలో వెంటిలేటర్, ఎలాంటి సౌకర్యాలు లేవు అంటూ కుటుంబ సభ్యులు ఆరోపించారు. చేతికొచ్చిన కొడుకు చనిపోయాడని.. న్యాయం చేయాలంటూ కుటుంబ సభ్యులు హాస్పిటల్ ముందు ఆందోళనకు దిగారు. హాస్పిటల్ ఎదుటనే అజయ్ మృతదేహాన్ని దహనం చేస్తామని డీజిల్ డబ్బాతో ఆందోళనకు దిగారు కుటుంబ సభ్యులు. దీంతో అక్కడ పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. వైద్యుల నిర్లక్ష్యంతో అజయ్ మృతి చెందారని కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆపరేషన్ సమయంలో ఎక్కువ మోతాదులో మత్తు మందు ఇవ్వటం వల్లనే అజయ్ మృతి చెందారని ఆందోళనకు దిగారు. ఆ క్రమంలో పోలీసులకు, కుటుంబ సభ్యులకు మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది.

# సిఐడి నుంచి సైబరాబాద్‌కు రెండు జాగిలాలు

## - 18కి చేరిన జాగిలాల సంఖ్య

**హైదరాబాద్, ఫిబ్రవరి25( వెలుతురు):**



తెలంగాణ రాష్ట్ర సిఐడి నుంచి రెండు పోలీస్ కేనైన్‌లు సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌కు రిపోర్ట్ చేసినట్లు సిఎస్‌డబ్ల్యూ హెడ్‌క్వార్టర్స్ ఏడీసీపీ హనుమంతరావు తెలిపారు. ఈ రెండు కేనైన్‌లతో కలిపి ప్రస్తుతం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న పోలీస్ జాగిలాల మొత్తం సంఖ్య 18కి చేరిందన్నారు. వీటిలో పేలుడు పదార్థాల గుర్తింపుకు 12, మాదకద్రవ్యాల గుర్తింపుకు 2, ట్రాకర్ జాగిలాలు 4 ఉన్నాయని చెప్పారు. సిఐడి నుంచి రిపోర్ట్ చేసిన కేనైన్‌లలో 'రానా' (బెల్జియన్ మాలినోయిస్, 4 ఏళ్లు), 'రాడో' (లాబ్రడార్, 10 ఏళ్లు) ఉన్నాయని వెల్లడించారు. నేరాల ఛేదన, పేలుడు పదార్థాల గుర్తింపు, ట్రాకింగ్ వంటి కీలక విధుల్లో ఈ కేనైన్‌లు ముఖ్య పాత్ర పోషిస్తున్నాయని ఏడీసీపీ తెలిపారు. బీడీ టీం ఆర్ఐ నాగరాజు సారథ్యంలో, ఆర్ఎస్ఐ వెంకటేష్ సహకారంతో ఈ కేనైన్‌ల సేవలు మరింత సమర్థంగా వినియోగంలోకి వస్తాయని పేర్కొన్నారు. పోలీస్ కేనైన్‌లను విధుల ప్రకారం విభజించారని తెలిపారు. పేలుడు పదార్థాల గుర్తింపు కేనైన్‌లు ప్రముఖుల కార్యక్రమాలు, ప్రజా ప్రతినిధుల సమావేశాలు, యాంటీ సబోటాజ్ చెకింగ్, బెదిరింపు కాల్స్ వంటి సందర్భాల్లో ఉపయోగపడుతున్నాయని వివరించారు. ట్రాకర్ కేనైన్‌లు నిందితులను గుర్తించడం, మిస్సింగ్ వ్యక్తులు లేదా వస్తువులను వెతకడం, సాక్ష్యాలు కనుగొనడంలో దర్యాప్తుకు సహాయపడుతున్నాయన్నారు. నార్కోటిక్ కేనైన్‌లు గంజాయి, కొకైన్, మెతాంఫెటమైన్, ఓపియం, ఎండీఎంఏ, హెరాయిన్ వంటి మాదకద్రవ్యాలను గుర్తించడంలో కీలకంగా పనిచేస్తున్నాయన్నారు. సైబరాబాద్ పోలీస్ కే9 స్క్వాడ్ విభాగం జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా ప్రతిభ చాటుతోందని తెలిపారు. నార్కోటిక్ కేటగిరీకి చెందిన కేనైన్ 'తేజ' 2024-25లో రాంచీలో జరిగిన 68వ ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్‌లో కాంస్య పతకం సాధించడంతో పాటు, హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ పోలీస్ డ్యూటీ మీట్‌లో కూడా కాంస్య పతకం గెలుచుకుందన్నారు. పేలుడు పదార్థాల గుర్తింపు కేటగిరీకి చెందిన కేనైన్ 'రీనా' తెలంగాణ పోలీస్ డ్యూటీ మీట్ 2024లో హైదరాబాద్‌లో, అలాగే 2025లో వరంగల్‌లో జరిగిన పోటీల్లో కాంస్య పతకాలు సాధించిందని పేర్కొన్నారు. బ్రీడ్‌ల వారీగా లాబ్రడార్ బ్రీడ్‌కు చెందిన కేనైన్‌లు ఎక్కువగా ఉండగా, డోబర్‌మాన్, బెల్జియన్ మాలినోయిస్ బ్రీడ్‌ల కేనైన్‌లు కూడా సేవలందిస్తున్నాయి. లాబ్రడార్ బ్రీడ్ కెనడా మూలాలు కలిగి బ్రిటన్‌లో అభివృద్ధి చెందినదిగా, డోబర్‌మాన్ జర్మనీకి చెందినదిగా, బెల్జియన్ మాలినోయిస్ బెల్జియంకు చెందిన ప్రత్యేక శిక్షణ బ్రీడ్ అని తెలిపారు.

# ప్రేమపేరుతో మోసం చేసిన యువకుడు

## - బెయిల్ ఇచ్చేందుకు ఢిల్లీ హైకోర్టు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి25( వెలుతురు):**

ప్రేమ పేరుతో యువతిని మోసం చేసిన ఓ యువకుడికి ఢిల్లీ హైకోర్టు షాక్ ఇచ్చింది. ప్రియురాలిని మోసం చేసిన కేసులో అరెస్టైన అతడికి బెయిల్ ఇవ్వడానికి నిరాకరించింది. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. ఢిల్లీకి చెందిన ఓ యువకుడు పెళ్లి చేసుకుంటానని నమ్మించి ప్రియురాలితో శారీరక సంబంధం పెట్టుకున్నాడు. ఆ తర్వాత జాతకాలు కలవలేదన్న సాకుతో పెళ్లికి నిరాకరించాడు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ప్రేమ పేరుతో మోసం చేశాడంటూ కేసు పెట్టింది. ఐపీసీ 376, బీఎన్ఎస్ సెక్షన్ 69 కింద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రియుడిని అరెస్ట్ చేశారు. అతడు బెయిల్ కోసం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించాడు. విచారణ జరిపిన హైకోర్టు అతడికి బెయిల్ ఇవ్వడానికి నిరాకరించింది. కాలేజీ రోజుల నుంచే ఇద్దరికీ పరిచయం ఉన్నట్లు కోర్టు గుర్తించింది. వివాహం చేసుకుంటానని అతడు పలు మార్లు ప్రియురాలికి హామీ ఇచ్చినట్లు తేల్చింది. ప్రేమికుల వాట్సాప్ చాట్స్‌ను కోర్టు పరిశీలించింది. నిందితుడు గతంలో జాతకాలు సరిపోయాయని చెప్పిన ఆధారాలు ఉన్నట్లు హైకోర్టు గుర్తించింది. అంతేకాదు.. సన్నిహితంగా ఉన్నపుడు దిగిన ఫోటోలు లీక్ చేస్తానని నిందితుడు యువతిని బెదిరించిన విషయం కూడా కోర్టు దృష్టికి వచ్చింది.

# హైకోర్టులో ఐపిఎస్ అధికారి నాయక్ ముందస్తు బెయిల్

**అమరావతి, ఫిబ్రవరి25( వెలుతురు):**

ఏపీ హైకోర్టులో ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్ బుధవారం ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ప్రస్తుత ఎమ్మెల్యే, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణం రాజు కస్టోడియల్ టార్చర్ కేసులో గుంటూరు నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో సునీల్ నాయక్‌పై కేసు నమోదైన విషయం తెలిసిందే. రఘురామ అరెస్ట్ సమయంలో ఏపీ సీఐడీ ఎస్పీగా ఆయన ఉన్నారు. రెండు రోజుల క్రితం సునీల్ నాయక్‌ను అరెస్ట్ చేసేందుకు ఎస్పీ దామోదర్ బిహార్ వెళ్లారు. ఈ క్రమంలోనే ట్రాన్సిట్ వారెంట్ ఇచ్చేందుకు నిరాకరించింది బిహార్ కోర్టు. దీంతో ఏపీ హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్‌ను దాఖలు చేశారు సునీల్ నాయక్. ముందస్తు బెయిల్ పిటిషన్ రేపు(గురువారం) విచారణకు వచ్చే అవకాశం ఉంది.

# గ్రేటర్ పై గులాబీ గురి

**హైదరాబాద్, ఫిబ్రవరి 25( వెలుతురు):**
పల్లె పోరులో అంతో ఇంతో సత్తా చాటాం. పురపోరులోనూ పరువు కాపాడుకున్నాం. అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటిన గ్రేటర్ పరిధిలో మాత్రం రెండు సిట్టింగ్ సీట్లను ఉపఎన్నికల్లో నిలబెట్టుకోలేకపోయాము. ఈసారి ఇక రూట్ మార్చాల్సిందే. గ్రేటర్ మీద పట్టు సాధించాల్సిందే. ఇందుకోసం పూర్తిగా ఎన్నికలపైనే ఫోకస్ పెట్టాలని డిసైడ్ అయింది ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ. గ్రేటర్ పరిధిలో కొత్తగా ఏర్పాటైన మూడు కార్పొరేషన్లకు ఎప్పుడు ఎన్నికలు వచ్చినా తిరిగి జెండా పాతాల్సిందేనని ఇప్పటినుంచే గ్రౌండ్ వర్క్ చేస్తోందట కారు పార్టీ. బీఆర్ఎస్ అప్పుడే గ్రేటర్ ఎన్నికలపై ఫోకస్ చేయడానికి రీజనేంటి? ఈ ఎన్నికల్లో గెలుపోటములు బీఆర్ఎస్‌పై ఎలాంటి ప్రభావం చూపబోతున్నాయి? త్వరలోనే జరిగే గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలపై అప్పుడే స్పెషల్ ఫోకస్ పెట్టింది ప్రతిపక్ష బీఆర్ఎస్. బల్దియా ఎన్నికల్లో కచ్చితంగా తమదే పైచేయి కావాలని కసి మీదుంది. తెలంగాణకు గుండె లాంటి గ్రేటర్ హైదరాబాద్ లో వన్ థర్డ్ అసెంబ్లీ సీట్లు ఉంటాయి. పైగా డీలిమిటేషన్ జరిగి సీట్ల సంఖ్య పెరిగితే కూడా గ్రేటర్ పరిధిలో కొత్త నియోజకవర్గాలు సంఖ్య మరింత పెరుగనుంది. దీంతో గ్రేటర్ తో పాటు కొత్తగా ఏర్పడిన సైబరాబాద్, మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో సత్తా చాటాలని భావిస్తోందట గులాబీదళం.గ్రేటర్‌పై పట్టు కోల్పోతే మళ్లీ అధికారంలోకి రావడం కష్టమని భావిస్తున్నారట గులాబీబాస్ కేసీఆర్. అందుకే గ్రేటర్ ఎన్నికలు ఎప్పుడు జరిగినా సరే పూర్తి ప్రిపరేషన్‌లో పడిపోయిందట కారు పార్టీ. ఎక్కడిక్కడ లీడర్లను అలర్ట్ చేసి..ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇంచార్జ్‌లను అప్రమత్తం చేసి రెగ్యులర్‌గా ఫీల్డ్‌లోనే ఉండాలని సూచించారట పార్టీ పెద్దలు. మరో వారం, పది రోజుల్లో ఇంచార్జ్‌లను కూడా ప్రకటించి ఇప్పటినుంచే క్షేత్రస్థాయిలో పనిచేసేలా వ్యూహరచన కూడా రెడీ చేస్తున్నారట. గ్రేటర్ ప్రజల్లో ప్రభుత్వం మీదున్న వ్యతిరేకత, గతంలో తమ సర్కార్ హయాంలో చేసిన అభివృద్ధి, మళ్లీ అధికారంలోకి వస్తే చేసే పనులను ప్రజలకు వివరించి.. తిరిగి పాగా వేయాలని భావిస్తున్నారట గులాబీ లీడర్లు. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ తన ఆధిపత్యాన్ని చాటుకుంది. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ విజయం సాధించినప్పటికీ, హైదరాబాద్ నగర పరిధిలో మాత్రం బీఆర్ఎస్ అత్యధిక స్థానాలను గెలుచుకుంది. జీహెచ్ఎంసీ పరిధిలోని మొత్తం 24 అసెంబ్లీ స్థానాలకు గాను బీఆర్ఎస్ అత్యధికంగా 15 ఎమ్మెల్యేలను గెలుచుకుంది. ఆ తర్వాత సికింద్రాబాద్ కంటోన్మెంట్, జూబ్లీహిల్స్‌కు జరిగిన ఉప ఎన్నికల్లో అధికార




కాంగ్రెస్ గెలుపొందింది. అంతే కాకుండా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ బీఆర్ఎస్ ను వదిలి కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయినప్పటికీ గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఇప్పటికీ బీఆర్ఎస్ కు 12 మంది ఎమ్మెల్యేలు ఉండటంతో వారిదే పైచేయిగా ఉంది.ఇక 2016లో జరిగిన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో అప్పుడు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ 150 డివిజన్లకుగాను 99 డివిజన్లలో గెలుపొంది రికార్డు నెలకొల్పింది. 2020 వచ్చేసరికి 56 కార్పొరేట్ సీట్లను సొంతం చేసుకుని ఎంఐఎంతో కలిసి మేయర్ సీటును కైవసం చేసుకుంది. త్వరలో జరగనున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లోను తమకే ఎక్కువ అవకాశాలు ఉన్నాయని బీఆర్ఎస్ పార్టీ భావిస్తోంది. విభజిత హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో కాస్త ఎంఐఎంకు ఎడ్జ్ ఉండే అవకాశం ఉన్నా..సైబరాబాద్, మల్కాజ్ గిరి కార్పొరేషన్లలో మాత్రం..తమకు గెలుపు అవకాశాలు ఉంటాయని లెక్కలు వేసుకుంటున్నారట.సైబరాబాద్ పరిధిలో తాము చేసిన అభివృద్ధి, మల్కాజ్ గిరి పరిధిలో చేసిన డెవలప్ మెంట్ ను ప్రజల్లోకి తీసుకెళ్లేలా పక్కా ప్లాన్ చేస్తున్నారట. గ్రేటర్ ఎన్నికలు ఎప్పుడు జరిగినా అందుకు సిద్ధంగా ఉండాలని, గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని ఇప్పటికే గులాబీ బాస్ కేసీఆర్ పార్టీ నేతలను ఆదేశించినట్లు తెలుస్తోంది. అందుకు అనుగుణంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇప్పటి నుంచే గ్రేటర్ ఎన్నికలకు సన్నద్ధం అవుతున్నట్లు సమాచారం. మొత్తానికి రానున్న అసెంబ్లీ ఎన్నికలకు వయా గ్రేటర్ రూట్ మ్యాప్ ప్లాన్ చేస్తోంది గులాబీదళం.

# ఫోటో కొట్టండి.. గిఫ్ట్ పట్టండి

**హైదరాబాద్, ఫిబ్రవరి 25( వెలుతురు):**
హైదరాబాద్‌లో ఎవరైనా తాగునీటిని వృథా చేస్తున్నారా. అయితే అది మీ కంట పడిందా.. మీకు ఒక గుడ్‌న్యూస్. ఎందుకంటే తాగు నీరు వేస్ట్ చేసే వారి పట్ల జీహెచ్ఎంసీ అధికారులు కొరఢా ఝుళిపించనున్నారు. నీటిని వృథా చేసే వారికి సంబంధించిన ఫోటోలను క్లిక్ మనిపించి.. ఆ ఫోటోలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తే.. వారికి రూ.200 బహుమతి ఇవ్వనున్నారు. వచ్చేది వేసవి కావడంతో నీటి కొరత లేకుండా ఉండేందుకు అధికారులు ముందు జాగ్రత్తలు చేపడుతున్నారు.ఎండాకాలం వచ్చిందంటే చాలు హైదరాబాద్ మహా నగరంలో తాగు నీటి కొరత ఏర్పడుతుంది. ఇళ్లల్లో ఉండే బోర్లు ఎండిపోయి.. తాగడానికి, కడుక్కోడానికి కూడా నీరు లేక నగరవాసులు అవస్థలు పడుతున్న సంఘటనలు గత కొన్నేళ్లుగా చూస్తూనే ఉన్నాం. ఇక వేసవిలో వాటర్ ట్యాంకర్లకు భారీ డిమాండ్ ఏర్పడుతుంది. దీంతో భారీగా డబ్బులు ఖర్చు పెట్టినా వాటర్ ట్యాంకర్ దొరుకుతుందనే నమ్మకం కూడా ఉండదు. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం వేసవి కాలం ప్రవేశించడంతో హైదరాబాద్ నగరంలో నీటి కటకట రాకుండా ఉండేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే ఎవరైనా తాగునీటిని వేస్ట్ చేస్తుంటే.. ఒక్క ఫోటో తీసి పంపిస్తే.. అలా ఫోటో పంపించిన వారికి రూ.200 గిఫ్ట్‌గా అందించనున్నట్లు అధికారులు వెల్లడించారు.ఇందుకోసం పానీ యాప్‌ను వచ్చే నెల తొలి వారంలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు హైదరాబాద్ వాటర్ బోర్డు అధికారులు స్పష్టం చేశారు. అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించి.. ఆ



ఫోటోలో ఉన్న లొకేషన్‌ను గుర్తించి.. వెంటనే వారిపై జరిమానాలు విధిస్తామని వెల్లడించారు. ఒకవేళ వారు ఫైన్ చెల్లించకపోతే.. వారు వాటర్ ట్యాంకర్ బుక్ చేస్తే అందకుండా బ్లాక్ లిస్ట్‌లో పెడతామని అధికారులు తీవ్ర హెచ్చరికలు చేస్తున్నారు.ఇండిపెండెంట్ ఇళ్లు, అపార్ట్‌మెంట్, కాలనీలు.. ఇలా ఎక్కడైనా నగర పరిధిలో ఎవరైనా తాగునీటిని వృథా చేస్తూ.. వాహనాలు కడుగుతుంటే.. మొబైల్‌తో ఒక్క ఫొటో తీసి.. తమకు పంపించాలని హైదరాబాద్ వాటర్ బోర్డు అధికారులు నగరవాసులకు పిలుపునిచ్చారు. దీనికి సంబంధించిన పానీ యాప్‌ను.. మార్చి మొదటి వారంలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఆ ఫోటోను పానీ యాప్‌లో అప్‌లోడ్ చేసిన వారికి.. రూ.200 బహుమతిగా ఇస్తామని అధికారులు ప్రకటించారు. నీటిని వృథా చేసిన వారికి.. రూ.1000 నుంచి రూ.5000 వరకూ ఫైన్ విధిస్తామని వాటర్ బోర్డు అధికారులు హెచ్చరిస్తున్నారు. హైదరాబాద్ నగరంలోకి వందల కిలోమీటర్ల దూరం నుంచి.. జలాలను అధికారులు తీసుకువస్తున్నారు. అయితే ప్రతీ ఎండాకాలంలో ఒకవైపు నీరు లేక జనం అల్లాడిపోతుంటే.. మరికొందరు నగరవాసులు మాత్రం.. వాటిని భారీ ఎత్తున వృథా చేస్తున్నారు. ప్రభుత్వం ఒక కిలోలీటర్ నీటికి రూ.45 వరకు ఖర్చు చేస్తోంది. వాటిని ఇంటింటికీ నల్లా కనెక్షన్లకు నెలకు 20 కిలోలీటర్ల నీళ్లను ఫ్రీగా అందిస్తోంది. ఇక మరిన్ని అవసరాలకు రూ.10 చొప్పున ఛార్జీలు వసూలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే నీటిని వృథా చేయవద్దని అధికారులు.. నగరవాసులకు విజ్ఞప్తి చేస్తున్నారు.ఢఒకవైపు హైదరాబాద్ నగరవాసులకు నీటి సరఫరా చేయడం ఆర్థికంగా ప్రభుత్వానికి భారం అయినప్పటికీ.. ప్రజల అవసరాలు తీర్చేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుంటే.. చాలా మంది మాత్రం ఇళ్లను, వాహనాలను కడుగుతూ తాగేనీటిని చాలా వృథా చేస్తుండడంపై వాటర్ బోర్డు అధికారులు తీవ్రంగా మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలోనే నీటి వృథాను అరికట్టేందుకు అధికారులతో తనిఖీలు చేపట్టడంతోపాటు.. నగరవాసులను కూడా ఇందులో భాగస్వామ్యం చేయాలని నిర్ణయించి.. ఈ నిర్ణయం తీసుకున్నారు.

# ఇటుక ధరలు ప్రియం... ట్రక్కు రూ.20వేలకు పైగా ధరలు..

**ఖమ్మం, ఫిబ్రవరి 25( వెలుతురు):**
ఇటుక ధరలు అకాశానంటుతున్నాయి.. ప్రజల అవసరాలను అసరాగా చేసుకున్న ఇటుక వ్యాపారులు ధరలను అమాంతంగా పెంచేస్తున్నారు.. క్రీస్తు శకం.. క్రీస్తు పూర్వం అన్నట్లుగా ఇందిరమ్మ ఇళ్లు రాక ముందు... ఇందిరమ్మ ఇండ్లు వచ్చిన తరువాత అన్నట్లుగా బట్టీ వ్యాపారులు ధరలను కొండెక్కించారు. పేదలకు, మధ్యతరగతి ప్రజలకు అందనంత ఎత్తుకు ఆ ధరలు పెరిగిపోయాయి.. ఇందిరమ్మ ఇండ్లు వచ్చిన తరువాత ఇటుక ధరలు మూడు రెట్లు పెరిగినట్లు ప్రజలు చెబుతున్నారు. దీంతో ఇండ్లు కట్టుకోవాలనుకునే నిరుపేదలు, మధ్యతరగతి ప్రజలు బెంబెలేత్తుతున్నారు. ప్రతి ఇళ్లు నిర్మాణం చేయాలంటే ఇటుక చాలా అవసరం.. అందులో ఎర్ర ఇటుక లేకుండా ఏ ఇళ్లు కట్టలేము.. ఆ ఇటుకతో ఇళ్లు నిర్మాణం చేస్తేనే గట్టిదనం ఉంటుందని అందరు భావిస్తుంటారు. అయితే ఏ సైజు ఇళ్లు నిర్మాణం చేయాలన్న కనీసం 10వేల ఇటుక అవసరం అవుతుంది.. సింగిల్ బెడ్ రూమ్ కు సుమారు 10వేలు, డబుల్ బెడ్ రూమ్ ఇంటికి 15వేల నుంచి 20వేల ఇటుక అవసరం. నిరుపేదలు, మధ్యతరగతి ప్రజలు ఎర్ర ఇటుకతో ఇళ్లు నిర్మాణం చేయాలని భావిస్తారు. అందుకే ఇంటి నిర్మాణం చేసేవారు ముందుగా ఇటుక ను కొనుగోలు చేసేందుకు తొందరపడతారు. ఎర్ర ఇటుక ధరలు ఏడాదికేడాది అమాంతంగా పెరుగుతున్నాయి.. 2005 సంవత్సరంలో 2వేల ఇటుక ధర రూ.2వేల నుంచి రూ.3వేల వరకు ధర పలికేది. 2010 తరువాత రూ.4వేల నుంచి రూ.5వేలకు పలికేది. 2015 నుంచి 2024 వరకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాకముందు ట్రక్కు ఎర్ర ఇటుక రూ.5వేల నుంచి రూ.7వేల వరకు ధరలుండేవి. కానీ తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం, గ్రామానికి 20 నుంచి 30 ఇండ్లను మంజూరు చేయడంతో లబ్ధిదారులందరికి ఇటుక అవసరమైంది.దీంతో లబ్ధిదారుల అవసరాన్ని అసరగా చేసుకున్న ఇటుక బట్టీల వ్యాపారులు ఇటుక ధరలను అమాంతంగా పెంచేశారు. 2024 డిసెంబర్ వరకు మంచి ఇటుక ట్రక్కు ఇటుక రూ.10వేలకు పెంచిన వ్యాపారులు, నెల వ్యవధిలోనే



రూ.15వేలు, మరో నెలకు మరో రూ.5వేలను పెంచి ప్రస్తుతం 2వేల ఇటుక ధర రూ.20వేల నుంచి రూ.25వేల వరకు విక్రయిస్తున్నారు. రెండవ రకం ఇటుక 2వేల ఇటుక రూ.16వేల నుంచి రూ.18వేల వరకు విక్రయాలు చేస్తున్నారు. ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం చేసే నిరుపేదలకు ఇటుక ధరలు భారమవుతున్నాయి. ఒకోక్క ఇందిరమ్మ ఇంటికి చిన్ని ఇంటికి సుమారుగా 10వేల ఇటుక, కొంచె పెద్ద ఇంటికి 15వేల ఇటుక అవసరం అవుతుంది. దీంతో ఇటుకకే రూ.1,50,000 నుంచి రూ రూ.1,80,000 వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది.. దీంతో నిరుపేదలకు ఇటుక అధిక ధరలు తీవ్రంగా భారమవుతున్నాయని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయగానే సిమెంట్, ఐరెన్, ఇసుక ధరలను అమాంతంగా పెంచారని భావించి తక్షణమే ధరల నియంత్రణపై ఉపమంత్రివర్గాన్ని నియమించింది. రోజుల వ్యవధిలోనే ధరలను నియంత్రించింది. దీంతో సిమెంట్, ఐరెన్, ఇసుక ధరలు అదుపులోకి వచ్చాయి.కానీ ఇటుక ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయే తప్ప..ఇప్పటి వరకు అదుపులోకి రాలేదు. ఇటుక ధరలను పట్టించుకునే నాథుడే కరువైయ్యారు.

అధికారులు ఇటుక బట్టీల వైపు చూసే నాథుడే లేడు. దీంతో ఇటుక వ్యాపారులు అధిక ధరల వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా వర్ధిల్లుతుంది.. ప్రజలకు మాత్రం జేబులకు చిల్లు పడుతోంది.. కూసుమంచి మండలంలోని కూసుమంచి, తుర్కగూడెం, జుజ్జులరావుపేట సమీప గ్రామాల్లో ఇటుక బట్టీలు ఉన్నాయి. ఈ ఇటుక బట్టీలలో ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. సామాన్యులు కొనలేని పరిస్థితిలో ఇటుక ధరలను వ్యాపారులు పెంచేసి సొమ్ము చేసుకుంటున్నారు.మండల కేంద్రానికి అతి దగ్గరలో ఇటుక బట్టీలు ఉన్నప్పటికి సంబంధిత రెవెన్యూ, పర్యావరణ, పంచాయతీ రాజ్, చిల్డన్స్ వ్ఫెర్ అధికారులు పరిశీలించిన దాఖలాలు లేవు. కనీసం ధరల నియంత్రణ పై ద్రుష్టి సారించడం లేదు. దీంతో తీవ్ర స్థాయిలో విమ్మర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు ఇటుక బట్టీలను తనిఖీ చేసి వ్యాపారులతో చర్చించి, ధరలను నియంత్రించాలని, నిరుపేదలకు సహాయం చేయాలని పలువురు కోరుతున్నారు.. ఇప్పటికైనా అధికారులు స్పందిస్తారా..? ఇటుక బట్టీలను తనిఖీ చేస్తారా..? చూద్దాం..

# మచిలీపట్నం పాల కేంద్రాల్లో తనిఖీలు

**మచిలీపట్నం, ఫిబ్రవరి 25( వెలుతురు):**
రాజమహేంద్రవరంలో ఇటీవల జరిగిన కల్తీ పాల ఘటన నేపథ్యంలో ఏపీలోని వివిధ జిల్లాల్లో ఫుడ్ సేఫ్టీ అధికారులు పాల సరఫరా కేంద్రాలు, డైరీలపై తనిఖీలు ముమ్మరం చేశారు. బుధవారం ఉదయం కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని పలు పాల కేంద్రాలపై అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. మచిలీపట్నంలోని జిల్లా పరిషత్ సెంటర్, చిలకలపూడి ప్రాంతంలోని పాల కేంద్రాల్లోని పాలను ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు పరిశీలించారు. ఎస్.ఎస్ మిల్క్, జిల్లా పరిషత్ కృష్ణవేణి మిల్క్ డైరీ పాల కేంద్రాల నుంచి పాల శాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్స్‌కు పంపించారు. కొన్ని కేంద్రాల్లో ఎమ్మార్పీ, మ్యానుఫ్యాక్చరింగ్ డేట్ లేని, అత్యధిక కాలం ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన బాదం పాల ప్యాకెట్లను అధికారులు గుర్తించారు. రాజమహేంద్రవరం ఘటనలో కల్తీ పాలు తాగడం వల్ల పలువురు మృతి చెందగా.. మరికొందరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే.

# ఇంటర్ పరీక్షకు 17 నిముషాలు ఆలస్యం

**- పరీక్షా కేంద్రానికి అనుమతించని అధికారులు**

**- కన్నీరు పెట్టుకున్న విద్యార్థిని శరణ్య**



**రాజన్నసిరిసిల్ల, ఫిబ్రవరి 25( వెలుతురు):**
ఎగ్జామ్ సెంటర్‌కు ఆలస్యంగా రావడంతో ఇంటర్ విద్యార్థినిని పరీక్ష రాసేందుకు అనుమతించలేదు. తన తండ్రి డ్రాప్ చేస్తాడేమోనని ఎదురుచూసి చూసి, చివరకు ఆర్టీసీ బస్సులో రావడంతో ఎగ్జామినేషన్ సెంటర్‌కు 17 నిమిషాలు ఆలస్యంగా చేరుకుంది. ఈ క్రమంలో అధికారులు పరీక్షకు అనుమతించకపోవడంతో.. సెంటర్ గేటు వద్దనే విద్యార్థిని కన్నీళ్లు పెట్టుకుంది. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలో ఈ విషాద ఘటన చోటు చేసుకుంది. రాజన్న సిరిసిల్ల జిల్లా గొల్లపల్లికి చెందిన పిట్ల శరణ్య గొల్లపల్లి-బొప్పాపూర్ రాచర్ల జూనియర్ కళాశాలలో ఇంటర్‌మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్నది. బుధవారం ఇంటర్ ఫస్టియర్ ఎగ్జామ్స్ ప్రారంభం కావడంతో తన తండ్రి ఎగ్జామ్ సెంటర్ ఎల్లారెడ్డిపేటలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ దగ్గర దించుతానని చెప్పాడు. అయితే, పని చూసుకుని టైమ్ వరకు వస్తానని వెళ్లిన తండ్రి ఎంత సేపటికీ రాకపోవడంతో.. ఎగ్జామ్‌కు లేటవుతుందని గాబరాగాబరాగా బస్టాండ్‌కు వెళ్లింది. అక్కడ ఆర్టీసీ బస్సు ఎక్కి ఎగ్జామినేషన్ సెంటర్‌కు చేరుకుంది. కానీ అప్పటికే 9.05 గంటలు దాటిపోవడంతో అధికారులు శరణ్యను ఎగ్జామ్ సెంటర్2లోనికి అనుమతించలేదు. దీనిపై శరణ్య కాలేజీ సిబ్బందిని, ఉన్నతాధికారులను సంప్రదించింది. ఈ క్రమంలో తహశీల్దార్ సుజాత ఎగ్జామ్ సెంటర్‌కు చేరుకుని, సీసీ కెమెరాలను పరిశీలించారు. ఈ క్రమంలో శరణ్య 17 నిమిషాలు ఆలస్యంగా ఎగ్జామ్ సెంటర్ వద్దకు వచ్చినట్లుగా అధికారులు నిర్ధారించారు. దీంతో ఆమెను పరీక్షకు అనుమతించలేదు. తమ భవిష్యత్‌కు సంబంధించిన పరీక్షలు రాసేటప్పుడు కచ్చితంగా సమయపాలన పాటించాలని తహశీల్దార్ సూచించారు.

# డయేరియా ప్రబలడంతో ఒకరు మృతి

**- విధుల్లో నిర్లక్ష్యం..కమిషనర్‌పై వేటు**

**అమరావతి, ఫిబ్రవరి 25( వెలుతురు):**
శ్రీకాకుళం మున్సిపల్ కమిషనర్‌పై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. నగరంలో డయేరియా ప్రబలడంతో ఒకరు మృతిచెందగా.. 76 మంది ఆస్పత్రి పాలయ్యారు. విధుల్లో కమిషనర్ కూర్మారావు నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ ప్రభుత్వం ఆయన్ను సస్పెండ్ చేసింది. ఈ మేరకు పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీకాకుళం నగరంలోని పలు ప్రాంతాల్లో డయేరియా ప్రబలింది. దమ్మలవీధి, గోల్కొండ రేవు, కాకివీధి, మంగువారితోట తదితర ప్రాంతాలకు చెందినవారు అస్వస్థతకు గురై ఆస్పత్రుల్లో చేరారు. మరోవైపు ప్రభుత్వం ఆయా ప్రాంతాల్లో ఇంటింటా సర్వే నిర్వహించింది. వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి స్వల్ప లక్షణాలతో బాధపడుతున్న వారికి చికిత్స అందిస్తోంది. నగరపాలక సంస్థ సిబ్బంది ట్యాంకర్లతో మంచినీటి సరఫరా చేస్తున్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులో 2,721 డయాలసిస్ మిషన్లు

**- మండలి ప్రశ్నోత్తరాల్లో మంత్రి సత్యకుమార్ వెల్లడి**



**అమరావతి, ఫిబ్రవరి 25( వెలుతురు):**
రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 2,721 డయాలసిస్ మిషన్లు అందుబాటులో ఉన్నాయని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఇందులో ప్రభుత్వ ఆసుపత్రుల్లో 985 మిషన్లు, నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో 1,736 డయాలసిస్ మిషన్లు ఉన్నాయని వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 21,504 మంది కిడ్నీ సంబంధిత వ్యాధిగ్రస్తులు ఉన్నారన్నారు. ఏపీలో డయాలసిస్ కేంద్రాల సంఖ్య పెంపుపై శాసనమండలిలో ఎమ్మెల్సీలు అడిగిన ప్రశ్నకు మంత్రి సత్యకుమార్ యాదవ్ సమాధానం ఇచ్చారు. ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ బాధితుల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. రాష్ట్రంలో డయాలసిస్ కేంద్రాలను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 20 నెలల్లో 14 కొత్త డయాలసిస్ కేంద్రాలను మంజూరు చేశామని మంత్రి వెల్లడించారు. గతంలో నెలకు సుమారు 40 వేల డయాలసిస్ సెషన్లు జరుగగా... ప్రస్తుతం 66 వేల సెషన్లకు పెరిగాయని మంత్రి తెలిపారు. 675 మంది పేషెంట్లకు నెలకు 10 వేల రూపాయల చొప్పున పింఛన్లు అందిస్తున్నామని చెప్పారు. కిడ్నీ మార్పిడి చేసుకున్న రోగులకు కూడా పింఛన్లు అందించే అంశాన్ని పరిశీలిస్తున్నామని వివరించారు. కిడ్నీ రోగుల చికిత్సపై సగటున 86 వేల రూపాయల చొప్పున గత 20 నెలల్లో మొత్తం 224 కోట్ల రూపాయలు ఖర్చు చేశామని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

https://epaper.velthuru.com


# వెలుతురు

cinema

# చదువులో ఇద్దరూ ఇద్దరే

## విజయ్, రష్మికల డిగ్రీలపై సోషల్ మీడియా షేర్


టాలీవుడ్ ప్రేమజంట విజయ్ దేవరకొండ- రష్మిక మంధాన ఫిబ్రవరి 26న పెళ్లి బంధంలోకి అడుగు పెట్టబోతున్నారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ లో వీరి వివాహ వేడుకలు జరుగుతున్నాయి. ఇప్పటికే కుటుంబ సభ్యులు, సన్నిహితులతో కలిసి ఈ జంట అక్కడికి చేరుకుంది. ఈ నేపథ్యంలో వీరిద్దరి వ్యక్తిగత జీవితం, ముఖ్యంగా విద్యాభ్యాసానికి సంబంధించిన ఆసక్తికర విషయాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సినిమాల్లోకి రాకముందు విజయ్, రష్మిక ఇద్దరూ తమ చదువును పూర్తి చేసి తర్వాతే ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. విజయ్ దేవరకొండ తొలుత హైదరాబాద్‌లోని లోకల్ స్కూల్‌లో చదివారు. ఆ తర్వాత పుట్టపర్తిలోని శ్రీ సత్యసాయి హయర్ సెకండరీ స్కూల్లో హాస్టల్‌లో ఉంటూ 10వ తరగతి వరకు చదివారు. అనంతరం హైదరాబాద్‌లోని లిటిల్ ఫ్లవర్ జూనియర్ కాలేజ్‌లో ఇంటర్ పూర్తి చేశారు. తర్వాత హైదరాబాద్‌లోని భద్రుక కాలేజ్ ఆఫ్ కామర్స్‌లో కామర్స్ డిగ్రీ చేశారు. డిగ్రీ పూర్తయ్యాకే సినిమా రంగంలోకి అడుగుపెట్టారు. మొదట క్యారెక్టర్ ఆర్టిస్టుగా పలు చిత్రాల్లో నటించి, తరువాత 'పెళ్లిచూపులు' సినిమాతో హీరోగా గుర్తింపు పొందారు. ఇక రష్మిక మందన్న మొదట కూర్గ్ పబ్లిక్ స్కూల్‌లో చదువుకున్నారు. ఆ తర్వాత గొనికొప్పలోని స్కూల్‌లో స్కూల్ ఎడ్యుకేషన్ పూర్తి చేశారు. అనంతరం బెంగుళూరులోని ఎంఎస్ రామయ్య కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ సైన్స్ అండ్ కామర్స్ లో సైకాలజీ, జర్నలిజం, ఇంగ్లీష్ లిటరేచర్‌లో డిగ్రీ చేశారు. కాలేజీ రోజుల నుంచే మోడలింగ్ ప్రారంభించిన రష్మిక, తరువాత కన్నడ చిత్రం కిరిక్ పార్టీతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చారు. ఆ సినిమా సక్సెస్‌తో దక్షిణాది ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్‌గా ఎదిగారు. ఇలా విజయ్ ? రష్మిక ఇద్దరూ డిగ్రీ పూర్తిచేసి తర్వాతే సినిమాల్లోకి వచ్చారు. ప్రస్తుతం టాలీవుడ్, బాలీవుడ్‌లో వరుస ప్రాజెక్టులతో స్టార్ హోదాలో కొనసాగుతున్నారు. ఇప్పుడు పెళ్లి బంధంతో ఒకటవుతున్న ఈ జంటకు



అభిమానులు శుభాకాంక్షలు తెలుపుతూ, వారి వెడ్డింగ్ ఫోటోల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. చదువులోనూ మెరుపులు మెరిపించిన ఈ స్టార్ కపుల్? జీవితంలోనూ సక్సెస్ ఫుల్ జర్నీ కొనసాగించాలని ఫ్యాన్స్ ఆకాంక్షిస్తున్నారు.

# తమిళ మూవీలో వైష్ణవి చైతన్య

తెలుగులో ఆనంద్ దేవరకొండ హీరోగా నటించిన బేబి సినిమాతో సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది వైష్ణవి చైతన్య . ఈ భామ ప్రస్తుతం ఆనంద్ దేవరకొండతో మరో సినిమా చేస్తూ బిజీగా ఉంది. కాగా ఈ బ్యూటీ ఇక తమిళంలో కూడా తన లక్‌ను పరీక్షించుకునేందుకు రెడీ అయిందన్న వార్త ఒకటి ఇండస్ట్రీ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. వైష్ణవి చైతన్య, పాపులర్ కోలీవుడ్ కంపోజర్ కమ్ యాక్టర్ జీవీ ప్రకాశ్ కుమార్ హీరోగా తెరకెక్కబోతున్న సినిమాలో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుందని తాజా కథనాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఈ భామ ఇప్పటికే తమిళంలో అజిత్ కుమార్ నటించిన వలిమైలో కామియో రోల్‌లో మెరిసింది. ఇదే నిజమైతే వైష్ణవి చైతన్యకు తమిళంలో హీరోయిన్‌గా తొలి సినిమా ఇదే కానుంది. మొత్తానికి వైష్ణవి చైతన్య బ్యాక్ టు బ్యాక్ ఆఫర్లతో సౌతిండియన్ ఫిలిం ఇండస్ట్రీలో తనకంటూ స్పెషల్ ఐడెంటిటీ తెచ్చుకోవాలనే ప్రయత్నంలో బిజీగా ఉన్నట్టు తాజా అప్‌డేట్ చెప్పకనే చెబుతోంది. రానున్న రోజుల్లో వైష్ణవి చైతన్య నుంచి ఏదైనా అధికారిక ప్రకటన వస్తుందేమో చూడాలి.



# దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలి

## తమన్నా భాటియా వెల్లడి

నటీనటులు ఇండస్ట్రీలో వరుస అవకాశాలు ఉన్నప్పుడే వేరే ఆదాయ మార్గాలు చూసుకోవాలని నటి తమన్నా అన్నారు. లేదంటే తర్వాత చాలా ఇబ్బందులు ఎదురవుతాయని చెప్పారు. 15 ఏళ్ల వయసులో పరిశ్రమలోకి వచ్చిన తమన్నా 21 సంవత్సరాల నుంచి అగ్ర హీరోల సరసన నటిస్తూ మెప్పిస్తున్నారు. కొత్తగా నగల వ్యాపారాన్ని కూడా ప్రారంభించారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ తన తండ్రి నుంచి ఆర్థిక ప్రణాళికలు నేర్చుకున్నట్లు తెలిపారు. నేను ఇండస్ట్రీకి వచ్చిన తొలినాళ్లలో నా ఆర్థిక వ్యవహారాలన్నీ మా నాన్నే చూసుకున్నారు. నాకు ఎంతో మద్దతు ఇస్తూ.. మార్గనిర్దేశర చేశారు. ఇప్పుడు నేను జాగ్రత్తలు తీసుకుంటూ రియల్ ఎస్టేట్, నగల వ్యాపారాలతో పాటు ఎన్నో రంగాల్లో పెట్టుబడులు పెట్టాను. అవే నాకు భవిష్యత్తులో ఉపయోగపడతాయి. నేను ఇలా ఆలోచించడానికి నా తండ్రే కారణం. ఆయనే వల్లే ఈ క్రమశిక్షణ నేర్చుకున్నాను. అందరికీ ఈ విషయంలో దూరదృష్టి అవసరం. ముఖ్యంగా ఇండస్ట్రీలో ఉన్నవారు అవకాశాలు ఉన్నప్పుడే సరైన మార్గాల్లో డబ్బు ఆదా చేసుకోవాలి. దాన్ని పెంచుకునే దారులు కనిపెట్టాలి. లేదంటే చివరకు ఏమీ మిగలదు' అని తమన్నా అన్నారు. ఇక ఈ ఏడాది తమన్నా వరుస ప్రాజెక్ట్‌లతో సందడి చేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. సిద్దార్థ్ మల్హోత్రాతో కలిసి ఆమె నటించిన 'వివాన్: ఫోర్స్ ఆఫ్ ది



ఫారెస్ట్' మే15న విడుదల కానుంది. అలాగే అజయ్ దేవ్‌గణ్, సంజయ్‌దత్ నటిస్తోన్న 'రేంజర్'లో తమన్నా కూడా కీలక పాత్రలో కనిపిస్తున్నట్లు సమాచారం.



# టాలీవుడ్‌లోకి హాలీవుడ్ మోషన్ క్యాప్చర్ టెక్నాలజీ

## అన్నపూర్ణలో ప్రారంభించిన దర్శకధీరుడు జక్కన్న

తెలుగు సినీ ఇండస్ట్రీలో సాంకేతికత కొత్త పుంతలు తొక్కడానికి సిద్ధమైంది. ఇప్పటికే పాన్‌ఇండియా సినిమాలతో దూసుకెళ్తున్న తెలుగు సినీ పరిశ్రమలో టెక్నాలజీపరంగా సరికొత్త అడుగుపడింది. 'అవతార్' సహా ఎన్నో హాలీవుడ్ సినిమాలను మోషన్ క్యాప్చర్ టెక్నాలజీ సాయంతో తీస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటివరకూ తెలుగు మేకర్స్ ఈ సాంకేతికత కోసం ఇతర దేశాలపై ఆధారపడాల్సి వచ్చేది. ఇప్పుడు హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో ఈ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది. ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి ఎంఅండ్ఎం క్యాప్ ల్యాబ్‌ను బుధవారం ఆవిష్కరించారు. మహేశ్‌బాబు కథానాయకుడిగా రూపొందిస్తున్న 'వారణాసి'లోని కీలక సన్నివేశాలను అక్కడ తీసినట్లు తెలిపారు. అన్నపూర్ణా స్టూడియోస్, శోభు యార్లగడ్డ మిహిరా విజువల్ ల్యాబ్స్, హాలీవుడ్ కంపెనీ యానిమాట్రిక్ ఫిల్మ్ డిజైన్ సంయుక్తంగా ఈ సాంకేతికతను అందుబాటులోకి తెచ్చాయి. గతంలో అన్నపూర్ణ స్టూడియోస్‌లోనే ఏర్పాటు చేసిన 'డాల్బీ సినిమా ప్రాసెస్' సౌకర్యాన్ని రాజమౌళి ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మోషన్ క్యాప్చర్ టెక్నాలజీ స్టూడియో కూడా ఆయన చేతుల మీదుగానే ప్రారంభమైంది. ఈ సందర్భంగా జక్కన్న మాట్లాడుతూ.. అంతర్జాతీయ సినీ నిర్మాణ సంస్థలకు భారత్ నుంచే అత్యుత్తమ సాంకేతిక నిపుణులు వెళ్తున్నారు. అయితే, ఆ అధునాతన సౌకర్యాలు మాత్రం మనకు ఉండటం లేదు. 'బాహుబలి', 'ఈగ' వంటి సినిమాలు తీస్తున్నప్పుడు మనకు గనుక మోషన్ క్యాప్చర్ టెక్నాలజీ సౌకర్య ఉంటే ఇంకా ఉత్తమంగా ఎలా చేయొచ్చా? అనుకునేవాడిని. ఇప్పుడు ఇది మనకు అందుబాటులోకి వచ్చింది. ఇండియన్ ఫిల్మ్‌మేకర్స్ ఆలోచనాధోరణి అత్యుత్తమ స్థాయికి తీసుకెళ్లవచ్చు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మోషన్ క్యాప్చర్ టెక్నాలజీ స్టూడియోలను నేను సందర్శించా. ఏ అండ్ ఎం అద్భుతంగా టెక్నాలజీని అందిస్తోంది. ఇప్పటికే 'వారణాసి' కోసం ఈ సౌకర్యాన్ని వినియోగించుకుని కీలక సన్నివేశాలను తీశా. అవి అద్భుతంగా వచ్చాయని రాజమౌళి అన్నారు. భారతీయ సినీ ప్రయాణంలో ఇదొక మైలురాయి అని కథానాయకుడు నాగార్జున అభివర్ణించారు. రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న 'వారణాసి' వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రేక్షకుల ముందుకు రానుంది.




# విరోష్ ప్రీమియర్ లీగ్ సెలబ్రేషన్స్

ఫిబ్రవరి 26న గురువారం విజయ్ దేవరకొండ, రష్మిక వివాహబంధంలోకి అడుగుపెట్టనున్నారు. తాజాగా ఈ తేదీని అధికారికంగా ప్రకటించారు. మంగళవారం మెహందీ, సంగీత్ సందడిగా జరిగినట్లు తెలుస్తోంది. సంగీత్‌లో విజయ్, రష్మిక కలిసి నటించిన సినిమాల్లోని ఫొటోలు, వీరి ప్రేమకథ ఫ్రేమ్‌లతో డెకరేషన్ చేశారు. ప్రస్తుతం ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ ఫొటోలను అధికారికంగా షేర్ చేయాలని కోరుతూ అభిమానులు వీరిద్దరినీ ట్యాగ్ చేస్తున్నారు. సంగీత్‌లో భాగంగా ఇరు కుటుంబాలు సరదాగా 'విరోష్ ప్రీమియర్ లీగ్'ను సెలబ్రేట్ చేసుకున్నారు. దీనికి సంబంధించిన ఫొటోను విజయ్ దేవరకొండ తన ఇన్‌స్టాలో పంచుకున్నారు. క్రికెట్ బ్యాట్, సిల్వర్ మెడల్‌పై ఫిబ్రవరి 26 అని రాసి ఉండడంతో పెళ్లి తేదీని ఇలా డిఫరెంట్‌గా ప్రకటించారని అభిమానులు సంబరపడుతున్నారు. ఈరోజు హల్దీ వేడుక జరగనుంది. ఉదయ్‌పుర్‌లోని మెమెంటోస్ హోటల్‌లో జరగనున్న వీరి పెళ్లికి ఇండస్ట్రీలోని ప్రముఖులతో పాటు వ్యాపారవేత్తలు కూడా హాజరుకానున్నారు. దీంతో ఉదయపుర్ విమానాశ్రయం అతిథులతో కళకళలాడుతోంది. తరుణ్ భాస్కర్, రాహుల్ రవీంద్రన్, ఈషా, శ్రావ్యా వర్మ, ఆషిక రంగనాథ్, అనిల్ అంబానీలతో పాటు మరికొందరు సెలబ్రిటీలు ఎయిర్‌పోర్ట్‌లో కనిపించారు.


# మార్చి 4న ఆహాలోకి ఓంశాంతి శాంతి శాంతిః

తరుణ్ భాస్కర్, ఈషా రెబ్బా ప్రధాన పాత్రల్లో నటించిన తాజా చిత్రం 'ఓం శాంతి శాంతి శాంతిః' ఓటీటీలోకి రాబోతుంది. ఇటీవలే ప్రేక్షకులను అలరించిన ఈ చిత్రం డిజిటల్ వేదికగా రాబోతున్నట్లు తాజాగా ప్రకటించింది. మలయాళంలో సంచలన విజయం సాధించిన 'జయ జయ జయ జయ హే' చిత్రానికి అధికారిక రీమేక్‌గా తెరకెక్కిన ఈ సినిమా, మార్చి 4 నుంచి ప్రముఖ తెలుగు ఓటీటీ ఎ÷–లాట్‌ఫారమ్ 'ఆహా'లో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. అయితే ఆహా గోల్డ్ సబ్‌స్క్రైబర్లకి మాత్రం ఒకరోజు ముందుగానే అందుబాటులోకి రాబోతున్నట్లు తెలిపింది. ఏఆర్ సజీవ్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో భర్త వేధింపులను ఎదిరించి తన ఆశయాల కోసం పోరాడే ఇల్లాలు ప్రశాంతి పాత్రలో ఈషా రెబ్బా, ఆమె భర్త ఓంకార్ నాయుడుగా తరుణ్ భాస్కర్ నటించారు. జనవరి 30న థియేటర్లలో విడుదలైన ఈ మూవీలో బ్రహ్మాజీ, రోహిణి, శివన్నారాయణ ఇతర ముఖ్య పాత్రలు పోషించారు.




# ఊపేస్తున్న నాని ఆయా షేర్ సాంగ్

ప్రస్తుతం సోషల్ మీడియాలో నేచురల్ స్టార్ నాని 'ఆయాషేర్' మేనియా ప్రకంపనలు సృష్టిస్తోంది. తన రాబోయే చిత్రం 'ది ప్యారడైజ్' నుంచి విడుదలైన ఈ స్పెషల్ సాంగ్ అటు టాలీవుడ్‌తో పాటు ఇటు డిజిటల్ ప్లాట్‌ఫారమ్స్‌లో రికార్డులను తిరగరాస్తోంది. ఈ పాటలో నాని చూపించిన మాస్ ఎనర్జీ మరియు సిగ్నేచర్ స్టెప్పులు చూస్తుంటే, ఆయన గత పవర్‌ఫుల్ పాత్రల ప్రభావాన్ని కూడా ఇది మించిపోయిందని నెటిజన్లు ప్రశంసిస్తున్నారు. మరోవైపు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం నుంచి 'ఔరా ఆఫ్ ఉస్తాద్' పాట కూడా ఇటీవలే విడుదలైంది. మొదట్లో ఈ పాట ట్రెండింగ్‌లో నిలిచినప్పటికీ, నాని 'ఆయాషేర్' వచ్చిన తర్వాత సీన్ పూర్తిగా మారిపోయింది. విడుదలైన కొన్ని గంటల్లోనే 'ఆయాషేర్' పాట 'ఉస్తాద్'ను వెనక్కి నెట్టి మ్యూజిక్ సెక్షన్‌లో టాప్ 1 స్థానాన్ని కైవసం చేసుకుంది. దీంతో 'ఆయాషేర్ దెబ్బకి ఉస్తాద్ ఔరా గల్లంతయింది' అంటూ అభిమానులు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున కామెంట్లు చేస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించిన ఈ పాటకు కాసర్ల శ్యామ్ అదిరిపోయే సాహిత్యం అందించారు. ఇప్పటికే ఈ పాటపై వేల సంఖ్యలో రీల్స్ వస్తుండగా, సెలబ్రిటీల నుండి సామాన్యుల వరకు అందరూ నాని మాస్ స్టెప్పులను అనుకరిస్తూ వీడియోలు పోస్ట్ చేస్తున్నారు. మిలియన్ల కొద్దీ వ్యూస్‌తో ఈ పాట ప్రస్తుతం ఇంటర్నెట్‌ను ఊపేస్తోంది.



# 74 లక్షల ఓట్లు తొలగింపు



**చెన్నై, ఫిబ్రవరి 25( వెలుతురు):**
మరికొద్ది నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తమిళనాడు రాష్ట్రంలో కేంద్ర ఎన్నికల సంఘం తుది ఓటరు జాబితాను అధికారికంగా విడుదల చేసింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పూర్తి చేసిన ఈసీ.. తాజా లెక్కలను బట్టి రాష్ట్రంలో మొత్తం 5.67 కోట్ల మంది ఓటర్లు ఉన్నట్లు ప్రకటించింది. అయితే గత లెక్కలతో పోలిస్తే ఈసారి 74 లక్షల మంది ఓటర్లు తగ్గడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.గతేడాది అక్టోబరు నాటికి తమిళనాడులో సుమారు 6.41 కోట్ల మంది ఓటర్లు ఉండేవారు. కానీ బోగస్ ఓట్ల ఏరివేత, రెండు చోట్ల ఓటు ఉన్నవారిని గుర్తించడం, మరణించిన వారి పేర్లను తొలగించే క్రమంలో ఎన్నికల సంఘం భారీ ప్రక్షాళన చేపట్టింది. డిసెంబరు 19న విడుదల చేసిన ముసాయిదా జాబితాలో ఒకేసారి 97 లక్షల పేర్లను తొలగించి, ఓటర్ల సంఖ్యను 5.43 కోట్లుగా తేల్చింది. దీనిపై అభ్యంతరాల స్వీకరణకు గడువు ఇచ్చింది. దరఖాస్తుల పరిశీలన అనంతరం.. అర్హులైన 27.53 లక్షల మందిని కొత్తగా చేర్చింది. అదే సమయంలో మరో 4.23 లక్షల అనర్హుల పేర్లను జాబితా నుంచి పూర్తిగా తొలగించింది.తాజాగా వెలువడిన తుది జాబితా ప్రకారం రాష్ట్రంలో పురుషుల కంటే మహిళా ఓటర్ల సంఖ్యే ఎక్కువగా ఉండటం విశేషం. మొత్తం ఓటర్లు 5.67 కోట్లు ఉండగా.. వారిల మహిళా ఓటర్లు 2.89 కోట్లు ఉన్నారని ఈసీ తెలిపింది. ఇక పురుష ఓటర్లు 2.77 కోట్లు ఉన్నట్లు వెల్లడించింది. నియోజకవర్గాల వారీగా చూసుకుంటే.. చెంగల్పట్టు జిల్లా పరిధిలోని శోలింగనల్లూర్ స్థానం 5.36 లక్షల ఓటర్లతో అత్యధిక ఓటర్లున్న నియోజకవర్గంగా నిలిచింది. చెన్నైలోని హార్బర్ నియోజకవర్గం కేవలం 1.16 లక్షల ఓటర్లతో అత్యల్ప ఓటర్లున్న స్థానంగా నమోదైంది.తమిళనాడు ( ప్రస్తుత అసెంబ్లీ పదవీకాలం ఈ ఏడాది మే నెలతో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఏప్రిల్‌లోనే సార్వత్రిక ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. దీనికి సంబంధించిన అధికారిక షెడ్యూల్ మార్చి రెండో వారంలో వెలువడే సూచనలు కనిపిస్తున్నాయి. ఈసారి తమిళనాడు ఎన్నికల ముఖచిత్రం అత్యంత రసవత్తరంగా మారనుంది. అధికార డీఎంకే కూటమి, ప్రతిపక్ష అన్నాడీఎంకే ? బీజేపీ కూటమికి తోడుగా.. దళపతి విజయ్ స్థాపించిన కొత్త పార్టీ 'తమిళగ వెట్రి కళగం తొలిసారిగా ప్రత్యక్ష ఎన్నికల బరిలోకి దిగుతుండటంతో ముక్కోణపు పోరు ఖాయంగా కనిపిస్తోంది. ఏకంగా 74 లక్షల ఓట్లు గల్లంతైన నేపథ్యంలో ఈ మార్పులు ఏ పార్టీకి లాభిస్తాయో, ఎవరికి నష్టం చేకూరుస్తాయో వేచి చూడాలి.



# వైరాలో భారీగా డ్రగ్స్ పట్టివేత..

**ఖమ్మం ఫిబ్రవరి 25( వెలుతురు):**
జిల్లా వైరాలో భారీగా డ్రగ్స్ పట్టుబడింది. ఒడిశా నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా రవాణా అవుతున్న 101.2 కిలోల ఎండు గంజాయితో పాటు 2.7 కిలోల హాష్‌ష్ ఆయిల్‌ను పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం ఖమ్మం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ అనుమాస్పదంగా ఉన్న హర్యానా నెంబర్ ప్లేట్ కలిగిన కారును ఆపి చెక్ చేసింది. తనిఖీల్లో గంజాయి, హ్యాషిష్ ఆయిల్ బయటపడింది. ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌కు చెందిన మహమ్మద్ అస్లాంను పోలీసులు అరెస్ట్ చేశారు. కారు, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. వైరా ఎక్సైజ్ స్టేషన్‌కు నిందితుడిని అప్పగించారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న మత్తు పదార్థాల విలువ సుమారు 67.20 లక్షల రూపాయలుగా తెలుస్తోంది.

# మోడీకి ఇజ్రాయిల్ గుజరాత్ లాంటిదే

## - సిపిఐ ఎంపి సంతోష్ కుమార్ విమర్శలు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25( వెలుతురు):**
ప్రధాని నరేంద్ర మోడీకి ఇజ్రాయిల్ రెండో గుజరాత్ లాంటిదని సిపిఐ ఎంపి సంతోష్ కుమార్ విమర్శించారు. ప్రధాని మోడీ రెండురోజులపాటు ఇజ్రాయిల్ పర్యటన కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో గాజాలో మారణహోమం సృష్టించి వేలాది మంది పాలస్తీనియన్ల ప్రాణాలను బలితీస్తున్న ఇజ్రాయిల్‌ను మోడీ సందర్శించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెతుతున్నాయి. తాజాగా మోడీ ఇజ్రాయిల్ పర్యటనపై సిపిఐ ఎంపి సందోష్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. 'ఇజ్రాయిల్‌ను సందర్శించడం ప్రధాని మోడీకి ఒక హాబీగా మారింది. ఇజ్రాయిల్ ఆయనకు రెండవ గుజరాత్. ఇజ్రాయిల్ మానవాళి ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరించే దేశం. గాజాను లక్ష్యంగా చేసుకుని అమాయక ప్రజలను చంపుతోంది. మీకు తెలుసా..మోడీకి ఇజ్రాయిల్‌ని సందర్శించడం గుజరాత్‌ను సందర్శించడం లాంటిది' అని సందోష్ కుమార్ అన్నారు.

# ఢిల్లీలో గ్యాంగ్‌స్టర్ల కదలికలు కలకలం

## - బిష్ణోయ్ లీగల్ టీమ్‌పై కాల్పులు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25( వెలుతురు):**
దేశ రాజధానిలో మరోసారి గ్యాంగ్‌స్టర్ల కదలికలు కలకలం రేపాయి. తీహార్ జైలులో ఉన్న గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ లీగల్ టీమ్‌ను లక్ష్యంగా చేసుకుని గుర్తుతెలియని వ్యక్తులు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటన ఢిల్లీలోని రోహిణి ప్రాంతంలో చోటుచేసుకుంది. లారెన్స్ బిష్ణోయ్ తరపున కోర్టు కేసులను వాదించే న్యాయవాదుల బృందం వాహనంలో ప్రయాణిస్తున్న సమయంలో ఈ దాడి జరిగింది. బైక్‌పై వచ్చిన దుండగులు ఒక్కసారిగా లీగల్ టీమ్ వాహనంపై కాల్పులు జరిపి అక్కడి నుంచి పరారయ్యారు. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎవరికీ ప్రాణాపాయం జరగలేదు. సమాచారం అందుకున్న వెంటనే ఢిల్లీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సీసీటీవీ (అఅ÷ఎ) ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇది గ్యాంగ్ వార్‌లో భాగమా లేక లాయర్లను భయపెట్టడానికి చేసిన ప్రయత్నమా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు. కాగా, లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ ఇప్పటికే అనేక హై-ప్రొఫైల్ హత్యలు, బెదిరింపుల కేసుల్లో నిందితులుగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అతని లీగల్ టీమ్‌పై దాడి జరగడం సంచలనంగా మారింది.

# వేంపల్లె నందీశ్వరాలయంలో ప్రతిష్ట

## - ప్రత్యేక పూజల్లో పాల్గొన్న వైఎస్ జగన్

**పులివెందుల, ఫిబ్రవరి 25( వెలుతురు):**
వైసిపి అధినేత వైఎస్ జగన్ రెండో రోజు పులివెందులలో పర్యటించారు. ఈ సందర్భంగా బుధవారం ఉదయం 10.30 గంటలకు వేంపల్లి మండలం నందిపల్లి నందీశ్వర ఆలయాన్ని వైఎస్ జగన్ సందర్శించారు. నందీశ్వర ఆలయంలో విగ్రహ ప్రతిష్ట సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమంలో జగన్ పాల్గొన్నారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆలయానికి రూ. 1.8 కోట్లు మంజూరు చేశారు. మొత్తం ఆరు కోట్ల రూపాయలతో దేవాలయ నిర్మాణం జరిగింది. ఈ కార్యక్రమం తర్వాత.. వైఎస్ జగన్ మధ్యాహ్నం నుంచి క్యాంపు కార్యాలయంలో ప్రజదర్బార్ నిర్వహించనున్నారు. అయితే దీనికి ముందుగా పులివెందుల నివాసం నుంచి బయలుదేరిన వైఎస్ జగన్? వైఎస్ రాజారెడ్డి సోదరిని పరామర్శించి, యోగక్షేమాలు తెలుసుకున్నారు.

# యూట్యూబర్ కోమలి ఆత్మహత్య

## - ప్రేమ వ్యవహారమే కారణమని అనుమానాలు



**హైదరాబాద్ , ఫిబ్రవరి 25( వెలుతురు):**
హైదరాబాద్ చిత్రపురి కాలనీలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ప్రముఖ యూట్యూబర్ కోమలి ఆత్మహత్య చేసుకుంది. ఇంట్లో ఎవరూలేని సమయంలో ఆమె ఇలా బలవన్మరణానికి పాల్పడినట్టు తెలుస్తోంది. నగరంలోని ఓ ప్రముఖ కాలేజ్‌లో బీఎస్సీ చదువుతున్న కోమలి.. చిత్రపురి కాలనీలో తన బంధువుల ఇంట్లో ఉంటోంది. విశాఖపట్నానికి చెందిన కోమలి.. తక్కువ కాలంలో యూట్యూబర్‌గా మంచి పేరు సంపాదించుకుంది. కోమలి.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న ఓ వ్యక్తిని ప్రేమించింది. ఏడాది క్రితం ఇద్దరి మధ్య విభేదాలు రావడంతో బ్రేకప్ అయ్యింది. ఈ నేపథ్యంలో కొన్ని నెలల క్రితం కోమలి ఆత్మహత్యకు యత్నించగా.. బంధువులు కాపాడారు. ఈ మధ్య మరోసారి ఆ యువకుడితో గొడవ జరిగినట్లు సమాచారం. దీంతో మనస్తాపానికి గురైన ఆమె.. సోమవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకుంది. ఆమె తల్లి మంగళవారం రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. ఈ విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# హిమంత దూకుడు...



**గౌహాతి , ఫిబ్రవరి 25( వెలుతురు):**
అస్సాం అసెంబ్లీ ఎన్నికలు 2026 సమీపిస్తున్న వేళ, ఈ ఈశాన్య రాష్ట్రంలో రాజకీయ వాతావరణం సెగలు పుట్టిస్తోంది. ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ నేతృత్వంలోని బీజేపీ హ్యాట్రిక్ విజయంపై కన్నేయగా, అస్సాం గణ పరిషత్ వంటి మిత్రపక్షాల సహకారంతో బలమైన వ్యూహాలను సిద్ధం చేస్తోంది. మరోవైపు, ఉనికి చాటుకోవాలని చూస్తున్న కాంగ్రెస్, ప్రాంతీయ శక్తులతో జతకట్టి బీజేపీ కోటను బద్దలు కొట్టాలని భావిస్తోంది.ప్రస్తుత అస్సాం రాజకీయం పూర్తిగా హిమంత బిశ్వ శర్మ చుట్టూనే తిరుగుతోంది. ముస్లిం జనాభా పెరుగుదల, బెంగాలీ ముస్లింల ప్రభావంపై ఆయన చేస్తున్న ఘాటు వ్యాఖ్యలు హిందూ ఓటు బ్యాంకును ఏకీకృతం చేస్తున్నాయి. అస్సామీ అస్తిత్వం, హిందూత్వ ను మేళవించి ఆయన వేస్తున్న అడుగులు బీజేపీకి సానుకూల పవనాలను సృష్టిస్తున్నాయి. ముఖ్యంగా ఉపాధి కల్పన, రోడ్ల అభివృద్ధి వంటి మౌలిక సదుపాయాల పనులు మూడో విజయంపై ఆ పార్టీకి ధీమాను పెంచుతున్నాయి.ఇటీవల జరిగిన నియోజకవర్గాల పునర్విభజన అస్సాం రాజకీయాల్లో గేమ్ ఛేంజర్‌గా మారింది. స్థానిక అస్సామీల ప్రాబల్యం పెరిగేలా ఈ విభజన జరిగిందనే వాదన ఉంది. దీనివల్ల దాదాపు 90-100 స్థానాల్లో స్వదేశీ ప్రజల ప్రాధాన్యత పెరిగింది. ఇది బీజేపీకి , మిత్రపక్షాలకు ఎన్నికల్లో భారీ అడ్వాంటేజ్‌గా మారే అవకాశం ఉంది, ఎందుకంటే వారు భూమి పుత్రుల రక్షణనే ప్రధాన ఎజెండాగా మార్చుకున్నారు.వరుస ఓటములతో కుదేలైన కాంగ్రెస్ పార్టీ ఈసారి యునైటెడ్ అపోజిషన్ ఫోరం ద్వారా గట్టి పోటీ ఇవ్వాలని చూస్తోంది. గతంలో విడివిడిగా పోటీ చేయడం వల్ల ఓట్లు చీలి బీజేపీకి లాభం జరిగిందని గుర్తించిన కాంగ్రెస్, ఈసారి ప్రాంతీయ పార్టీలను కలుపుకుని వెళ్లాలని యోచిస్తోంది. అయితే, ముఖ్యమంత్రి హిమంత దూకుడును అడ్డుకోగల బలమైన రాష్ట్రస్థాయి నాయకత్వం కాంగ్రెస్‌లో లేకపోవడం ఆ పార్టీకి ప్రధాన బలహీనతగా మారింది. అస్సాంలో ముస్లిం జనాభా గణనీయంగా ఉండటం వల్ల, ఏఐయూడీఎఫ్ అధినేత బద్రుద్దీన్ అజ్మల్ పాత్ర కీలకమైంది. అయితే, కాంగ్రెస్ ఈసారి అజ్మల్‌తో దూరం పాటిస్తోంది. ముస్లిం ఓట్లు కాంగ్రెస్ , ఏఐయూడీఎఫ్ మధ్య చీలితే, అది నేరుగా బీజేపీకే లాభం చేకూరుస్తుంది. ఈ త్రిముఖ పోటీలో మైనారిటీ ఓటర్లు ఎటువైపు మొగ్గు చూపుతారనేది ఎన్నికల ఫలితాలను శాసించనుంది.అస్సాంలో ఎప్పుడూ ప్రాంతీయ అస్తిత్వం ప్రధాన పాత్ర పోషిస్తుంది. అస్సాం గణ పరిషత్ వంటి పార్టీలు బీజేపీతో ఉన్నప్పటికీ, అస్సాం ఒప్పందం , పౌరసత్వ సవరణ చట్టం వంటి అంశాలు ఇప్పటికీ నివురు గప్పిన నిప్పులా ఉన్నాయి. వీటిని కాంగ్రెస్ అనుకూలంగా మార్చుకోవాలని చూస్తుండగా, బీజేపీ ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా ఆ ప్రభావాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తోంది. ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే, క్షేత్రస్థాయిలో బీజేపీ వ్యవస్థాగతంగా చాలా బలంగా ఉంది. ప్రతిపక్షాల మధ్య ఐక్యత లేకపోవడం, హిమంత బిశ్వ శర్మకు ఉన్న ప్రజాదరణ బీజేపీకి హ్యాట్రిక్ విజయాన్ని అందించే అవకాశాలను మెరుగుపరుస్తున్నాయి. కాంగ్రెస్ కోలుకోవాలంటే కేవలం బీజేపీ వ్యతిరేకతే సరిపోదని, పటిష్టమైన ప్రత్యామ్నాయ ఎజెండాతో ప్రజల్లోకి వెళ్లాల్సి ఉంటుంది. మొత్తానికి 2026 అస్సాం పోరు భారత రాజకీయాల్లో అత్యంత ఆసక్తికరమైన సమరంగా మారబోతోంది.

# ఇదెక్కడి న్యాయం...



**హైదరాబాద్, ఫిబ్రవరి 25( వెలుతురు):**
కులం ఎప్పుడూ కూడు పెట్టదు. మతం ఎప్పుడూ మనుగడు ఇవ్వదు. ఈ మాటలు పుస్తకాలలో చాలా గొప్పగా ఉంటాయి. వాస్తవంలో మాత్రం అలా ఉండదు. ఎందుకంటే ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ జమానాలో ఉన్న మనం ఇప్పటికీ కులాన్ని పట్టుకొని తిరుగుతుంటాం. మతాన్ని ప్రతి విషయంలోనూ అదిమి పట్టుకుంటాం. దేశం విషయంలో ఏదైనా జరిగితే పట్టించుకోము గాని.. కులంలో.. మతంలో ఏదైనా తేడా జరిగితే మాత్రం రోడ్లమీదకి వస్తాం.గతంలో కులానికి సంబంధించి.. మతానికి సంబంధించి ఏవైనా ఘటనలు జరిగినప్పుడు అంతగా వెలుగులోకి వచ్చేవి కాదు. కానీ, ఇప్పుడు సోషల్ మీడియా అందుబాటులోకి వచ్చిన తర్వాత ఈ తరహా సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. కులం పేరుతో.. మతం పేరుతో దారుణాలు.. ఘోరాలు జరిగిన ఘటనలు అనేకం ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రంలో మాత్రము ఒక భిన్నమైన సంఘటన చోటు చేసుకుంది. కేవలం ఒక టికెట్ కోసం గొడవ జరిగింది.. అది కూడా ఒక జాతర సమయంలో టికెట్ కొనుగోలు చేయలేదని.. అగ్రకులాల వ్యక్తులు ఇష్టానుసారంగా ప్రవర్తించారు. టికెట్ కొనుగోలు చేయని కుటుంబం పై దాడి చేశారు. రెండు నెలల చిన్నారిని కాలుతో తన్నారు. దీంతో ఆ చిన్నారి కన్ను మూసింది. ఈ జాతర నిర్వహణను కాంగ్రెస్ పార్టీకి చెందిన కొంతమంది నాయకులు పర్యవేక్షిస్తున్నట్టు తెలుస్తోంది.నాగర్ కర్నూలు జిల్లా కుమ్మెర మల్లికార్జున స్వామి జాతరలో ఈ గొడవ జరిగింది. ఈ గొడవలో రెండు నెలల చిన్నారి చనిపోయింది. జాతరకు వెళ్లిన భక్తుల పట్ల నిర్వాహకులు అమర్యాదగా ప్రవర్తించారు. ఇదే సమయంలో దాడి కూడా చేశారు. దాడి జరుగుతున్న సమయంలో రెండు నెలల పసికందు పురాణాలు కోల్పోయింది. ఈ సంఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. చివరికి బీసీ కమిషన్ స్పందించి.. నోటీస్ కూడా జారీ చేసింది.కుమ్మెర గ్రామానికి చెందిన గణేష్, తన భార్య మౌనికతో కలిసి ఈ నెల 18న మల్లన్న జాతరకు వెళ్ళాడు. గణేష్ జాతరకు వెళ్తున్న సమయంలో వారి వెంట బంధువు చంద్రకళ.. రెండు నెలల చిన్నారి కూడా ఉంది. దేవదర్శనానికి గణేష్ కుటుంబం వెళ్తుండగా.. టికెట్ ధర విషయంలో గొడవ జరిగింది. ఆలయ నిర్వహకుడు శ్రీనివాసరెడ్డి.. చంద్రకళ తీవ్రంగా గొడవపడ్డారు. వంద రూపాయలు చెల్లించాలని శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేయడంతో.. చంద్రకళ ఇవ్వడానికి ఒప్పుకోలేదు. దీంతో గణేష్, ఆలయ నిర్వాహకులకు గొడవ జరిగింది. చివరికి తోపులాట జరిగింది. ఈ ఘటనలో మౌనిక.. తన చిన్నారితో సహా కింద పడిపోయింది. ఆ సమయంలో ఊపిరి ఆడక చిన్నారి అస్వస్థతకు గురైంది. ఆ చిన్నారిని ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. అయితే శనివారం రాత్రి చిన్నారి చనిపోయింది.ఆధిపత్య కులాలు ఇష్టానుసారంగా వ్యవహరించడం వల్లే ఈ దారుణం జరిగిందని మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఈ ఘటనను తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. ఈ నేపథ్యంలో బీసీ కమిషన్ నోటీసులు కూడా ఇచ్చింది. వంద రూపాయలు టికెట్ విషయంలో జరిగిన గొడవ.. రెండు నెలల చిన్నారి ప్రాణం తీసింది. ఇప్పటికి మనం గొప్పగా ఉన్నామని.. అత్యంత ఆధునికమైన జీవితాన్ని గడుపుతున్నామని చెప్పుకుంటాం. కానీ కులం కుంపట్లు.. మతం మంటల్లో నిత్యం కాలిపోతూనే ఉంటాం. నాగర్ కర్నూల్ జిల్లాలో జరిగిన ఈ సంఘటనే ఒక బలమైన నిదర్శనం.

# ఆ ఇద్దరికి ఇన్విటేషన్ మిస్



**హైదరాబాద్, ఫిబ్రవరి 25( వెలుతురు):**
ఇప్పటివరకు ఎవరికీ సాధ్యం కానీ రీతిలో గొప్ప సినిమాలను తీయగలిగే కెపాసిటి ఉన్న దర్శకులు చాలామంది ఉన్నారు. అయినప్పటికి కొంతమందికి మాత్రమే ఇండస్ట్రీలో చాలా మంచి గుర్తింపైతే వచ్చింది?ఇక స్టార్ హీరోలుగా వెలుగొందుతున్న వాళ్లు సైతం ఆయా దర్శకుల డైరెక్షన్లో నటించి భారీ విజయాలను సాధించారు. ముఖ్యంగా సందీప్ రెడ్డివంగ ? విజయ్ దేవరకొండ కాంబినేషన్లో వచ్చిన 'అర్జున్ రెడ్డి' సినిమాకి భారీ రెస్పాన్స్ వచ్చింది. ఈ ఒక్క సినిమాతోనే విజయ్ స్టార్ హీరోగా మారిపోయాడు? ఇక ప్రస్తుతం విజయ్ దేవరకొండ రష్మిక మందాన పెళ్లి చేసుకున్న విషయం మనకు తెలిసిందే. ఫిబ్రవరి 26వ తేదీన వీళ్ళ పెళ్లి రాజస్థాన్ లోని ఉదయపూర్ లో జరుగుతుంది. అయితే వీళ్ళ పెళ్లికి పెద్దగా అతిథులు ఎవరు హాజరవ్వకపోతుండడం విశేషం? ఇక ఇండస్ట్రీలో ఉన్న సెలెబ్రెటీలు, సినిమా హీరోలు రాజకీయ నాయకులను హైదరాబాద్లో ఎరుపు చేసిన రిసెప్షన్ ని పిలిచినట్టుగా తెలుస్తుంది. ఇక మార్చి 4వ తేదీ ఈ రిసెప్షన్ ఉండబోతుందట. ఈ ఫంక్షన్ కి ఇండస్ట్రీలో ఉన్న స్టార్ హీరోలందరు రావాలని వాళ్లందరికీ ఇన్విటేషన్ అందినప్పటికి నానికి అలాగే నిఖిల్ కి మాత్రం ఇన్విటేషన్ అయితే ఇవ్వలేదట.కారణం ఏంటి అంటే నాని విజయ్ దేవరకొండకు మధ్య కొన్ని విభేదాలు ఉన్నాయని అందువల్ల వాళ్ళిద్దరూ ప్రస్తుతం మాట్లాడుకోవడం లేదని వార్తలైతే వస్తున్నాయి. ఇక నిఖిల్ సైతం అర్జున్ రెడ్డి సినిమా వచ్చినప్పుడు విజయ్ దేవరకొండ మీద కొన్ని కామెంట్లయితే చేశాడు.దాంతో అతనిని కూడా తను పక్కన పెట్టినట్టుగా తెలుస్తుంది. ప్రస్తుతం వీళ్లిద్దరి మధ్య కూడా మాటలైతే లేవట. ఇక వీళ్ళిద్దరితో పాటుగా విజయ్ ఇంకెవరికి ఇన్విటేషన్ ఇవ్వలేదనే విషయం మీద క్లారిటీ రావాల్సిన అవసరమైతే ఉంది. మొత్తానికైతే వీళ్ళిద్దరికీ ఇన్విటేషన్ రాలేదన్న న్యూస్ సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ చేస్తున్నారు.ఇక ఏది ఏమైనా కూడా విజయ్ ఇండస్ట్రీలో ఇప్పుడిప్పుడే స్టార్ హీరోగా ఎదుగుతున్నాడు. కాబట్టి తను ఎలాంటి బేషజాలు లేకుండా తన తోటి హీరోలందరితో బాగుంటూనే అతని సినిమా కెరియర్ బాగుంటుందని మరి కొంతమంది సినిమా మేధావులు చెబుతున్నారు?

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com